

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 302

సోమవారం 23-1-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ముందే రిటైర్మెంటా..!

20 ప్లస్‌లో ఆరంభిస్తే సాధ్యమే.. వ్యవధి ఎక్కువ ఉంటే లక్ష్యం తేలిక -13లో



హతవిధి!

ప్రపంచకప్ హాకీ టోర్నీలో న్యూజిలాండ్ చేతిలో ఓడిన భారత్. -12లో



పెరూ ఆందోళనల్లో హింస

పెరూలో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. డిసెంబర్ నుంచి ఇప్పటి దాకా 55 మందికిపైగా చనిపోయారు.


- వివరాలు 6లో▶



మరో ఆరు రహస్య ఫైళ్లు

రహస్య ఫైళ్ల వ్యవహారం అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు చుట్టుకుంటోంది. ఆయన నివాసంలో చేపట్టిన సోదాల్లో మరో ఆరు ఫైళ్లు దొరికాయి.

- వివరాలు 6లో▶



'పోలీసింగ్' బలోపేతం

పోలీసు దళాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు.

- వివరాలు 6లో▶



ఆమె 'కమాండ్'లో

భారత ఆర్మీలో సియాచిన్ సహా వివిధ కమాండ్ యూనిట్లను మహిళలు కూడా ముందుండి నడిపించనున్నారు.

- వివరాలు 6లో▶

తొలుత ఎస్‌ఏలు.. తర్వాత ఎస్జీటీలు!

ఉపాధ్యాయుల పదోన్నతులపై సర్కారు ఆలోచన

నేడు టీచర్ల బదిలీలు, ప్రమోషన్ల షెడ్యూల్ విడుదల

- మార్గదర్శకాలకు కొంత సమయం పట్టే అవకాశం!
- బదిలీల ప్రక్రియ, నిబంధనలపై నిరసనలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్ సోమవారం విడుదల కానుంది. షెడ్యూల్ వెలువడినప్పటికీ ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలకు మాత్రం కొంత సమయం పడుతుందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నెల 27 నుంచి టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మొదలవుతుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఇప్పటికే ప్రకటించారు. కానీ ప్రభుత్వం చేపట్టనున్న ఈ ప్రక్రియపై ఉపాధ్యాయ వర్గాల్లో అనేక సందేహాలు, ఆందోళనలు, అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. అయితే ఎన్నికల సంవత్సరం కావడంతో సమస్యలకు ఏదో రకంగా పరిష్కారం చూపించే ముందుకెళ్లాలని ప్రభుత్వం యోచిస్తోంది.

స్పౌజ్ కేసులకు పరిష్కారం

తీవ్ర వివాదం రేపుతున్న స్పౌజ్ కేసులను పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 317 జీవో కారణంగా వేర్వేరు ప్రాంతాల్లో పనిచేస్తున్న భార్యాభర్తలు 2,100 మంది వరకూ ఉన్నారు. వీరంతా తమను ఒకే ప్రాంతానికి మార్చాలని ఆందోళనలకు దిగుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత బదిలీల్లో 675 మందికి మాత్రమే అవకాశం కల్పించడంతో ఇటీవల పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో మొత్తం 1,600 మందిని ప్రస్తుత బదిలీల్లో చేర్చి, ఇంకా మిగిలిన వారిని డిప్యుటేషన్ ద్వారా కోరుకున్న ప్రాంతాలకు బదిలీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నారు. అయితే

మిగతా 2వ పేజీలో ▶

ఖాళీలు 21 వేలపైనే..

ప్రమోషన్ల తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 21 వేల టీచర్ పోస్టుల ఖాళీలు ఉండే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముందుగా స్కూల్ అసిస్టెంట్లు (ఎస్‌ఏలు) పదోన్నతులు పొందే వీలుంది. ఆ తర్వాత సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)లకు ప్రమోషన్లు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రస్తుతం 1,944 ప్రధానోపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తేల్చారు. వీటిని స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేస్తారు. ఇప్పటికే ఖాళీగా ఉన్నవి, పదోన్నతుల ద్వారా ఖాళీ అయ్యేవి కలుపుకొంటే మొత్తం 7,111 వరకూ ఎస్‌ఏ పోస్టులు ఖాళీగా ఉండే వీలుంది. వీటిల్లో ఎస్జీటీల ద్వారా 70 శాతం భర్తీ చేస్తారు. మిగిలిన 30 శాతం నేరుగా డీఎస్సీ ద్వారా నియమించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఎస్జీటీ పోస్టులు 9 వేల వరకూ ఖాళీగా ఉన్నాయి. పదోన్నతులు పొందే వారిని కలుపుకొంటే మరో 5 వేల వరకూ కొత్త ఖాళీలు ఏర్పడతాయి. ఇలా మొత్తంగా 21 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంటుంది.



హైదరాబాద్‌లో ఆందోళన చేస్తున్న ఉద్యోగులను తమ వాహనంలో తరలిస్తున్న పోలీసులు

ఆందోళన ఉద్ధృతం

ప్రగతిభవన్ ముట్టడికి యత్నించిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు 2లో

మాకూ బదిలీలు, పదోన్నతులు

- గురుకులాల బోధన, బోధనేతర సిబ్బంది డిమాండ్
- మంత్రులు, సొసైటీల కార్యదర్శులకు మూకుమ్మడి వినతులు

- వివరాలు 2లో▶

• నాన్న జ్ఞాపకాలు పదిలం

అణచివేతకు గురయ్యే వారిని ప్రేమించాలని చెప్పేవారు



నాన్న హత్య తర్వాత ఫిడేల్ క్యాస్ట్రో అన్నీ తానై చూసుకున్నారు

'చేగువేరా–వైద్యం' అనే పుస్తకం రాస్తున్నా

క్యూబాలో నూరు శాతం స్త్రీ, పురుష సమానత్వం

'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో విప్లవవీరుడు చేగువేరా కుమార్తె అలైదా గువేరా

బొల్లోజు రవి

ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టులకు స్ఫూర్తి ప్రదాత అయిన నిన్నటితరం గెరిల్లా యుద్ధ యోధుడు, మార్క్సిస్టు విప్లవవీరుడు చేగువేరా నేటి యువతరానికీ ఓ ఐకాన్. తండ్రి విప్లవ బాటను నిలువెల్లా నింపుకున్న ఆయన కుమార్తె, మానవ హక్కుల కార్యకర్త డాక్టర్ అలైదా గువేరా 'సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిద్దాం... ప్రపంచ శాంతిని కాపాడుకుందాం' అంటూ ప్రపంచమంతా చాటి చెబుతున్నారు. క్యూబా రాజధాని హవానాలోని విలియం సోలెర్ చిల్డ్రన్స్ హాస్పిటల్లో వైద్యురాలిగా పనిచేస్తూనే ప్రపంచ దేశాల్లో జరిగే వివిధ కార్యక్రమాలకు ఆమె హాజరవుతుంటారు. క్యూబా సంఘీభావ యాత్రలో భాగంగా భారత్‌లో పర్యటిస్తున్న అలైదా గువేరా ఆదివారం తన కుమార్తె, చేగువేరా మనవరాలు ప్రొఫెసర్ ఎస్తిఫినా గువేరాతో కలసి హైదరాబాద్ వచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ అలైదా గువేరా 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

నాన్నతో గడిపిన కాలం గుర్తుంది...

లాటిన్ అమెరికా దేశాల్లో విప్లవాన్ని రగిలించేందుకు వెళ్లిన నాన్నను బొలీవియాలో 1967లో అమెరికా అనుకూల బొలీవీయా దళాలు కాల్చి చంపినప్పుడు నాకు సుమారు ఏడేళ్లు. అయినప్పటికీ ఆయనతో గడిపిన క్షణాలు నాకు ఇప్పటికీ

మిగతా 3వ పేజీలో ▶

విజయం సాధించేవరకు పోరాడతాం

క్యూబా సంఘీభావ సభలో చేగువేరా కుమార్తె అలైదా 3లో

న్యూస్‌రీల్

భయానక పరిస్థితిని ఎదుర్కొన్నా



'నా ఇంట్లో ఒక ఆగంతకుడు చొరబడటంతో గత రాత్రి అత్యంత భయానక పరిస్థితిని ఎదుర్కొన్నా. అప్రమత్తతతో ఉండటంతో నా ప్రాణాలను రక్షించుకోగలిగాను' అని ముఖ్యమంత్రి కార్యదర్శి స్మితా సబర్వాల్ ఆదివారం ట్విట్టర్ ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు.

- వివరాలు 5లో▶

చిచ్చుపెట్టే శక్తుల్ని దూరం పెట్టాలి



కులం, మతం, భాష, వర్ణం, వర్గం పేర్లతో ప్రజల్ని విభజించే వ్యక్తుల్ని, శక్తుల్ని దూరం పెట్టాల్సిన అవసరం ఉందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఆదివారం భారతమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజాలో భారతమాత మహాహారతి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.

- వివరాలు 5లో▶

పెట్స్‌కు బీమా.. యజమానికి ధీమా



ప్రాణప్రదంగా పెంచుకున్న పెంపుడు జంతువులకు బీమా కల్పించడం ఇటీవలి కాలంలో అనూహ్యంగా పెరిగింది. ఆపదలో ఉన్న పెట్స్‌కు బీమా రూపంలో చికిత్స అందించేందుకు నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు.

- వివరాలు 14లో▶

ఇదేం 'శిక్ష'ణ..?

శిక్షణ పూర్తికాకుండానే కోచింగ్ సంస్థలకు సొమ్ములు!

బీసీ స్టడీ సర్కిల్ శిక్షణ కార్యక్రమాల్లో వెలుగు చూసిన మోసం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్–3, గ్రూప్–4 ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చే కాంట్రాక్టులు పొందిన పలు ప్రైవేటు కోచింగ్ సంస్థలు శిక్షణ పూర్తి చేయకుండానే సర్కారు సొమ్మును అప్పనంగా దండుకున్న ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆయా సంస్థల నిర్వాకంతో విలువైన సమయాన్ని కోల్పోయిన అభ్యర్థులు పలు జిల్లాల్లో ఏకంగా కలెక్టర్లకు ఫిర్యాదు చేయడంతో వాస్తవ పరిస్థితిని సమీక్షించిన అధికారులకు అసలు సంగతి తెలిసింది. ఇంత జరిగినా అధికారులు కేవలం నోటీసులతో సరిపెట్టి ఇక చేసేదేంలేదని చేతులు దులుపుకోవడం గమనార్హం.

'ప్రైవేటు'కు అప్పగించి...

బీసీ అభ్యర్థులకు మూడు నెలలపాటు శిక్షణ అందించాలనే లక్ష్యంతో తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ గతేడాది సెప్టెంబర్ 15న రాష్ట్రవ్యాప్తంగా 50 స్టడీ సెంటర్లను తెరిచింది. ఒక్కో కేంద్రంలో 100 మంది అభ్యర్థులను శిక్షణకు ఎంపిక చేసింది. ఒక్కో అభ్యర్థికి మూడు నెలల పాటు అయ్యే శిక్షణ వ్యయాన్ని రూ. 5 వేల చొప్పున ఖరారు చేశారు. ఈ ఫీజును బీసీ సంక్షేమ శాఖ భరిస్తూ... అభ్యర్థులకు మాత్రం ఉచిత శిక్షణ ఇచ్చేందుకు స్టడీ సెంటర్లను తెరిచింది. ఈ లెక్కన ఒక్కో కేంద్రంలో 100 మంది అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు రూ. 5 లక్షలు ఖర్చు కానుండగా రాష్ట్రవ్యాప్తంగా 50 సెంటర్ల ద్వారా అయ్యే మొత్తం శిక్షణ ఖర్చు రూ. 2.5 కోట్లుగా ప్రభుత్వం తేల్చింది. ఈ మొత్తంతో అభ్యర్థులకు మూడు నెలలు శిక్షణ ఇవ్వాల్సిన బాధ్యతను బీసీ స్టడీ సర్కిల్ ఏడు ప్రైవేటు సంస్థలకు కాంట్రాక్టు అప్పగించింది. ఇందులో ఒక సంస్థకు ఏకంగా 20 స్టడీ సెంటర్ల బాధ్యతలు ఇవ్వగా మిగతా ఆరు సెంటర్లకు ఐదేసి సెంటర్ల చొప్పున శిక్షణ బాధ్యతలు ఇచ్చింది.

సబ్ కాంట్రాక్టు పేరుతో మాయ..

ఇంతవరకు బాగానే ఉన్నా... శిక్షణ బాధ్యతలు తీసుకున్న ప్రైవేటు సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరించాయి. అభ్యర్థులకు నేరుగా శిక్షణ ఇచ్చే బదులు ఆ బాధ్యతను కొందరికి సబ్ కాంట్రాక్టు ఇచ్చాయి. 20 స్టడీ సెంటర్ల

మిగతా 5వ పేజీలో ▶



చిత్తారమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం

హైదరాబాద్‌లోని గాజులరామారంలో శ్రీ చిత్తారమ్మ దేవి ప్రధాన జాతర ఆదివారం కన్నులపండువగా జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు నగరం నుంచే కాకుండా సరిహద్దు జిల్లాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. రాత్రి పొద్దుపోయే వరకు అమ్మవారిని దర్శించుకునేందుకు జనం వచ్చారు.


అమెరికాలో కాల్పులు.. 10 మంది మృతి



6లో

- అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో భారీ కాల్పుల ఘటన చోటుచేసుకుంది. చైనీస్ లూనార్ నూతన సంవత్సర వేడుకల్లో దుండగుడు జరిపిన కాల్పుల్లో 10 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 10 మంది గాయపడ్డారు. ఆసియా సంతతి వారు, ముఖ్యంగా చైనీయులు అత్యధికంగా నివసించే మాంటెరీ పార్క్‌లోని గార్వే అవెన్యూలోని ఓ డ్యాన్స్ క్లబ్‌లో శనివారం రాత్రి 10.22 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

ఆ రూ. 495 కోట్లు ఇప్పించండి



- ఏపీ బదలాయించిన కేంద్ర ప్రాయోజిత పథకాలకు (సీఎస్‌ఎస్) సంబంధించిన రూ.495 కోట్లు తిరిగి ఇప్పించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు హరీశ్‌రావు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. -10లో

ప్రజల పోరాటంతోనే రామప్పకు

యునెస్కో గుర్తింపు



మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వాలి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

- వివరాలు 5లో▶

ఇంతంజాత్



రజాకార్లను తరిమినోళ్లం.. కేసీఆర్‌ను ఓడించలేమా?

- సీఎం ఇచ్చిన ధైర్యంతోనే దళితులు, ఎస్టీలపై బీఆర్‌ఎస్ నేతల దాడులు: రేవంత్ రెడ్డి
- కాంగ్రెస్ కార్యకర్తలపై ప్రభుత్వ దౌర్జన్యం: మాణిక్‌రావ్ ఠాక్రే
- నాగర్‌కర్నూల్ జిల్లాలో కాంగ్రెస్ 'దళిత, గిరిజన ఆత్మగౌరవ' సభ

సాక్షి, నాగర్‌కర్నూల్: సీఎం కేసీఆర్ ఇచ్చిన ధైర్యంతోనే బీఆర్‌ఎస్ శ్రేణులు అరాచకాలకు పాల్పడుతున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మార్కండేయ ప్రాజెక్టు కట్టాలని డిమాండ్ చేసిన దళితులు, గిరిజనులపై బీఆర్‌ఎస్ నేతలు దాడులు చేయడం దారుణమని మండిపడ్డారు. భూస్వాములు, దొరలను నిలువరించిన ఈ గడ్డ దళితులపై దాడులను చూస్తూ ఊరుకోదన్నారు. రజాకార్లను తరిమికొట్టిన, ఆంధ్రా నాయకులను పొలిమేర దాటించిన వాళ్లం రేపు కేసీఆర్‌ను ఓడించలేమా? అని ప్రశ్నించారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో కాంగ్రెస్ నిర్వహించిన 'దళిత, గిరిజన ఆత్మగౌరవ సభ'లో రేవంత్ మాట్లాడారు.

దళితులకు కాంగ్రెస్‌తోనే అండ

తెలంగాణకు తొలి సీఎం దళితుడేనని చెప్పి దరిద్రపు సీఎం వచ్చారని.. అంబేద్కర్ జయంతి, వర్ధంతి జరపని

మిగతా 2వ పేజీలో ▶





నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో నిర్వహించిన సభలో కాంగ్రెస్ నేతలు నాగం, మాణిక్‌రావు ఠాక్రే, రేవంత్ రెడ్డి, సంపత్, షబ్బీర్ అలీ

ఆదివాసీలే అడవికి బాస్‌లు

- అటవీ హక్కుల సమస్యను పరిష్కరిస్తాం: కేంద్ర మంత్రి అర్జున్ ముండా
- కేసీఆర్‌కు సీఎంగా వచ్చే అసెంబ్లీ సమావేశాలే చివరివి: బండి సంజయ్
- నాగోబాను దర్శించుకున్న కేంద్ర మంత్రి, ఎంపీలు



మెస్రం పెద్దలతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి అర్జున్ ముండా, బండి సంజయ్

సాక్షి, ఆదిలాబాద్: వనంతో మమేకమై ఉండే ఆదివాసీలే దానికి యజమానులు అని మోదీ ప్రభుత్వం భావిస్తోందని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి అర్జున్ ముండా స్పష్టం చేశారు. ఆదివాసీలకు అటవీ భూముల హక్కుల కల్పనలో తెలంగాణ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని ఆయన ఆరోపించారు. ఈ ప్రభుత్వం చేయకపోతే.. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ సర్కార్ అధికారంలోకి రాగానే తప్పకుండా ఆ పని చేస్తుందని హామీనిచ్చారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో నాగోబాను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో కలిసి ఆదివారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం దర్బార్ హాల్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. గత ఎనిమిదేళ్లుగా మోదీ సర్కార్ ఆదివాసీల కోసం పనిచేస్తోందన్నారు. రాష్ట్రపతిగా ఆదివాసీ మహిళ ద్రౌపదీ ముర్మును చూస్తే గిరిజనులపై ప్రధానమంత్రికి ఉన్న చిత్తశుద్ధి ప్రస్ఫుటమవుతుందన్నారు. మొదట అందరికీ నమస్కారం అంటూ ఆయన తెలుగులో ప్రసంగం ప్రారంభించి ఆ తర్వాత హిందీలో మాట్లాడారు. దర్బార్ హాల్‌లో కేంద్ర మంత్రి నేలపై కూర్చొని మెస్రం పెద్దలతో సమస్యల

మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

టీచర్లను బేషరతుగా విడుదల చేయండి

వారి డిమాండ్లను పరిష్కరించండి: బండి సంజయ్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: అరెస్ట్ చేసిన టీచర్లను బేషరతుగా విడుదల చేయడంతో పాటు వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేసీఆర్ సర్కార్ తీరు వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్టుగా ఉందని ఆదివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. 'కేసీఆర్... పసిపిల్లలు ఏడుస్తున్నా నీ మనసు కరగడం లేదా? తల్లులను, పిల్లలను వేరుచేసి అరెస్ట్ చేస్తారా? ఓట్లు, సీట్ల రాజకీయం తప్ప మానవ సంబంధాలు, భావోద్వేగాలు నీకు పట్టవా? మానవత్వం లేదా'అని ప్రశ్నించారు. భార్యభర్తలు ఒకేచోట పనిచేసే అవకాశం కల్పించాలని అడగడమే నేరమా అని నిలదీశారు. కనీసం ఈ అంశంపై వారితో చర్చించాలన్న ఆలోచన కూడా ప్రభుత్వం చేయకపోవడం సిగ్గు చేటన్నారు. 317 జీవోను సవరించాలని కోరుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేస్తున్న టీచర్లపట్ల పోలీసులు అనుసరించిన వైఖరి అత్యంత అమానుషంగా ఉందన్నారు. భార్యను ఒక దగ్గర, భర్తను మరోచోట బదిలీ చేయడం అన్యాయమని, దీనిని ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరారు. ఈ సమస్యపై ప్రభుత్వం స్పందించకపోతే బీజేపీ అధికారంలోకి వచ్చాక 317 జీవోను సవరించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేస్తామని బండి సంజయ్ పేర్కొన్నారు.

ఫిబ్రవరిలో అసెంబ్లీ రద్దవుతుంది..

మేలో ఎన్నికలు వస్తాయ్: కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



కోదాడ: కేసీఆర్ ఫిబ్రవరిలోనే అసెంబ్లీని రద్దు చేస్తారని, కర్ణాటకతో పాటు మే నెలలోనే రాష్ట్రంలో ఎన్నికలు వస్తాయని బీజేపీ నాయకుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కోదాడ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో రానున్న ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని, ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను బొందపెట్టి కేసీఆర్‌ను గద్దె దించి ఫాంహౌజ్‌కు పంపాలని ఆయన పిలుపునిచ్చారు. ఇక నుంచి కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలలో విస్తృతంగా పర్యటిస్తానని ఆయన తెలిపారు. ప్రతిపక్షాల మధ్య ఓట్లు చీలి మళ్లీ తాను అధికారంలోకి వస్తానని కేసీఆర్ కలలు కంటున్నారని, ఆయన కలలన్నీ పగటి కలలుగానే మిగిలే విధంగా బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గవర్నర్ ప్రసంగంతోనే బడ్జెట్ సమావేశాలు

బీజేపీ నేత రామచందర్‌రావు డిమాండ్



సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగ విలువలు, ఫెడరల్ వ్యవస్థ స్ఫూర్తిని గౌరవిస్తూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను గవర్నర్ ప్రసంగంతో మొదలుపెట్టి ప్రభుత్వ విధానాలను ప్రకటించాలని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు డిమాండ్ చేశారు. ఈ ప్రసంగం లేకుండానే సమావేశాలు నిర్వహిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి విధివిధానాలు లేవని స్పష్టమవుతుందన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ప్రకటించిన విధంగా లక్ష ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతి చెల్లింపు తదితరాలపై గవర్నర్‌తో విధాన ప్రకటన చేయించాలన్నారు. ప్రభుత్వం సిద్ధం చేసిన విధాన ప్రకటననే గవర్నర్ చదివి వినిపించే ఆనవాయితీ ఉన్నా అసెంబ్లీని ప్రోరోగ్ చేయలేదనే సాంకేతిక అంశాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.

'మాదిగల వల్లనే తెలంగాణ బిల్లు ఆమోదం'



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

సుందరయ్య విజ్ఞానకేంద్రం: మాదిగల వల్లనే నాడు తెలంగాణ బిల్లు ఆమోదం జరిగిందని మాజీ ఎంపీ మందా జగన్నాథం అన్నారు. తెలంగాణ బిల్లు ఆమోదంలో స్పీకర్ మీరాకుమారి, సుశీల్‌కుమార్ షిండేలతోపాటు అనేక మంది మాదిగ ఎంపీలు కృషిచేశారని గుర్తుచేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మాదిగ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో మాదిగ, మాదిగ ఉపకులాల మేధావులకు ఘన సన్మానం జరిగింది. ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు మాట్లాడుతూ.... ఎస్సీ వర్గీకరణ విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. ఫోరం అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పల్లెల వీరస్వామి, ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ వాసర్ల సతానియేలు, ప్రొఫెసర్ కాశీం, ఎమ్మెల్యేలు టి, రాజయ్య, డాక్టర్ ఆనందం తదితరులు పాల్గొన్నారు.

● చెత్త దూరం..

కరెంటు లాభం!

రాష్ట్రంలో పెరుగుతున్న 'చెత్త నుంచి విద్యుదుత్పత్తి'

- హైదరాబాద్‌లో ఇప్పటికే 24 మెగావాట్లు
- త్వరలో 14.5 మెగావాట్ల ప్లాంట్ ప్రారంభం
- 100 మెగావాట్ల ఉత్పత్తి లక్ష్యంగా జీహెచ్ఎంసీ చర్యలు



జవహర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విద్యుదుత్పత్తి ప్లాంట్

సాక్షి, హైదరాబాద్: రోజురోజుకు మరింతగా జనాభా పెరిగిపోతున్న గ్రేటర్ హైదరాబాద్ నగరంలో వెలువడుతున్న చెత్త కూడా అంతే స్థాయిలో పెరిగిపోతోంది. ఈ చెత్తను డంప్ చేస్తే కాలుష్యం, మురికి, అనారోగ్య సమస్యలు. ఈ క్రమంలోనే అటు చెత్త సమస్యకు చెక్ పెట్టడం, ఇటు విద్యుత్‌ను ఉత్పత్తి చేసి ప్రయోజనం పొందడం లక్ష్యంగా జీహెచ్ఎంసీ చర్యలు చేపట్టింది. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్లను ప్రోత్సహిస్తోంది. జవహర్‌నగర్‌లో తొలుత 19.8 మెగావాట్ల ఉత్పత్తితో ప్రారంభమైన రాంకీ సంస్థ (రీసస్టైయినబిలిటీగా పేరు మారింది) ప్లాంట్ సామర్థ్యం ప్రస్తుతం 24 మెగావాట్లకు పెరిగింది. మరో 24 మెగావాట్ల ఉత్పత్తికి ప్రభుత్వం అనుమతించింది. ఈ సంస్థ మార్చి చివరినాటికి దుండిగల్‌లో 14.5 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ప్రారంభించనుంది. ఇదిగాక నగర శివార్లలో ఏర్పాటు కానున్న పలు ప్లాంట్లతో రెండేళ్లలో వంద మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పనులు జరుగుతున్నాయి.

మున్సిపల్ వ్యర్థాల నుంచి తక్కువే..

గత సంవత్సరం కేంద్ర మంత్రి ఆర్‌కేసింగ్ రాజ్యసభలో ఇచ్చిన సమాచారం మేరకు దేశంలో చిన్నవి, పెద్దవి కలిపి 249 ప్లాంట్లు చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. వీటిలో మున్సిపల్ వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసేవి 11 ప్లాంట్లే. వీటి సామర్థ్యం 132.1 మెగావాట్లు. ఇటీవల మరికొన్ని ప్లాంట్లు ఏర్పాటు చేయడంతోపాటు మరికొన్ని ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకున్నాయి. ఇక దేశంలోని అన్ని నగరాల్లో భారీగా చెత్త వెలువడుతున్నా.. దాన్ని విద్యుత్‌గా మార్చే ప్లాంట్లు కొన్ని నగరాల్లోనే ఉన్నాయి.

ఎప్పటికప్పుడు చెత్త ప్రాసెస్

చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే చెత్తగుట్టలు పోగుపడవు. ఘన వ్యర్థాలు (చెత్త) ఎప్పటికప్పుడు ప్రాసెస్ అవుతాయి. శివార్లలోని పలు ప్రాంతాల్లో చెత్త ట్రీట్‌మెంట్‌తోపాటు ఆ సమీపంలోనే ఉండే ప్లాంట్లతో విద్యుత్ ఉత్పత్తి జరగనుంది. మున్సిపల్ కార్మికులు సేకరించే చెత్తలో విద్యుత్‌కు పనికొచ్చేది దాదాపు 50 శాతం ఉంటుంది. మిగతా చెత్తను కంపోస్టు, రీసైక్లింగ్‌తో ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీ వంటి వాటికి వినియోగిస్తారు. అంతిమంగా ఎందుకూ పనికిరానిదాన్ని పాతిపెడతారు. మరోవైపు చెత్తనుంచి విద్యుత్ ఉత్పత్తిపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. అది అంత శ్రేయస్కరం కాదని, ఖర్చు కూడా ఎక్కువని పర్యావరణవేత్తలు చెప్తున్నారు.

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా..

హైదరాబాద్ నగరంలో ఏటికేడు పెరుగుతున్న చెత్తను, తద్వారా ఉత్పత్తి చేయగల విద్యుత్‌ను జీహెచ్ఎంసీ అధికారులు 2018లో అంచనా వేశారు. ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి 70–100 టన్నుల చెత్త అవసరమవుతుంది. వంద మెగావాట్ల ఉత్పత్తికి దాదాపు పదివేల టన్నులు కావాలి. ప్రస్తుతం నగరంలో రోజూ 7000 టన్నుల చెత్త వెలువడుతోంది. పరిసర మున్సిపాలిటీలను కలిపితే ఇది పదివేల టన్నులకు చేరుకుంటుందని అంచనా. దీనికి తగినట్టుగా విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు.

సిటీ శివార్లలోని విద్యుత్ ప్రాజెక్టుల పరిస్థితి ఇదీ..

- యాచారంలో శ్రీవెంకటేశ్వర గ్రీన్ పవర్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌కు 12 మెగావాట్ల ఉత్పత్తికి ప్రభుత్వ అనుమతి ఉంది. మరో 2 మెగావాట్లు పెంచి 14 మెగావాట్లకు అనుమతించాల్సిందిగా ఆ సంస్థ కోరింది. అనుమతి వస్తే 14 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కానుంది.
- బీబీనగర్‌లో ఆర్‌ఎఫ్ పవర్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ 11 మెగావాట్ల ప్లాంట్ పనులు ప్రారంభమై చాలాకాలమైనా వివిధ కారణాలతో జాప్యం జరుగుతోంది. ఇటీవల యాజమాన్య మార్పు జరగడంతో పనులు వేగంగా అవుతాయని అధికారులు చెప్తున్నారు.
- 'రీసస్టైయినబిలిటీ లిమిటెడ్' ప్యారానగర్‌లో 15 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటు చేయనుంది.
- జవహర్‌నగర్‌లో ప్రస్తుతం 24 మెగావాట్లు, అదనంగా రానున్న 24 మెగావాట్లు, దుండిగల్‌లో 14.5 మెగావాట్లతోపాటు కొత్తగా రానున్న ప్లాంట్లన్నీ కలిపితే మొత్తం 102.5 మెగావాట్లకు 'చెత్త విద్యుత్' ఉత్పత్తి సామర్థ్యం పెరగనుంది.

ప్రస్తుతం చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేస్తున్న ప్లాంట్లలో కొన్ని..

నగరం	నిర్వహణసంస్థ	ఉత్పత్తి సామర్థ్యం
ఢిల్లీ	రీసస్టైయినబిలిటీ లిమిటెడ్	24 మెగావాట్లు
ఢిల్లీ	ఐఎల్ఎఫ్ఎస్	10 మెగావాట్లు
ఢిల్లీ	జిందాల్ గ్రూప్	21 మెగావాట్లు
ఢిల్లీ	తెహ్కాండ్ వేస్ట్ టు ఎనర్జీ లిమిటెడ్	25 మెగావాట్లు
జబల్‌పూర్	జబల్‌పూర్ ఎంఎస్‌డబ్ల్యూ లిమిటెడ్	11.5 మెగావాట్లు
హైదరాబాద్	రీసస్టైయినబిలిటీ లిమిటెడ్	24 మెగావాట్లు
గుంటూరు	జిందాల్ గ్రూప్	15 మెగావాట్లు
విశాఖపట్నం	జిందాల్ గ్రూప్	15 మెగావాట్లు
సోనేపట్	జేబీఎం గ్రూప్	8 మెగావాట్లు

జీరో వేస్ట్ లక్ష్యంగా..



హైదరాబాద్ నగరంలో చెత్తను వివిధ రకాలుగా వేరు చేయడంతో బయోగ్యాస్, కంపోస్టు ఎరువు వంటివాటితోపాటు విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. 'జీరో వేస్ట్' లక్ష్యంతో పనులు చేస్తున్నాం. తద్వారా చెత్త పేరుకు పోదు. చెత్త వస్తున్న చోటనే తడి-పొడిగా వేరుచేయడంలో ఇంకా కృషి జరగాల్సి ఉంది. మిగతా దశలకు సంబంధించి చాలా నగరాల కంటే మనం ముందంజలో ఉన్నాం.

– బి.సంతోష్, అడిషనల్ కమిషనర్ (పారిశుధ్యం, ఆరోగ్యం), జీహెచ్ఎంసీ

వ్యయమెక్కువ.. శ్రేయస్కరం కాదు..



చెత్త నుంచి విద్యుదుత్పత్తికి అధిక వ్యయం అవుతుంది. వాతావరణ కాలుష్యం సమస్య కూడా ఉంటుంది. విద్యుత్ కోసమే అయితే సోలార్ పవర్ ఖర్చు తక్కువ. చెత్త కుప్పలు కనిపించకుండా ఉండేందుకు విద్యుత్ ఉత్పత్తికి మొగ్గుచూపుతున్నారు. దీనికి ఎక్కువ ఇంధనం అవసరమవుతుంది. ఏర్పాటు చేసే కంపెనీలకు రాయితీలిస్తారు. ఇది శ్రేయస్కరం కాదు. చెత్తను ప్రాథమికంగానే వేరు చేయడం ఉత్తమ మార్గం. రీసైకిల్, రీయూజ్, రెడ్యూస్ విధానమే మేలైనది. దానివల్ల ఎక్కువమందికి జీవనోపాధి లభిస్తుంది.

– ప్రొఫెసర్ దొంతి నరసింహారెడ్డి, పర్యావరణవేత్త

మాకూ బదిలీలు, పదోన్నతులు

- గురుకులాల బోధన, బోధనేతర సిబ్బంది డిమాండ్
- మంత్రులు, సొసైటీ కార్యదర్శులకు మూకుమ్మడి వినతులు
- సాధారణ బదిలీలు జరిగి ఐదేళ్లు కావస్తుండటంతో స్థాన చలనం కోసం యత్నాలు
- నాలుగు సొసైటీల పరిధిలో 20 వేల మంది ఎదురుచూపులు



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది ఇప్పుడు బదిలీలు, పదోన్నతుల మంత్రాన్ని జపిస్తున్నారు. ప్రభుత్వ టీచర్ల బదిలీలు, పదోన్నతులకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, తమ విషయంలో కూడా ఈ ప్రక్రియ చేపట్టాలని గురుకులాల సిబ్బంది కోరుతున్నారు. చివరగా 2018 సంవత్సరంలో ప్రభుత్వం సాధారణ బదిలీలను నిర్వహించింది. ఈ ప్రక్రియ పూర్తయి ఐదేళ్లు కావస్తోంది. మరోవైపు నూతన జోనల్ విధానానికి అనుగుణంగా చాలామంది గురుకుల టీచర్లకు స్థానచలనం కలిగినప్పటికీ వారింకా పాత స్థానాల్లోనే పనిచేస్తున్నారు. తాజాగా సాధారణ బదిలీలు నిర్వహిస్తే తమకు పెద్ద ఎత్తున లబ్ధి కలుగుతుందనే భావన వారిలో ఉంది. గత మూడేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల విద్యా సంస్థల పరిధిలో కొత్త పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు కావడంతో తాజాగా బదిలీలు నిర్వహిస్తే కోరిన చోట పోస్టింగ్ వస్తుందని వారు ఆశిస్తున్నారు.

20వేల మందికి అవకాశం...!

మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్), తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్), తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్), తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఎంఆర్ఈఐఎస్)ల పరిధిలో దాదాపు వెయ్యికి పైగా గురుకుల విద్యా సంస్థలున్నాయి. వీటిల్లో 30 శాతం గురుకుల విద్యా సంస్థలు గత నాలుగేళ్లలో ఏర్పాటు చేసినవే. కొత్త గురుకులాల్లో మెజార్టీ టీచర్లు డిప్యుటేషన్ పద్ధతిలో కొనసాగుతుండగా, మరికొందరు కాంట్రాక్టు/తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్నారు. కాగా శాశ్వత ప్రాతిపదికన నియామకాల ప్రక్రియను ప్రభుత్వం ఇప్పుడిప్పుడే ప్రారంభించింది. ఈ క్రమంలో గురుకులాల్లో బదిలీలు చేపడితే అర్హత ఉన్న టీచర్లకు ఎక్కువ ఆప్షన్లు వస్తాయని భావిస్తున్నారు. ఈ మేరకు సంబంధిత మంత్రులు, గురుకుల సొసైటీల కార్యదర్శులు, ప్రభుత్వ కార్యదర్శులకు గురుకుల ఉద్యోగ సంఘాలు వరుసగా వినతిపత్రాలు సమర్పిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయి. ప్రస్తుతం గురుకులాల్లో బదిలీల ప్రక్రియ చేపడితే దాదాపు 20 వేల మందికి అవకాశం దక్కుతుందని సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు.

గ్రామీణ ప్రాంత ఉద్యోగులపై పని ఒత్తిడి

కొత్త గురుకుల పాఠశాలల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ప్రిన్సిపాల్స్, సిబ్బందిపై పని ఒత్తిడి తీవ్రంగా ఉంది. దీనిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. ప్రభుత్వ టీచర్ల మాదిరిగా గురుకులాల్లోనూ బదిలీలు నిర్వహించాలి. అర్హులందరికీ పదోన్నతులు ఇవ్వాలి. దీర్ఘకాలంగా పదోన్నతులు లేకుండా పనిచేస్తున్న లైబ్రేరియన్లు, పీఈటీలు, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ టీచర్లు, హెల్త్ సూపర్‌వైజర్లకు కూడా పదోన్నతులు కల్పించాలి.

– సీహెచ్ బాలరాజు, రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆందోళన ఉధృతం

- ప్రగతిభవన్ ముట్టడికి యత్నం
- అరెస్టు చేసిన పోలీసులు

పంజగుట్ట (హైదరాబాద్): జీవో 317 వల్ల నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘం ఆదివారం ఆందోళన ఉధృతం చేసింది. ఉద్యోగులు, తమ పిల్లల్ని తీసుకుని ప్రగతిభవన్ ముట్టడికి ప్రయత్నించగా.. అప్పటికే అక్కడ భారీగా పోలీసులు మోహరించడంతో పంజగుట్ట కూడలి వద్ద బైఠాయించారు. కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కొందరు సోమాజిగూడ కూడలిలో, మరికొందరు గ్రీన్‌ల్యాండ్స్ కూడలిలో నిరసన తెలిపేందుకు ప్రయత్నించగా పోలీసులు అందర్నీ అరెస్టు చేసి వివిధ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ జీవో 317 అమల్లో భాగంగా ఉద్యోగుల సీనియారిటీ ఆధారంగా కేటాయింపులు చేశారని వివరించారు. సీనియర్లు అభివృద్ధి చెందిన జిల్లాలను ఎంచుకోవడంతో.. జూనియర్లు అందరూ స్థానిక జిల్లాలను కోల్పోయి స్థానికేతర జిల్లాలకు వెళ్లాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికత కోల్పోయిన ఉద్యోగుల్లో చాలామందికి ఇంకా 25 నుండి 30 ఏళ్ల సర్వీస్ ఉందని.. వారు తిరిగి సొంత జిల్లాలకు వచ్చే అవకాశం లేకపోవడంతో ఏడాది కాలంగా తీవ్ర మనోవేదనకు గురౌతున్నారని, కొందరు మృతి చెందారని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

తొలుత ఎస్ఏలు.. తర్వాత ఎస్జీటీలు!

▶ మొదటి పేజీ తరువాయి

ఇలా చేయడం వల్ల ఖాళీలపై స్పష్టత ఉండదని ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇలావుండగా హెచ్ఎంలు ఒకే స్థానంలో పని చేయడానికి సంబంధించిన కాలపరిమితిని 5 నుంచి 8 ఏళ్లకు పెంచారు. ఈ మేరకు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న టీచర్లు రాజకీయంగా ఒత్తిడి తెచ్చారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. దీనిపై మిగతా వారిలో వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.

ముందస్తుగా అదుపులోకి నేతలు

జిల్లాల పునర్విభజన నేపథ్యంలో అమలు చేసిన 317 జీవో వివాదాస్పదంగా మారుతోంది. సీనియారిటీ లేకపోవడంతో స్థానికేతర జిల్లాలకు వెళ్లిన టీచర్లు బదిలీలకు అవకాశం కల్పించాలని పట్టుబడుతున్నారు. బదిలీలకు కనీసం రెండేళ్ల సర్వీస్ నిబంధన సరికాదంటున్నారు. జీరో సర్వీస్‌ను మార్గదర్శకాల్లో చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు. దీనిపై ఆందోళనలు నిర్వహిస్తున్న 317 జీవో బాధిత ఉపాధ్యాయులు ఆదివారం ప్రగతి భవన్ ముట్టడి చేపట్టారు. ఇంకోవైపు వేర్వేరు ప్రాంతాల్లో పనిచేస్తున్న భార్యాభర్తలు (స్పౌజ్‌లు) ఒకేచోట పనిచేసే అవకాశం కల్పించాలని ఆందోళన బాట పట్టారు. ఆదివారం ప్రగతి భవన్ ముట్టడి పిలుపు నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు అన్ని జిల్లాల్లోనూ ఉపాధ్యాయ సంఘాల నేతలను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. దీనిపై సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని స్థానికేతర్లుగా బదిలీ అయిన ఉపాధ్యాయులకు రాబోయే బదిలీల్లో ప్రాధాన్యం కల్పించి, వారు కోరుకున్న స్థానిక జిల్లాల్లోని ఖాళీల ఆధారంగా బదిలీకి అవకాశం ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరావు, నవాత్ సురేష్ డిమాండ్ చేశారు. కాగా ఆందోళన చేస్తున్న స్పౌజ్ టీచర్లను ఉద్దేశించి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన 'టీచర్లా–రౌడీలా'అంటూ చేసిన వ్యాఖ్యలను రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూటీఎస్) అధ్యక్షుడు సదానందం గౌడ్ తీవ్రంగా ఖండించారు. ప్రగతి భవన్ ముట్టడికి 317 జీవో బాధిత టీచర్లు పిలుపునిస్తే ఏ సంబంధం లేని యూఎస్‌పీసీ, డీటీఎఫ్ సంఘాల నేతలను అరెస్టు చేయడంపై డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు టి.లింగారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు.

రజాకార్లను తరిమినోళ్లం..

కేసీఆర్‌ను ఓడించలేమా?

▶ మొదటి పేజీ తరువాయి

వ్యక్తి దళితుల పేరుచెప్పి సీఎం కుర్చీలో కూర్చున్నారని రేవంత్ విమర్శించారు. సీఎం కేసీఆర్ పాలమూరు బిడ్డ, ఐపీఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గొంతు మీద కాలుపెట్టి తొక్కడానికి ప్రయత్నిస్తే.. ఆయన బయటికొచ్చి దళిత బిడ్డల పౌరుషాన్ని చూపుతున్నారన్నారు. దొరలకు బీఆర్ఎస్, పెట్టుబడిదారులకు బీజేపీ అండగా ఉంటే.. కాంగ్రెస్ పార్టీ దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల వారికి అండగా ఉంటుందని చెప్పారు. తమ పార్టీకి జాతీయ అధ్యక్షుడిగా దళితుడికి అవకాశం ఇచ్చామని, పంజాబ్‌కు దళితుడిని సీఎం చేశామని పేర్కొన్నారు.

మేం నెత్తిమీద కాలుపెట్టి తొక్కుతాం

2018 ఎన్నికల సమయంలో కుర్చీ వేసుకుని మార్కండేయ ప్రాజెక్టును పూర్తి చేస్తానని సీఎం కేసీఆర్ ప్రకటించారని.. ఇప్పటివరకు తట్టెడు మట్టి కూడా తీయలేదని రేవంత్ చెప్పారు. ''ప్రాజెక్టు కట్టకుండా ఫాంహౌస్‌లో పడుకున్న సీఎంను ఈడ్చుకురావడానికే నాగం జనార్దన్‌రెడ్డి అక్కడికి పోయిండు. చేతనైతే ప్రాజెక్టు కట్టాల్సిందే. చేతకాకపోతే మీరు వచ్చాక కట్టుకోండి అని చెప్పి ఉండాల్సింది. కానీ ప్రాజెక్టుపై ప్రశ్నించిన గిరిజనుడు వాల్యానాయక్, దళితుడు రాములుపై దాడి చేస్తారా? వారి గొంతుపై కాలు పెట్టి తొక్కుతారా? దాడి చేసినవారికి ఈ ధైర్యం ఎక్కడిది. కేసీఆర్ నుంచే వచ్చింది. భూస్వాములు, దొరలను నిలువరించిన ఈ గడ్డ దళితులపై దాడులను చూస్తూ ఊరుకుంటుందా? 1,200 మంది శవాల పునాదుల మీద గద్దెనెక్కి ఇప్పుడు కాలుపెట్టి తొక్కుతారా? ఎన్నికలప్పుడు మా ఊరు, వాడ, బస్తీ, చెంచుపెంటలు, గూడెంలకు వస్తావు కదా.. అప్పుడు నీ నెత్తిమీద కాలు పెట్టి తొక్కుతాం..'' అని రేవంత్ పేర్కొన్నారు.



మాణిక్‌రావ్ ఠాక్రేను సన్మానిస్తున్న రేవంత్‌రెడ్డి, నాగం జనార్దన్‌రెడ్డి తదితరులు

మేం కడితే.. మీరు ఫొటోలు దిగుతారా?

పాలమూరులో జూరాల, భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి ప్రాజెక్టులను కట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని రేవంత్ చెప్పారు. ప్రాజెక్టులను కాంగ్రెస్ పూర్తిచేస్తే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాల్వల దగ్గర ఫొటోలు దిగుతున్నారని విమర్శించారు. డబుల్ బెడ్రూం ఇళ్లు, ఉద్యోగాలు, మూడెకరాల భూమి, మాదిగ వర్గీకరణ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

కాంగ్రెస్ కార్యకర్తలపై సర్కారు దౌర్జన్యం: మాణిక్‌రావు ఠాక్రే

రాష్ట్రంలో కాంగ్రెస్ కార్యకర్తలపై బీఆర్ఎస్ ప్రభుత్వ దౌర్జన్యం దుర్మార్గమని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే మండిపడ్డారు. వాల్యానాయక్, రాములుపై జరిగిన దాడిని కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. తెలంగాణ ప్రజల వికాసం, పేదలు, గిరిజనులు, దళితుల అభివృద్ధి కోసం సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని.. కానీ ఇప్పుడు అన్నీ అరాచకాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

ప్రభుత్వ తోడ్పాటుతోనే బీఆర్ఎస్ శ్రేణుల దుర్మార్గాలు: భట్టి

రాష్ట్రం వచ్చాక దళితులు, గిరిజనులపై దాడులు పెరిగాయని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న నేత నాగం జనార్దనరెడ్డి కళ్ల ముందే దౌర్జన్యం జరిగిందని.. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల దుర్మార్గాలకు ప్రభుత్వ సహకారమే దీనికి కారణమని మండిపడ్డారు. కాగా.. నాగర్‌కర్నూల్ సభలో ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్ చౌదరి, నదీమ్ జావేద్, నేతలు మల్లు రవి, షబ్బీర్‌అలీ, నాగం జనార్దనరెడ్డి, చిన్నారెడ్డి, సంపత్‌కుమార్, రాములు నాయక్, శివసేనరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రీతం, ఎస్టీ సెల్ అధ్యక్షుడు జగన్‌లాల్ నాయక్ పాల్గొన్నారు.


ఇప్పుడు మాకు పంచాయితీల్లేవు..

''ఇప్పుడు మాకు ఠాక్రే వచ్చిండు. మాకు పంచాయితీలు లేవు. పార్టీ ఎవరిని నిర్ణయించినా భుజాలపై పల్లకీ మోసి సీఎం కుర్చీలో కూర్చోబెట్టే బాధ్యత నాది..''

– రేవంత్‌రెడ్డి

మాజీ ఎంపీలూ.. మీరేం చేస్తారు?

- పార్టీ బలోపేతం, ఎన్నికల్లో గెలుపులో మీ సహకారం ఏ మేరకు?
- కాంగ్రెస్ సీనియర్లకు రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే ప్రశ్నలు
- పార్టీ నేతలందరినీ ఏకం చేయాలని ఠాక్రేకు సూచించిన మాజీ ఎంపీలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పార్టీ బలోపేతం, ఎన్నికల్లో గెలుపు కోసం ఏం చేస్తారో చెప్పాలని ఐదుగురు మాజీ ఎంపీలను కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే ప్రశ్నించారు. మాజీ ఎంపీ హోదా, ఆయా నియోజకవర్గాల్లో ఉన్న పట్టు, పరిచయాలతో వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం శక్తి మేరకు పనిచేయాలని సూచించారు. ఆదివారం మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, అంజన్‌కుమార్ యాదవ్, సిరిసిల్ల రాజయ్య, సురేశ్ షెట్కార్, బలరాం నాయక్‌లు గాంధీభవన్‌లో ఠాక్రేను కలిశారు. ఈ సందర్భంగా వారు రాష్ట్రంలోని పార్టీ పరిస్థితులు, ఇతర రాజకీయ పార్టీల బలాలు, బలహీనతలు, బీజేపీ వైఖరి, బీఆర్ఎస్ ఏర్పాటు వల్ల మారే రాజకీయాలపై చర్చించారు. రానున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం పనిచేయాలని మాజీ ఎంపీలకు ఠాక్రే సూచించారు. ఫిబ్రవరి ఆరు నుంచి జరగనున్న హాథ్ సే హాథ్ జోడో యాత్రల్లో భాగంగా రాష్ట్రంలో వీలైనన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాదయాత్రలు చేయాలన్నారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉందని, మార్గనిర్దేశం చేసే నాయకులు ఏకమైతే అధికారంలోకి రావడం కష్టమేమీ కాదని ఠాక్రేకు మాజీ ఎంపీలు వివరించినట్టు సమాచారం. రాష్ట్రంలోని పార్టీ నేతలందరినీ ఏకం చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరినట్టు తెలిసింది.

మంతనాలతో మూడ్ ఛేంజ్!

- రాష్ట్రంలో ముగిసిన మాణిక్‌రావ్ ఠాక్రే మూడు రోజుల పర్యటన
- ఎన్నికల టీమ్‌లు ఏర్పాటు చేసుకోవాలని పార్టీ కమిటీల చైర్మన్లకు సూచన
- వారంలో మరో దఫా పర్యటనకు రానున్నట్టు కాంగ్రెస్ వర్గాల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కూర్చుని మాట్లాడుకుంటే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్న స్ఫూర్తితో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే ముందుకెళ్తున్నారు. రాష్ట్ర ఇన్‌చార్జిగా నియామకమైన తర్వాత రెండు సార్లు రాష్ట్రానికి వచ్చిన ఆయన.. నేతలను కూర్చోబెట్టి మంతనాలు జరపడానికి ప్రాధాన్యత ఇచ్చారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ముఖ్య నేతలందరితో విడివిడిగా, సామూహికంగా చర్చలు జరిపారు. ఈ క్రమంలో రాష్ట్రంలో రాజకీయాలు, కాంగ్రెస్ పార్టీ బలాలు, బలహీనతలు, అంతర్గత విభేదాలు, భవిష్యత్ వ్యూహాలపై ఆయనకు పూర్తి అవగాహనకు వచ్చినట్టేనని గాంధీభవన్ వర్గాలు అంటున్నాయి. ఆయన చర్యల ఫలితంగానే రాష్ట్ర కాంగ్రెస్‌లో మూడ్ మారిందని, నేతల్లో విభేదాలు దూరం అవుతున్నాయని చెప్తున్నాయి. రెండో దశ పర్యటనలో భాగంగా శుక్రవారం నుంచి ఆదివారం వరకు పర్యటించిన ఠాక్రే 'హాథ్ సే హాథ్ జోడో' యాత్రలపై దృష్టి కేంద్రీకరించినా.. వచ్చే ఎన్నికల కోసం పార్టీ నేతలను సన్నద్ధం చేసే పనికి కూడా శ్రీకారం చుట్టారని అంటున్నాయి. ఈ క్రమంలో వారం రోజుల్లో మూడో దఫా పర్యటనకు రానున్నారని చెప్తున్నాయి.

మీ వంతుగా ఏం చేశారు.. ఏం చేస్తారు?

తొలి పర్యటనలో పార్టీ సీనియర్లతో విడివిడిగా భేటీ అయిన ఠాక్రే.. తాజా పర్యటనలో పార్టీ కమిటీలు, అనుబంధ విభాగాలతో సమావేశమయ్యారు. కీలకమైన టీపీసీసీ ప్రచార కమిటీ, ఎన్నికల నిర్వహణ కమిటీ, ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నేతలతో భేటీ అయి చర్చించారు. ఈ సందర్భంగా ఠాక్రే చేసిన వ్యాఖ్యలపై గాంధీభవన్‌లో చర్చ జరుగుతోంది. పార్టీ బలంగా ఉందని, అందరం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని, పార్టీలో ప్రాధాన్యత కావాలని కొందరు నేతలు చెప్పడాన్ని సున్నితంగా తిరస్కరించిన ఆయన.. ఈ విషయాలన్నీ తాను చూసుకుంటానని, మీ వంతుగా ఏం చేశారు, ఏం చేస్తారో చెప్పాలని ప్రశ్నించినట్టు సమాచారం. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో మీ టీంలు ఏం పనులు చేస్తున్నాయో చెప్పాలని నేతలను అడిగినట్టు తెలిసింది. తొలుత ఎన్నికలకు సిద్ధమయ్యే దిశలో తమ కమిటీలు, బృందాలను సిద్ధం చేసుకోవాలని.. క్షేత్రస్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేసుకుని ఎన్నికలకు సమాయత్తం చేయాలని స్పష్టం చేసినట్టు సమాచారం. కాగా ఠాక్రే తన రెండో పర్యటనలోనే బహిరంగ సభకు, ఇతర కార్యక్రమాలకు హాజరుకావడం ద్వారా తెలంగాణ ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నం ప్రారంభించారనే చర్చ జరుగుతోంది.

చేగువేరా ఆశయ సాధనకు కృషి చేద్దాం

'మఖ్దూం భవన్'లో అలైదా గువేరా

సాక్షి, హైదరాబాద్: చేగువేరా నమ్మిన సిద్ధాంతాలను ఆచరిస్తే ఆయనకు నిజమైన నివాళి ఇచ్చినట్లు అవుతుందని ఆయన కుమార్తె అలైదా గువేరా అన్నారు. ఆయన ఆశయాల కోసం అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ పర్యటనలో భాగంగా అలైదా.. తన కుమార్తె, చేగువేరా మనవరాలు ప్రొఫెసర్ ఎస్తేఫానియా గువేరాతో కలసి సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, స్వాతంత్ర్య సమరయోధుడు కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, నేషనల్ కమిటీ ఫర్ సాలిడారిటీ విత్ క్యూబా (ఎన్‌సీఎస్‌సీ) కో–ఆర్డినేటర్లు ఎస్.బాలమల్లేష్, పశ్య పద్మ, ఇ.టి. నరసింహ, ఐప్సో ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి. సుధాకర్, సమన్యాయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్, కాచం సత్యనారాయణ ఘన స్వాగతం పలికారు. ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ కార్యకర్తలు రెడ్ సెల్యూట్ చేగువేరా అంటూ నినాదాలు చేశారు. అనంతరం అలైదా గువేరాతో పరిచయ కార్యక్రమ సభను ఏర్పాటు చేశారు. ప్రజాసంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అలైదా గువేరాకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువలతో ఘనంగా సన్మానించారు.

విజయం సాధించే వరకు పోరాడతాం

క్యూబా సంఘీభావ సభలో చేగువేరా తనయ

- అమెరికా తమ దేశాన్ని ఆర్థికంగా దిగ్బంధించిందన్న డాక్టర్ అలైదా గువేరా
- అయినా ప్రపంచ దేశాల సంఘీభావంతో గెలుస్తామని ధీమా
- క్యూబాకు సంఘీభావంగా తీర్మానాన్ని ఆమోదించిన పార్టీలు, ప్రజాసంఘాలు

సాక్షి, హైదరాబాద్: 'మా దేశం పాలు, పాలపొడి సహా ఇతర వస్తువులను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోకుండా అమెరికా ఆంక్షలు విధించింది. క్యూబాను ఆర్థికంగా దిగ్బంధిస్తోంది. అన్ని రంగాల్లోనూ అమెరికా ఆంక్షలను ఎదుర్కొంటునే ఉన్నాం. కానీ ఈ ఆర్థిక దిగ్బంధం మమ్మల్ని ఎప్పటికీ ఓడించలేదు. చేగువేరా స్ఫూర్తితో, ఫిడేల్ క్యాస్ట్రో చూపిన మార్గంలో విజయం సాధించి తీరుతాం. గెలిచే వరకు పోరాడాలన్న చేగువేరా పిలుపు మమ్మల్ని ముందుకు నడిపిస్తుంది' అని చేగువేరా తనయ డాక్టర్ అలైదా గువేరా అన్నారు. నేషనల్ కమిటీ ఫర్ సాలిడారిటీ విత్ క్యూబా, ఐప్సో సంస్థలు ఆదివారం రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన క్యూబా సంఘీభావ సభలో ఆమె ప్రసంగించారు. క్యూబా సార్వభౌమ, స్వతంత్ర దేశమని... ప్రపంచ దేశాల అండ, సంఘీభావంతో తప్పకుండా అమెరికా దుర్నీతిపై విజయం సాధించి తీరుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.



అలైదాను సత్కరించి చేగువేరా చిత్రపటాన్ని అందజేస్తున్న హరగోపాల్, వినోద్‌కుమార్, తమ్మినేని, కూనంనేని

నేను క్యూబన్ మహిళను...

'వేలాదిగా తరలివచ్చి ఇలా మీ సంఘీభావాన్ని తెలియజేయడంతో ఎంతో సంతోషంగా ఉంది. రంగు, రూపం వల్ల కాకుండా మనుషులను మనుషులుగా గౌరవించే సమాజం కోసం అందరం సంఘటితం కావాల్సి ఉంది. చేగువేరా కూతురుగా నన్ను ప్రత్యేకంగా చూడొద్దు. నేను క్యూబన్ మహిళగా ఈ సభల్లో పాల్గొంటున్నాను. చేగువేరా ఒక పరిపూర్ణమైన కమ్యూనిస్టు. సామాజిక సేవను ఆయన నుంచే నేర్చుకున్నాం. ప్రతి మనిషిలో సామాజిక దృక్పథాన్ని పెంచేందుకు స్వచ్ఛంద సేవ దోహదంచేస్తుంది. చేసే పని మనిషి గౌరవాన్ని పెంచుతుంది. క్యూబా సామ్యవాద దేశంగా అభివృద్ధి చెందుతోంది. మా వనరులకు, సంపదకు మేమే యజమానులం. మా సామ్యవాద విధానాల వల్లే అమెరికా భయపడుతోంది. రకరకాల ఆంక్షలు విధిస్తోంది. ఎట్టిపరిస్థితుల్లోనూ క్యూబా ప్రపంచ దేశాలకు ఆదర్శంకాకూడదనేదే దాని ఉద్దేశం. కానీ కచ్చితంగా క్యూబా గెలుస్తుంది' అని అలైదా అన్నారు. ఈ సందర్భంగా క్యూబాకు మద్దతుగా చేసిన తీర్మానాన్ని వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, మహిళా సంఘాలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. అమెరికా సామ్రాజ్యవాదాన్ని నిరసిస్తూ గోరటి వెంకన్న పాడిన పాటతో సభ హోరెత్తింది. చేగువేరాపై సుద్దాల ఆంగ్లంలో పాడిన పాట ఆకట్టుకుంది. ఈ సభలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, పీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి, ఐప్సో ప్రతినిధి యాదవరెడ్డి, సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, ఆప్ నేత సుధాకర్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రజాగాయకుడు గద్దర్, ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, అరుణోదయ విమల, పీఓడబ్ల్యూ సంధ్య తదితరులు పాల్గొని క్యూబాకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

ఆధ్యాత్మిక సమ్మేళనానికి రండి

సీఎం కేసీఆర్‌కు రామచంద్ర మిషన్ ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఆధ్యాత్మిక సమ్మేళనానికి హాజరు కావాలని సీఎం కేసీఆర్‌ను ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ రామచంద్ర మిషన్ ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌తో మిషన్ ఆధ్యాత్మిక గురువు కమలేష్ పటేల్ తదితరులు భేటీ అయ్యారు. తమ సామాజిక సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలను సీఎంకు వివరించారు. కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా రెండు కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆదివారం 3,011 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో ఇద్దరు వైరస్ బారినపడ్డారు. దీంతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరింది. ఒక్కరోజులో ముగ్గురు కోలుకోగా, ఇప్పటి వరకు కోలుకున్న వారిసంఖ్య 8.37 లక్షలకు చేరింది.

కాంగ్రెస్ హయాంలోనే బెస్తలకు లబ్ధి

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి ముఖేశ్ గౌడ్ చొరవతో కాంగ్రెస్ పార్టీ హయాంలోనే మత్స్యకారుల జీవితాలు బాగుపడ్డాయని టీపీసీసీ ఫిషర్‌మెన్ కమిటీ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ తెలిపారు. బేగంబజార్‌లో ఆధునీకరించిన ఫిష్‌మార్కెట్ పనులు తమ హయాంలో జరిగాయని బీఆర్ఎస్ నేతలు పచ్చి అబద్ధాలాడుతున్నారని ఆదివారం ఒక ప్రకటనలో ఆయన విమర్శించారు. ఓట్ల కోసం బీఆర్ఎస్ నేతలు చేస్తున్న సిగ్గుమాలిన రాజకీయాలను బేగంబజార్ మత్స్యకారులు నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు.

..ప్రేమించాలని చెప్పేవారు

▶ మొదటి పేజీ తరువాయి

మెరుపులా గుర్తున్నాయి. ఆయన ప్రతిరోజూ ఉదయం 5 గంటలకు నన్ను లేపేవారు. చెరకు తోటలకు తీసుకెళ్లేవారు. అక్కడ ఆయన పనిచేస్తుంటే నేను చెరకుగడలు తింటూ గడిపేదాన్ని. ఇతరులతో మాట్లాడుతూ నన్ను ఆడిస్తూ ఉండేవారు. ఆయన ఇంట్లో ఉన్నప్పుడు వీపుపై తిప్పుతూ ఆడించేవారు. నాకు, నా సోదరులకు జంతువుల కథలను ఎక్కువగా చెప్పేవారు. వారాంతాల్లో స్వచ్ఛంద పనులు చేసేవారు. ప్రపంచంలో అణిచివేతకు గురవుతున్న మానవ సమూహాలను ప్రేమించాలని చెప్పేవారు. సామాజిక సేవా కార్యక్రమాలకు తీసుకెళ్లేవారు. మాకు దూరంగా ఉన్నా ఉత్తరాలు రాసే వారు.

మరో తండ్రిలా క్యాస్ట్రో...

నాన్న చనిపోయాక క్యూబా కమ్యూనిస్టు పితామహుడు, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ నేతల్లో ఒకరైన ఫిడేల్ క్యాస్ట్రోనే అన్నీ తానై నన్ను చూసుకున్నారు. క్యాస్ట్రో మరో తండ్రిలాంటి వారు. ఆయనతో కలిసి గడిపిన కాలం ఎంతో ప్రత్యేకం. 1987లో నాకు పెళ్లయింది. పెళ్లి రాత్రి 11:30 గంటలకు జరిగింది. ఆయన రాక కోసం వేచిచూసి ఆ సమయంలో చేసుకున్నాం. నాకు కూతురు పుట్టినప్పుడు ఆయన ఆసుపత్రికి వచ్చారు. విక్టోరియా అనే పేరు పెట్టాలని సూచించారు. కానీ అప్పటికే నేను, మావారు ఒక పేరు నిర్ణయించి ఆయనకు చెప్పేసరికి కాస్తంత నొచ్చుకున్నారు. పాపను చూసి అమ్మలా నువ్వు ఉండొద్దు (నవ్వుతూ) అని అన్నారు.

ప్రపంచానికి మా దేశ వైద్య రంగం ఆదర్శం...

క్యూబా వైద్య రంగంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది. కరోనా కాలంలోనూ వివిధ దేశాలకు వైద్య సాయం చేసింది. ఖతార్‌లోని ఒక ఆసుపత్రిలో పనిచేసే వారంతా క్యూబన్లే. వారికి ఆ దేశం వేతనాలు ఇస్తుంది. హైతీలోనూ ఒక ఆసుపత్రిలో



1964లో హవానాలో తన తండ్రి చేగువేరాతో మాట్లాడుతున్న ఫిడేల్ క్యాస్ట్రోతో చిన్నారి అలైదా గువేరా

క్యూబన్లు పనిచేస్తున్నా వారికి వేతనాలు ఇచ్చే పరిస్థితుల్లో ఆ దేశం లేదు. అందువల్ల ఖతార్‌లో వచ్చే ఆదాయాన్ని హైతీ ఆసుపత్రుల్లో పనిచేసే క్యూబన్ డాక్టర్లకు చెల్లిస్తున్నాం. అర్జెంటీనాలో స్మారక నేత్ర ఆసుపత్రి, బొలీవియాలో జనరల్ ఆసుపత్రి ఉన్నాయి. కరోనా కాలంలో ఫ్రాన్స్ కూడా క్యూబా వైద్య సాయం కోరింది. ఇటలీ, కెనడాలకు వైద్య సాయం చేస్తున్నాం. మా దేశంలో చిన్నారులకు 14 రకాల టీకాలు ఇస్తుంటాం. క్యూబాలో ప్రస్తుతం శిశుమరణాల రేటు ప్రతి వెయ్యిలో ఐదుగా ఉంది.

నాన్న కమ్యూనిస్టు...

నాన్న చేగువేరా పూర్తి కమ్యూనిస్టు. ఇరాన్ వంటి దేశాల్లోనూ ఆయన్ను ఆరాధిస్తారు. జీవితాంతం కమ్యూనిస్టు సిద్ధాంతంతోనే ఆయన పనిచేశారు. కమ్యూనిస్టుగానే ఆయన చనిపోయారు. క్యూబా ఒకప్పుడు అమెరికా కాలనీగా ఆ దేశ కనుసన్నల్లో బతికింది. 1950లలో విప్లవోద్యమంతో అమెరికా అనుకూల ప్రభుత్వాన్ని పడగొట్టి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాక దేశం అన్ని రంగాల్లో పురోగమించింది. అమెరికాకు ఇది మింగుడు పడడం లేదు. ఇప్పటికీ క్యూబాను నాశనం చేసేందుకు కుట్రలు చేస్తోంది.

పుస్తకం రాస్తున్నా..

నేను నాన్న గురించి 'చేగువేరా–వైద్యం' అనే పుస్తకం రాస్తున్నా. అందుకోసం నాన్న రాసిన పుస్తకాలను లోతుగా అధ్యయనం చేస్తున్నా. బొలీవియన్ డైరీస్ పుస్తకం చదువుతుంటే గుండె బరువెక్కుతుంది. డైరీ చివరి పేజీ నన్ను కన్నీళ్లు పెట్టిస్తుంది. చివరి పేజీ ఆయన్ను చంపిన రోజు. ఒక పోరాట యోధుడి డైరీనే బొలివియన్ డైరీ. ఎన్ని కష్టాలు ఎదురైనా భవిష్యత్తు గురించి ఆందోళన చెందకూడదు.

క్యూబాలో స్త్రీ, పురుషులకు సమాన హక్కులు..

క్యూబాలో 100 శాతం స్త్రీ, పురుష సమానత్వం ఉంది. సమాన పనికి సమాన వేతనం ఇస్తున్నారు. మా దేశంలో మహిళా సంఘం ఉంది. అది అన్ని రకాలుగా మహిళల కోసం పనిచేస్తుంది. చిన్నప్పటి నుంచే బాలబాలికలకు సమాన అవకాశాలు కల్పిస్తున్నాం. పైస్థాయిలోనూ సమాన అవకాశాలు ఉన్నాయి. అందుకే మహిళలు అన్ని రకాలుగా ముందున్నారు. అక్కడి చట్టాలు మహిళల హక్కులు కాపాడతాయి. మహిళా ఉద్యోగులకు ప్రసవానికి ముందు రెండు నెలలు, ప్రసవం తర్వాత 9 నెలలు వేతనంతో కూడిన సెలవులు ఇస్తున్నారు. ఆ తర్వాత ఎవరికైనా కూడా అదనపు సెలవులు కావాలంటే మరో మూడు నెలలు 75 శాతం వేతనంతో సెలవు ఇస్తున్నారు. త్వరలో ఏడాదిపాటు వేతనంతో కూడిన సెలవులు ఇచ్చేలా కొత్త చట్టం రానుంది. అంతేకాదు ఆరు నెలలు తల్లికి, మరో ఆరు నెలలు తండ్రికి పూర్తి వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలనుకుంటున్నారు. క్యూబాలో ఇప్పుడు మగవారు కూడా వారికొక సంఘం కోరుకుంటున్నారు (నవ్వుతూ). మా దేశంలో పిల్లలను కొట్టకూడదు. క్యూబా డాక్టర్లలో 72 శాతం మంది మహిళలే.



దాని గురించి ఎవరికీ ఏమీ తెలియని రీతిలో మంచి చేయడం అనేది మరింత మెరుగైన విషయం.

– లియో టాల్‌స్టాయ్

సాక్షి

సోమవారం, జనవరి, 23

అక్షరాల ఉత్సవం

మనుషులతో కూడిక మనిషికి ఎప్పుడూ ఉత్సాహాన్ని ఇస్తుంది. ఇల్లు విడిచి బయటకు కదిలే సందర్భాలు తిరిగి ఉత్సాహంగా ఇల్లు చేరడానికి, చేయవలసిన పనిలో పునర్‌లగ్నం కావడానికి దోహదం చేస్తాయి. కదలకుండా ఉండిపోయే మనిషిని కదల్చడానికి, తోటి మనిషిని కలవడానికి, లోకం తెలుసుకోవడానికి పెద్దలు పూర్వం ఆధ్యాత్మికత పేరుతోనైనా కూడికలు ఏర్పాటుచేశారు. జాతరలు, తిరునాళ్లు, తీర్థయాత్రలు, పుష్కరాలు, కుంభమేళాలు... ఇవన్నీ మనిషిని కదిల్చి తనలాంటి మనుషులను కలిసేలా చేస్తాయి. భారతీయులు ఈ నిష్ఠను పాటించడంలో ఎప్పుడూ ముందే ఉన్నారు. తెలుగువారు అందుకు సరిసమానం కాకుండా ఎలా ఉంటారు? మన జాతరలు కిటకిటలాడతాయి. మన పుణ్యక్షేత్రాలు కళకళలాడతాయి. అయితే సాంస్కృతిక, సాహిత్య, కళారంగాలకు సంబంధించి ఈ నిష్ఠ మనలో ఏ మేరకు ఉన్నదన్నది ప్రశ్న. సాహిత్యం కోసం కదలడం, సంస్కృతికై కూడటం.

సంవత్సరంలో ఒకసారి ప్రపంచంలోని గొప్ప గొప్ప తెలుగు కూచిపూడి కళాకారులందరూ విజయవాడ కూచిపూడి ఉత్సవంలో పాల్గొంటారు. ఆ ఉత్సవం చూడటానికి దేశ విదేశాల నుంచి అతిథులు వస్తారు. సంవత్సరంలో ఒకసారి ప్రపంచంలోని తెలుగు మేటి జానపద కళాకారులందరూ ఆదిలాబాద్‌లో జమ అవుతారు. వేదికలు అదరగొడతారు. చూడటానికి దేశం కదిలి వస్తుంది. సంవత్సరానికి ఒకసారి తెలుగు నాటకరంగ దిగ్గజాలందరూ నాటకాలతో తెనాలికి పొలోమంటారు. వారం రోజుల పాటు గొప్ప గొప్ప నాటకాలు ప్రదర్శిస్తారు. ఈ నాటక ఉత్సవం కోసం ప్రేక్షకులు కన్నులు కాయలు కాచేలా ఎదురు చూస్తారు. తిరుపతిలో వీనుల విందుగా శాస్త్రీయ సంగీత ఉత్సవాలు జరుగుతాయి. త్యాగయ్య, క్షేత్రయ్య, అన్నమయ్య మార్మోగుతారు. సీట్లు దొరక్క ప్రేక్షకులు అవస్థ పడతారు. వరంగల్‌లో అద్భుతమైన చిత్రకళా ఉత్సవం జరుగుతుంది. తెలుగు చిత్రకారులందరూ తరలివస్తారు. రంగులు, బ్రష్షులు పట్టుకుని చిన్నారులు చూడ పరిగెడతారు. ప్రతి ఏటా హైదరాబాద్‌లో జరిగే అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రపంచంలోని ఉత్తమ సినిమా నిపుణులకు ఆహ్వానం పలుకుతుంది. స్పీల్‌బర్గ్, కామెరూన్ వంటి వారు సినిమాల గురించి మాట్లాడతారు. కొత్త తరానికి ఉత్సాహాన్ని ఇస్తారు. ఇలా జరుగుతున్నదా? ఇలా ఎందుకు జరగడం లేదు?

స్వర్ణకాలం అంటే కొత్త అపార్ట్‌మెంట్‌లో చదరపు అడుగు ఆరున్నర వేలు పలకడం కాదు. కొత్త కార్లు రోడ్ల మీద కిటకిటలాడటం కాదు. ప్రజలు తమ సాంస్కృతిక అభిరుచిని సజీవంగా ఉంచుకునే కాలం. కవులు, కళాకారులు, గాయకులు, రచయితలు, నటీనటులు, వాద్యకారులు, చిత్రకారులు, హస్తకళా మాంత్రికులు తమ సృజనను ఉన్నతీకరించుకుంటూ సమాజంతో అనుసంధానం చేస్తూ పరస్పర సంలీనతతో పురోగమించే కాలం స్వర్ణకాలం. కళలకు ఆదరణ లభించిన అట్టి కాలమే చరిత్రలో నమోదయ్యింది. అలాంటి కాలం కొరకు ఏం చేయాలి? 16 ఏళ్ల క్రితం జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్ ప్రారంభించినప్పుడు వేదికకు ఒక మూల నిలుచుని యాభై మందైనా వస్తారా అని బితుకుబితుకుమన్నా. ఇవాళ చూడండి వేలాదిగా పోటెత్తుతున్నారు అని ఆ ఫెస్టివల్ నిర్వాహకుడు సంజొయ్ కె.రాయ్ అన్నాడు. అతడు ప్రయత్నం మొదలెట్టాడు. తర్వాత ప్రజలు తోడు నిలిచారు. కనుకనే జైపూర్‌లో ఏటా జనవరిలో జరిగే జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్‌కు వందల మంది రచయితలు, వేలాదిగా పాఠకులు తరలి వస్తారు. ఆ సంవత్సరంలో ఇంగ్లిష్‌లో కొత్త పుస్తకాలు రాసిన, అనువాదమైన రచయితలు మాట్లాడతారు. అంతర్జాతీయ అవార్డు రచయితలు అందరిలో ఒకరై కనిపిస్తారు. ఆలోచనల మార్పిడి జరుగుతుంది. రచయితలు ఇదంతా మన సమూహం అని ఊపిరి నింపుకొంటారు. విద్యార్థులు హాజరై ప్రశ్నలు సంధిస్తారు. సృజన ఒక తరం నుంచి మరో తరాన్ని తాకుతుంది.

సాహిత్యాన్ని సెలబ్రేట్ చేసుకోవడం అంటే సంస్కృతినీ, భాషనూ సెలబ్రేట్ చేసుకోవడం. జైపూర్ లిటరేచర్ ఫెస్టివల్ స్ఫూర్తితో ఇవాళ దేశంలో ఎన్నో లిటరేచర్ ఫెస్టివల్స్ జరుగుతున్నాయి. పర్వత ప్రాంతాల వారు డెహరాడూన్‌లో, పంజాబ్ వారు కసౌలీలో, కేరళ వారు కోళిక్కోడ్‌లో, బెంగాలీలు కోల్‌కతాలో, కన్నడిగులు బెంగళూరులో, తమిళులు చెన్నైలో... ప్రతి ఏటా లిటరేచర్ ఫెస్టివల్స్ జరుపుకొంటున్నారు. ఇతర ప్రాంతాల రచయితలను ఆహ్వానిస్తున్నారు. ప్రజలు వీటికి హాజరై సృజనకారులకు ప్రోత్సాహం అందిస్తున్నారు. తమ జాతి మక్కువను నిరూపించుకుంటున్నారు.

మరి తెలుగులో? ప్రస్తుతం రెండు రాష్ట్రాలకు కలిపి హైదరాబాద్‌లో మొక్కుబడిగా సాగే 'హైదరాబాద్ లిటరేచర్ ఫెస్టివల్' తప్ప ఘనమైన తెలుగు లిటరేచర్ ఫెస్టివల్స్ మనకు లేవు. కన్నడ రచయితలు ఎక్కడ ఉన్నా ఏటా జాతీయ కన్నడ రచయితల ఉత్సవం పేరుతో ఏదో ఒక ఊరిలో కలుస్తారు. తెలుగు రచయితలు పక్క జిల్లా రచయితలతో కలిసే సందర్భాలు ఏర్పడవు. సాంస్కృతిక మందకొడితనం ఎందుకు మనలో మెండుగా ఉంటుందో తెలియదు. తెలుగు మహాసభలు జరగవు. భాషా ఉత్సవాలు జరగవు. మహా రచయితల శత జయంతులకు కూడా చీమ చిటుక్కుమనదు. పరిషత్ పోటీలు కొనఊపిరితో ఉంటాయి. మరో భాషలో రాసే రచయితను జీవిత కాలంలో ఒక్కసారైనా కలవకుండానే మన రచయితలు బావి బతుకులకు పరిమితమైపోతారు. ఇలా ఉంటే తెలుగు సాహిత్యస్థాయి మెరుగయ్యి ఎల్లలు దాటడం కల్ల. పెళ్లిళ్లు ఘనంగా చేయడమూ, భారీ కల్యాణ మంటపాలు కట్టడమూ జరుగుతున్న ఈ కాలంలో పన్నెండు కోట్ల మంది తెలుగువారు తమ తెలుగు సాహిత్యాన్ని సెలబ్రేట్ చేసుకోవడానికి సంవత్సరానికి ఒకసారి ఒక ఉత్సవం జరుపుకోలేకపోవడమే అమోఘమైన దారుణం. అత్యద్భుత విషాదం.

'కోహినూర్‌ను బ్రిటన్ దొంగిలించింది'

కామెంట్



కరణ్ థాపర్

బ్రిటన్ రాజకుటుంబ కథనాలంటే ఇప్పటికీ ఆసక్తికరమే. పైగా ప్రిన్స్ హ్యారీ దూకుడుగా వెలువరించిన 'స్పేర్' చదవడానికి మరింత ఆకర్షణీయం. తల్లి డయానా నాటకీయ మరణం నుంచి ఇప్పటికీ కోలుకోలేకపోవడాన్నీ, తానొక 'స్పేర్'గా ఊరికే అలా పక్కనుండాల్సిన స్థితినీ రాశాడు. అలాగే అనేక ఇబ్బందికర విషయాలను పంచుకున్నాడు. అయితే కోహినూర్ వజ్రం గురించిన హ్యారీ ఆలోచనలు మాత్రం భారతీయులకు సంతోషం కలిగిస్తాయి.

బ్రిటన్ రాకుమారుడు హ్యారీ రాసిన 'స్పేర్' పుస్తకం చదివినప్పుడు మనకు కొట్టొచ్చినట్టు కనబడేది దాన్ని రాసిన విధానమే. శైలి బిగువుగా, ఉద్రిక్తభరితంగా, ఒక్కోసారి అసంగతంగానూ ఉంటుంది. చెప్పాలంటే ఒక థ్రిల్లర్‌లా ఉంటుంది. కాబట్టే ఇది చదవడానికి ఆకర్షణీయంగా ఉంది. అయితే ఇందులోని భాషలో లోతు తక్కువ. విషయం వదులుగా ఉన్నప్పుడు, ముఖ్యంగా ఈటన్ స్కూల్, అఫ్గానిస్తాన్‌లలో హ్యారీ గడిపిన సమయాల గురించి వివరిస్తున్నప్పుడు పైపైన సాగుతుంది. అప్పుడు నిస్సారంగా ఉండి, చికాకు కలిగిస్తుంది కూడా.

తప్పనిసరిగా కనబడేవి మరో రెండు అంశాలు. తన తల్లి (డయానా) నాటకీయ మరణం కలిగించిన వేదన నుంచి హ్యారీ బయటపడలేదు. ఈ పుస్తకం మొత్తంగా ఇదే మానసిక స్థితి కొన సాగుతుంటుంది. అయితే ఇది అర్థం చేసుకోదగినదే. అర్థం కానిదల్లా ఏమిటంటే, తానొక 'స్పేర్'(అలా పక్కన అందుబాటులో ఉండటం)గా ఉండాల్సిన వాస్తవం గురించి ఇంకా సమాధాన పడక పోవడమే. 38 సంవత్సరాల వయస్సులో కూడా ఏ హోదా లేదు. తన సోదరుడు విలియమ్‌తో బాంధవ్యంపై ఇది స్పష్టమైన ప్రభావం చూపుతూ వచ్చింది. ఈ కారణంగానే స్కూల్‌లో విల్లీ (విలియమ్‌ను హ్యారీ ఇలాగే పిలుస్తాడు) తన పట్ల పట్టనట్టుగా ఉన్నాడని హ్యారీ నమ్మకం.

పుస్తకంలోని మూడో అంశం ఏమిటంటే – రాజ కుటుంబానికీ, వెంటాడే ఫొటోగ్రాఫర్లకూ (పాపరాజ్జీ) మధ్య సాగిన అంతులేని పోరాటం. ''ఎప్పుడూ ఫిర్యాదు చేయవద్దు, ఎప్పుడూ వివరణ ఇవ్వవద్దు'' అనేది రాజ కుటుంబ నినాదంగా ఉండేది. హ్యారీ ఈ విషయంలో ఒకడుగు ముందుకేసినట్టుగా కనిపిస్తుంది. పబ్‌లో రాత్రంతా గడిపిన తర్వాత తన కారు డిక్కీలో దాక్కునే వాడినని చెప్పాడు. డయానా కూడా అలాగే చేసివుంటుందని హ్యారీ అంటాడు.

ఈ పుస్తకం చాలా విషయాలను వెల్లడిస్తుంది. వాటిలో చాలా వరకు తీవ్రమైనవి, కొన్ని మనోహరమైనవి. బాక్సర్ షార్ట్స్‌లో శీర్షాసనాలు వేసే అతడి తండ్రి, బ్రిటన్ రాజు చార్లెస్ 'డార్లింగ్ బాయ్' అని హ్యారీని పిలుస్తారు. ఇక విలియమ్ అతడిని 'హెరాల్డ్' అంటాడు. కానీ అలా ఎందుకంటాడో పుస్తకంలో ఎక్కడా ఉండదు. అయితే, ''నాతో



వ్యవహరించినప్పుడల్లా ఏ మార్పూ లేకుండా'' అదే ''సుపరి చిత భ్రుకుటి'' అని మాత్రం చెబుతాడు. ఇక బాల్మోరల్ రాజమందిరంలో పిల్లలుగా ఉన్నప్పుడు, క్వీన్ విక్టోరియా విగ్రహాన్ని ఎప్పుడు దాటుకుని వెళ్లినా వారు ప్రతిసారీ వంగి నమస్కరించేవారు.

ఈ పుస్తకంలోని చాలా వివరాలు అనవసరం. పైగా అవి ఇబ్బంది కలిగిస్తుంటాయి. వాటన్నింటినీ హ్యారీ ఎందుకు పంచుకున్నాడని మీరు ఆశ్చర్యపడతారు కూడా. ఉదాహరణకు, హ్యారీ తనకు తడి అయిందనీ (స్ఖలనం), దాన్ని దాచిపెట్టడానికి సముద్రంలోకి దూకేశాననీ చెబుతాడు. మేగన్ మెర్కెల్‌తో తన తొలి డేట్‌కు కొద్ది గంటల ముందు అలా జరిగింది.

రాజకుటుంబీకులు, వారి స్కాటిష్ సంప్రదాయాలకు కాలం చెల్లిపోయిందని అనిపించే ఒక కథనం ఆశ్చర్యం కలిగిస్తుంది. హ్యారీ తొలిసారి ఒక మగజింకను కాల్చినప్పుడు అతడి గైడ్ అయిన శాండీ ఆ మృతకళేబరపు చర్మాన్ని చీల్చి, యువరాజు హ్యారీని మోకాళ్లపై కూర్చోబెట్టి, అతడి తలను అందులోకి దూర్చాడట. ''దీంతో ఉదయం నేను తిన్న ఫలహారం కడుపులోంచి బయటకు వచ్చేసింది'' అని హ్యారీ రాస్తాడు. ''నేను దేన్నీ వాసన పీల్చలేకపోయాను. ఎందుకంటే నేను శ్వాస పీల్చలేకపోయాను'' అని చెబుతాడు. ''నా నోరు, ముక్కు పూర్తిగా రక్తంతో, పేగులతో నిండిపోయాయి. ఒక తీవ్రమైన అసాకర్యపు వెచ్చదనం'' అని చెబుతాడు. ఈ ఆచారం ముగియగానే, హ్యారీ ముఖంపై పడిన జింక రక్తాన్ని తుడవవద్దని శాండీ చెప్పాడట. ''దాన్ని అలాగే ఎండిపోనీ, కుర్రాడా, అలాగే ఎండిపోనీ!'' అన్నాడట.

బ్రిటిష్ రాజకుటుంబంలో ఇద్దరు సభ్యులను హ్యారీ అంగీకరించలేకపోయాడు. ఒకరు మార్గరెట్ (ఎలిజబెత్ రాణి చెల్లెలు). ఆమెను అతడు ఆంట్ మార్గో అని పిలుస్తాడు. ఒకసారి ఆమె క్రిస్మస్‌కు మామూలు బాల్‌పాయింట్ పెన్ ఇచ్చిందట. అయినా వాళ్లిద్దరూ కలిసి సాగాల్సి వుంది. ఎందుకంటే, హ్యారీ నొక్కిచెప్పినట్టుగా ఆమె కూడా తనలాగే ఒక స్పేర్. ఇక హ్యారీ అంగీకరించని మరొకరు కెమిల్లా. ఆమెను పెళ్లాడవద్దని హ్యారీ, విలియమ్ ఇద్దరూ తమ తండ్రి చార్లెస్‌కి చెప్పారు. ఆమెను 'ప్రమాదకారి'గా హ్యారీ పరిగణిస్తాడు. తన ఇమేజ్‌ను పెంచుకునే క్రమంలో ఆమె మీడియాకు పలు కథనాలు బహిర్గతం చేశారంటాడు.

రెండు విషయాలు నన్ను ఆశ్చర్యపరిచాయి. ఈ పుస్తకంలో దోడీ ఫయీద్ పేరు ఎక్కడా ప్రస్తావనకు రాలేదు. అతడిని హ్యారీ అంతటా 'మమ్మీ బాయ్‌ఫ్రెండ్' అనే రాశాడు. ఇంకా తనకు 'పాకీ' అంటే జాతి వివక్షా పదమనీ, అవమానించినట్టనీ తెలియదని పేర్కొన్నాడు.

అంతిమంగా, గూర్ఖాల పట్ల హ్యారీకి ఉన్న ఆత్మీయతకు భారతీయ పాఠకులు సంతోషపడతారు. లెఫ్టినెంట్ వేల్స్ అని హ్యారీని సంబోధించడానికి వారు ఇష్టపడేవారు కాదు. ఎల్లప్పుడూ 'సాబ్' అనేవారు. ''రాజరికం పట్ల వాళ్లకు గంభీరమైన పూజ్యభావం ఉంది. వారి దృష్టిలో రాజు అంటే దైవం. కాబట్టి రాజకుమారుడు కూడా దైవానికి మరీ దూరం కాదు''.

ఇక కోహినూర్ వజ్రాన్ని బ్రిటన్ కలిగివుండటంలోని న్యాయసమ్మతిని హ్యారీ ప్రశ్నించడం మన ప్రభుత్వానికి సంతోషం కలిగించే విషయం. ''బ్రిటిష్ సామ్రాజ్యం తన ఉచ్చదశలో దాన్ని స్వాధీనం చేసుకుంది. ఇంకో ఆలోచన, దొంగిలించింది'' అని అంటూ ఇలా కొనసాగిస్తాడు. ''అది శాపగ్రస్తమైందని నేను విన్నాను.''

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఏం టైమింగు!



దోమల్లో పుట్టే ప్రాణాంతక వైరస్ ఆస్ట్రేలియాలో ప్రవేశించింది. ఏ లక్షణాలూ కనబరచని ఈ వ్యాధి ప్రాణం తీయొచ్చు. అదృష్టవశాత్తూ బిల్ గేట్స్ ప్రధానిని కలవడానికి వచ్చారు. అన్నింట్లోనూ అవకాశాలు! – బెర్నీ స్పొఫోర్త్, కాలమిస్ట్

వాళ్లకు అయిపోదా?



తన పిండి అయిపోయిందంటూ జసిండా ఆర్డెన్ రాజీనామా చేశారు. తన గరిష్ఠ హద్దుకు చేరుకున్నానని. ఒక పురుష సీనియర్ రాజకీయ నాయకుడు రాజీనామా చేయడాన్ని నేను ఎప్పుడూ చూడలేదు. – చార్లట్ ప్రౌడ్‌మాన్, ఫెమినిస్ట్

మనవాళ్లే శత్రువులు



ఇండియా ఎప్పుడు ఓడిపోయినా, దానిక్కారణం విదేశీ శత్రువు బలంగా ఉండటం వల్ల కాదు. ఇండియా విభజితమయ్యీ, ద్రోహుల వల్ల మోసానికి గురికావడం వల్లో జరిగింది. వెయ్యేళ్ల క్రితం ఇది ఎంత నిజమో ఇప్పుడూ అంతే.

– సుశాంత్ సరీన్, సీనియర్ ఫెలో

అవే తప్పులు



నేను మూడు తప్పులు చేశాను. 1. మొదటి ఎంఆర్ఎన్ఏ కరోనా టీకా డోసు వేసుకోవడం. 2. రెండో ఎంఆర్ఎన్ఏ డోసు వేసుకోవడం. 3. మళ్లీ అదే ఎంఆర్ఎన్ఏ డోసు వేసుకోవడం. దురదృష్టవశాత్తూ వెనక్కి తిప్పలేని తప్పులు.

– ష్మయెల్ సి.షపీరా, ఇజ్రాయిల్ బయోలాజికల్ రీసెర్చ్ హెడ్

పొమ్మన్నారంతే!



గూగుల్‌లో 20 ఏళ్లు పనిచేసిన తర్వాత అనూహ్యంగా ఇదే నా ఆఖరి రోజు (లేఆఫ్) అని ఈమెయిల్ ద్వారా తెలియడాన్ని నేను నమ్మలేకున్నాను. ముఖం మీద కొట్టినట్టయింది. కనీసం అందరికీ ముఖాముఖి గుడ్‌బై అయినా చెప్పగలిగితే బాగుండేది.

– జెరెమీ జాస్లిన్, ఉద్యోగి (?)

నిజమేనా?



ఒకవేళ సాత్వికాహారం మనకు ప్రశాంతత, వివేకం, అణకువ ఇచ్చేట్టయితే– ఎందుకు అణిచివేత కులాలకు సంబంధించిన జనం అబద్ధపు గర్వం, వివక్షాపూరిత ప్రవర్తన కలిగివుంటారు? ఆ పరికల్పన అయినా తప్పయి ఉండాలి, లేదా వాళ్లు రహస్యంగా తామస, రాజస ఆహారాలు తింటూ వుండాలి.

– సిల్వియా కర్పగం, వైద్యురాలు

నేరం చర్చిల్‌దే!



నేననుకోవడం ఇండియా అధికారికంగా విన్‌స్టన్ చర్చిల్‌ను యుద్ధ నేరస్థుడిగా ప్రకటించాల్సిన సమయం ఇదే. బెంగాల్ క్షామంలో ఉద్దేశపూర్వకంగా యాభై లక్షల మంది భారతీయుల మారణహోమానికి కారణమైన కీలక సూత్రధారిగా ఆయన మీద నేరం మోపాలి. ఇండియాకు, ప్రత్యేకించి హిందువులకు వ్యతిరేకంగా బ్రిటన్ యుద్ధ నేరాలను మన రికార్డుల్లోకి ఎక్కించాలి.

– సావిత్రీ ముముక్షు, ఆంట్రప్రెన్యూర్

ఉర్రూతలూగించిన నేత!

క్రమశిక్షణ, దేశభక్తి, దైవభక్తి ఉన్న సేవాతత్పరుడు సుభాష్ చంద్రబోస్ మరణించి 78 ఏళ్లవుతోంది. అయినా ఆయన మరణానికి కారణమని చెబుతున్న విమాన ప్రమాద కారణం నేటికీ జవాబులేని ప్రశ్నగా నిలిచిపోయింది. ప్రభావతీ దేవి, జానకీ నాథ్ బోస్ దంపతుల సంతానంలో తొమ్మిదోవాడుగా సుభాస్ చంద్రబోస్ 1897 జనవరి 23న కటక్‌లో జన్మించారు. ఐసీఎస్‌లో అఖిల భారత స్థాయిలో నాలుగవ స్థానం పొందారు. బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, అఖిల భారత కాంగ్రెస్ సహాయ కార్యదర్శిగా దేశమంతా పర్యటిస్తూ చేసిన ప్రసంగాలకు లక్షలాది మంది ప్రేరణ పొందారు. ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా బ్రిటిష్ ప్రభుత్వం ఆయన్ని అరెస్ట్ చేసి అనేక జైళ్లలో తిప్పి, చివరికి దేశ బహిష్కరణ శిక్ష వేసింది. 1933లో 'ఇండియన్ స్ట్రగుల్' పుస్తకాన్ని రాశారు. తండ్రి మరణంతో భారత్‌కు తిరిగి రాగా, ఆరోగ్యం క్షీణిస్తే, చికిత్స కోసం ప్రజలు చందాలువేసి మరీ వియన్నా పంపారు. అప్పుడే యూరప్ పర్యటించారు. ఆ రోజుల్లోనే ముస్సోలినీ, హిట్లర్, రోమరోల వంటివారిని కలిశారు.



నెహ్రూ అధ్యక్షతన లక్నోలో జరిగే కాంగ్రెస్ సమావేశాలకు హాజరయ్యేందుకు దేశంలో దిగగానే ఆయనను ఖైదు చేసి ఎరవాడ జైలుకు పంపారు. 1937లో విడుదల కాగానే అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడై దేశమంతా పర్యటిస్తూ ప్రజలను స్ఫూర్తిదాయక ఉపన్యాసాలతో ఉర్రూతలూగించి అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడయ్యారు! అది ఆయన పట్ల అసూయాపరులను పెంచింది. రెండవ పర్యాయం మళ్ళీ పోటీజేసి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ గెలుపు కోసం ప్రయత్నించకుండానే పట్టాభి సీతారామయ్యపై గెలిచి కాంగ్రెస్ అధ్యక్షులు అయ్యారు. అయితే గాంధీజీకి ఆయన అధ్యక్షుడు కావడం ఇష్టం లేదు. దీంతో బోస్ కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి రాజీనామా చేశారు. వెంటనే ఫార్వర్డ్ బ్లాక్ పార్టీని స్థాపించారు. వారపత్రిక కూడా వెలువరించడం మొదలు పెట్టి మరోసారి దేశమంతా పర్యటించారు.

1942 జనవరి 26న పులి బొమ్మతో రూపొందించిన జండా ఎగరేసి, బెర్లిన్‌లోనే ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించారు. 1941 ఫిబ్రవరి 27న ఆజాద్ హింద్ ఫౌజ్ రేడియోలో అద్భుత ప్రసంగం చేసి యావత్ భారతాన్నీ ఆయన ఆవేశంలో ముంచెత్తారు. మహిళలకు రంగూన్‌లో ఝాన్సీ లక్ష్మీబాయి రెజిమెంట్ ఏర్పాటు చేసి యుద్ధ శిక్షణ మొదలు పెట్టారు. చలో ఢిల్లీ నినాదం ఇచ్చి ప్రత్యక్ష యుద్ధానికి ప్రణాళిక రచించి ఇంఫాల్, అండమాన్, నికోబార్‌లో స్వతంత్ర భారత పతాకాన్ని ఆవిష్కరించి సాగిపోయారు. ఇంతలో జపాన్ మీద అణుబాంబు పడ్డది. జపాన్ అతలాకుతలమై పోయింది. బోస్ నిస్సహాయుడై సహచరుల బలవంతంపై మంచూరియాలో సురక్షిత అజ్ఞాత స్థలానికి వెళ్ళడానికి అనిష్టంగానే జపాన్‌లో విమానం ఎక్కి తైపే వరకూ ప్రయాణించారు. 1945 ఆగస్ట్ 18న అకస్మాత్తుగా విమానంలో సాంకేతిక ఇబ్బంది వచ్చి కూలిపోయిందన్నారు. విమానంతో పాటే కోట్లాది భారతీయుల ఆశలూ నేల కూలాయి. 50 సంవత్సరాల వయసులోనే ఆ యోధునికి నూరేళ్ళూ నిండాయి.

– నందిరాజు రాధాకృష్ణ । 98481 28215

(నేడు నేతాజీ జయంతి)

మన క్రీడాకారిణులకు బాసట ఏది?

సందర్భం



జగ్మతి సాంగ్వాన్

బుధవారం న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అగ్రశ్రేణి భారతీయ మహిళా రెజ్లర్లు... భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, పార్లమెంటు సభ్యుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై దిగ్భ్రాంతికరమైన ఆరోపణలు చేశారు. తమను ఆయన లైంగికంగా వేధిస్తున్నారనీ, నిరంకుశంగా వ్యవహరిస్తున్నారనేవి వారి ఆరోపణలు. ఈ ఉదంతం భారత క్రీడారంగంలోని మురికిని మరో సారి ఎత్తిచూపింది. క్రీడా సంస్థల నాయకత్వంలో ఉన్న పురుషాధిపత్యం, రాజకీయాలతో వారికున్న అవినాభావ సంబంధాలు మరోసారి బట్టబయలు అయ్యాయి. ఆ మధ్య హరియాణా క్రీడా మంత్రి, భారత హాకీ మాజీ క్రీడాకారుడు అయిన సందీప్ సింగ్‌పై మరో ప్రముఖ అథ్లెట్, మహిళా కోచ్ చండీగఢ్‌లో చేసిన ఆరోపణలూ దాదాపూ ఇటువంటివే.

క్రీడాకారిణులకు మద్దతు ఇవ్వడమే తమ విధిగా ఉండాల్సిన మన క్రీడాధికారులు వాస్తవానికి తమ రాజకీయ బలాన్ని వారిని వేధించడానికి అనుకూలంగా మలచుకుంటున్నారు. తమ వేధింపులను ఎదిరించినవారిని శంకరగిరి మాన్యాలు పట్టిస్తున్నారు. కుటుంబపరమైన మద్దతు ఏమాత్రం లేకుండా నెలలు, సంవత్సరాల తరబడి శిక్షణ పొందుతూ... రక్తం, చెమట, కన్నీళ్లను పణంగా పెడుతున్న మహిళలు వీరు. వీరికి మరో వృత్తిని ఎంచుకునే అవకాశమూ ఉండదు. అవినీతిపరులైన అధికారుల చేతుల్లో వీరు తీవ్రమైన దోపిడీకి గురవుతున్నారు.

విషాదకరమైన విషయం ఏమిటంటే, క్రీడల్లో మహిళలపై వేధింపునకు సంబంధించి ఇటీవల వెలికివస్తున్న కేసులు నిజానికి సముద్రంలో నీటిబొట్టంత మాత్రమే. మహిళా రెజ్లర్లు తమ ప్రెస్ కాన్ఫరెన్సులో ఎత్తి చూపినట్లుగా ఈ ప్రత్యేక సమస్యకు సంబంధించిన నిజమైన రూపం చాలా భారీ స్థాయిలో, అత్యంత సంక్లిష్టంగా ఉంటోంది. క్రీడాకారిణులు చేస్తున్న ఫిర్యాదులను స్వీకరించడానికి ఇంతవరకు నెలకొల్పిన సమస్యా పరిష్కార నిబంధనలు ఏమాత్రం తమ ప్రభావం చూపలేదని స్పష్టమవుతోంది. పైగా తమను వేధింపులకు గురి చేస్తున్న వారి గురించి బయటపడి ఫిర్యాదు చేయడానికి ఇవి మహిళల్లో ఏమాత్రం విశ్వాసం కలిగించలేదని కూడా స్పష్టమవుతోంది.

వందలాది క్రీడాకారిణులు మౌనంగా ఉంటూ అధికారులకు లోబడి ఉండటానికి ప్రధాన కారణం వారు క్రీడల నుంచి బయటపడటానికి మరొక అవకాశం లేకపోవడమేనని చెప్పాలి. శక్తిమంతులైన రాజకీయ నియామకాల ద్వారా పదవుల్లోకి వచ్చి రాజకీయ సంరక్షణలో ఉంటున్న వారికి వ్యతిరేకంగా పోరాడటం అంత సులభం కాదని మహిళా అథ్లెట్లు, వారి కుటుంబాలకు బాగా తెలుసు.

ఇక్కడ ఒక విషయాన్ని నొక్కి చెప్పాల్సి ఉంది. మన అంతర్జాతీయ క్రీడాకారిణులలో చాలామంది తమను సపోర్టు చేయడానికి తమ కుటుంబాలు తమ వనరులను మొత్తంగా వెచ్చిస్తున్నారని చెబుతూ వచ్చారు. అధికారిక ప్రవేశ ద్వారాలను వారి ముఖాలమీదే మూసివేసిన సమయంలో, జంతర్ మంతర్ వద్ద మన మహిళా రెజ్లర్ల ప్రెస్ కాన్ఫరెన్స్‌ని చూస్తున్నప్పుడు... కీలకమైన ప్రాక్టీస్ సీజన్లో ఇలా బయటికి వచ్చారంటే వారు ఎంత నిస్పృహకు గురై ఉంటారో కదా అని చూసేవారికి బాధ, ఆగ్రహం కలుగుతాయి. హరియాణాలో సైతం ఆ జూనియర్ మహిళా కోచ్ రాష్ట్ర క్రీడా మంత్రికి వ్యతిరేకంగా న్యాయం పొందడానికి ఒకచోటు నుంచి మరొక చోటుకి పరుగులు తీశారు. కానీ హరియాణా ప్రభుత్వం మాత్రం నిందితుడి పక్షానే నిలిచింది. ఆ రకంగా మహిళా క్రీడా కమ్యూనిటీ మొత్తానికి అది ప్రతికూల సందేశాన్ని అందించింది.



ఆరోపణలకు గురైనవారు, వారి రాజకీయ ప్రభుత్వ యంత్రాంగానికి చెందినవారు బాధితురాలినే అవమానిస్తున్నారు. పైగా లైంగిక వేధింపు కేసుల వల్ల ఆపాదించబడే సామాజిక కళంకాన్ని భరిస్తూ... తమ కెరీర్‌నే నిలిపివేయగలిగిన విధ్వంసకరమైన అధికారాన్ని చలాయిస్తున్న మొత్తం అధికార యంత్రాంగాన్ని ఒంటరి బాధితురాలు ఎదురించి నిలబడటం చాలా కష్టం కూడా.

1990లలో నాటి టెన్నిస్ సమాఖ్య అధ్యక్షుడు, హరియాణా పోలీస్ ఐజీ ఎస్పీఎస్ రాథోడ్‌కు వ్యతిరేకంగా గళమెత్తిన టెన్నిస్ క్రీడాకారిణి రుచికా గిర్‌హోత్రాకు చెందిన ముఖ్యమైన ఉదంతాన్ని మననం చేసుకోవలసి ఉంది. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం మొత్తంగానూ, అనేక కుల ప్రాతిపదిక సంస్థలు ఆనాడు నిందితుడి పక్షానే నిలబడ్డాయి. ఆరోపణకు గురైన రాథోడ్ నిజానికి ప్రమోషన్ పొంది హరియాణా డీజీపీ అయ్యారు. తీవ్రమైన శత్రుపూరిత వాతావరణంలో రుచిక తన జీవితాన్నే ముగించుకున్నారు. న్యాయం కోసం కుటుంబం సాగించిన పోరాటంలో ఆమె తండ్రి కూడా మరణించారు. ఆమె సోదరుడు జనం కంట పడకుండా ఎంతో దూరంలో జీవితం గడపాల్సి వచ్చింది. ఆమె సన్నిహిత మిత్రుడి కుటుంబం, ఇతర మహిళా సంస్థలు ఎంతో శ్రమ కోర్చి ఈ కేసును ప్రతి స్థాయిలోనూ ముందుకు తీసుకెళుతూ 19 ఏళ్ల పాటు పోరాడారు. అయినప్పటికీ నిందితుడైన రాథోడ్ ఆరునెలల జైలు శిక్షను, వెయ్యి రూపాయలు జరిమానాను మాత్రమే పొందాడు.

దురదృష్టకరమైన విషయం ఏమిటంటే నాటి నుంచి నేటివరకు మన క్రీడాకారిణుల జీవితాల్లో పెద్దగా మార్పు లేదు. తన జీవితాన్ని ముగించుకోవాలనే నిస్పృహతో కూడిన ఆలోచనల గురించి కన్నీళ్లు పెట్టుకుంటూ మాట్లాడిన వినేశ్ ఫోగాట్ దీన వదనం చూసి దేశ ప్రజలు, ముఖ్యంగా క్రీడా సమాజం దిగ్భ్రాంతి చెంది ఉండాలి. ఈ రెండు కేసుల్లోనూ ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీని, క్రీడాధికారులను తప్పక కఠిన ప్రశ్నలు వేసితీరాలి. క్రీడాకారిణులు పతకాలు తీసుక వస్తున్నప్పుడు వారు సాధించిన ఉజ్వల కీర్తిని తమ సొంతం చేసుకుని మురిసిపోవడంలో రాజకీయ నేతలు, క్రీడా సమాఖ్య అధిపతులు ముందు ఉంటున్నారు. కానీ మరోవైపున తమకు జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా గళం విప్పడానికి క్రీడాకారిణులు ప్రయత్నించిన ప్రతిసారీ ఏమాత్రం సిగ్గూ శరమూ లేకుండా నిందితులనే కాపాడటానికి ప్రయత్నిస్తున్నారు. వీరందరూ ఇప్పుడు సమాధానం చెప్పి తీరాలి.

క్రీడాకారిణులను వేధించిన కేసుల్లో అవసరమైన సమర్థ న్యాయ ప్రక్రియను తక్షణం ఏర్పర్చాల్సిన అవసరం ఉంది. అత్యున్నత స్థాయిల్లోని క్రీడా విభాగాలు, సమాఖ్యలు, ప్రభుత్వ క్రీడా విభాగాలు అన్నింటిలో లైంగిక వేధింపులకు వ్యతిరేక కమిటీలను తప్పక ఏర్పర్చాలి. ఈ ప్రక్రియను అనుసరించనప్పుడు, సంబంధిత అధికారులనే జవాబుదారీగా చేయాలి. మైదానంలో అత్యున్నతంగా పోరాడుతూనే తమకు న్యాయం జరగాలని గట్టిగా పోరాడుతున్న మన క్రీడాకారిణులకు సంఘీభావం పలకడం ఈ దేశంలో క్రీడలను ప్రేమించే ప్రతి ఒక్కరి బాధ్యత.

వ్యాసకర్త వాలీబాల్ క్రీడాకారిణి, 'ఐద్వా' జాతీయ ఉపాధ్యక్షురాలు

('ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సౌజన్యంతో)

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: శు.విదియ రా.10.40 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: శ్రవణం ఉ.6.16 వరకు, తదుపరి ధనిష్ఠ తె.4.45 వరకు (తెల్లవారితే మంగళవారం), వర్జ్యం: ఉ.10.00 నుండి 11.32 వరకు, దుర్ముహూర్తం: ప.12.34 నుండి 1.17 వరకు, తదుపరి ప.2.46 నుండి 3.31 వరకు, అమృతఘడియలు: రా.7.02 నుండి 8.29 వరకు ; రాహుకాలం: ఉ.7.30 నుండి 10.30 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 6.38, సూర్యాస్తమయం: 5.46.

క్లుప్తంగా...

పెద్దగట్టులో దిష్టిపూజా మహోత్సవం



రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద జాతరగా పేరొందిన శ్రీ లింగమంతుల స్వామి పెద్దగట్టు జాతర ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి దిష్టిపూజా మహోత్సవం నిర్వహించారు. మున్న, మెంతబోయిన వంశస్తులు సూర్యాపేట మండలంలోని కేసారం గ్రామం నుంచి దేవరపెట్టెను గట్టుకు చేర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రెండు బోనాలను దేవతా మూర్తులకు సమర్పించారు. మున్న, మెంతబోయిన వంశస్తులు తల్లి, పిల్ల గొర్రెను బలిచ్చి, రక్తాన్ని అన్నంలో కలిపి గుడి చుట్టూ చల్లి బలిహరణ కార్యక్రమం చేపట్టారు. – సూర్యాపేట

మల్లన్న జాతర షురూ

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి జాతర ఆదివారం ప్రారంభమైంది. ఏటా సంక్రాంతి తర్వాత వచ్చే మొదటి ఆదివారంతో ప్రారంభమై 3 నెలల పాటు కొనసాగుతుంది. మొదటివారం (పట్నంవారం) సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం గుట్టపై వెలిసిన రేణుక ఎల్లమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి దర్శనానికి సుమారు ఆరు గంటల సమయం పట్టింది. సోమవారం హైదరాబాద్ భక్తులు ఆలయ తోటబావి ప్రాంగణంలో అగ్నిగుండాలు, పెద్దపట్నం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

యాదాద్రి కిటకిట



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల ప్రజలు స్వామిని దర్శించుకునేందుకు అధికంగా తరలి వచ్చారు. దీంతో దర్శనం క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, కల్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణి, ఆలయ పరిసరాలు భక్తులతో నిండుగా కనిపించాయి. ధర్మదర్శనానికి రెండున్నర గంటలు, వీఐపీ దర్శనానికి 40 నిమిషాల సమయం పట్టినట్లు భక్తులు వెల్లడించారు. స్వామిని 30వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజల ద్వారా నిత్యాదాయం రూ.34,07,341 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

చట్టసభల్లో బీసీలకు 27% రిజర్వేషన్లు కల్పించాల్సిందే

సాక్షి, హైదరాబాద్: ఎటువంటి ఉద్యమాలు లేకపోయినా రాత్రికి రాత్రే 10% ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను చట్టబద్ధం చేసిన కేంద్రప్రభుత్వం చట్టసభల్లో బీసీలకు 27% రిజర్వేషన్లను అమలు చేసేలా వచ్చే పార్లమెంటు సమావేశాల్లో చట్టం తేవాలని బీసీ రాజ్యాధికార సమితి కన్వీనర్ దాసు సురేశ్ డిమాండ్ చేశారు. కేంద్రమంత్రివర్గంలో బీసీలకు 27% అవకాశాలిచ్చిన బీజేపీ, చట్టసభల్లో మాత్రం బీసీలకు 27% రిజర్వేషన్లను కల్పించడెందుకని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగంలో మనం రూపొందించుకున్న 'సమానత్వం'నేటికీ వాస్తవరూపం దాల్చలేదని, దేశ ప్రజలకు కూడు, గూడు, గుడ్డను అందించే బీసీలు నేటికీ అన్ని రంగాల్లో వెనుకబడేఉన్నారని ఆదివారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. సంపన్నులకు సంపదను దోచిపెడుతూ, పేదవాడు దేశంలో బతికే పరిస్థితి లేకుండా చేశారని విమర్శించారు. దేశంలో బీసీ ఓట్లపై అన్ని పార్టీలకు రాజకీయ అనివార్యతను సృష్టిస్తామని ఆయన హెచ్చరించారు.

పెరిగిన ధరల మేరకు స్కాలర్‌షిప్ ఇవ్వాలి



సుందరయ్యవిజ్ఞానకేంద్రం (హైదరాబాద్): పెరిగిన ధరల మేరకు విద్యార్థులకు ఇచ్చే ఉపకారవేతనాలను కూడా పెంచాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థులకు రెండేళ్లుగా బకాయి ఉన్న రూ.3,500 కోట్ల ఫీజులను వెంటనే చెల్లించాలని ఆయన కోరారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో 16 బీసీ సంఘాలతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటర్ విద్యార్థుల ఫీజు రియింబర్స్‌మెంట్ రూ.1,800 నుంచి రూ.5,000కు, కాలేజీ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను రూ.1,500 నుంచి 1,800కు, పాఠశాల హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను రూ.1,100 నుంచి రూ.2,000లకు పెంచాలని డిమాండ్ చేశారు. బీసీబంధు ప్రవేశపెట్టి ప్రతి కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. జూనియర్ అడ్వొకేట్లకు స్టైపెండ్‌ను రూ.10 వేలకు పెంచాలన్నారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ కృష్ణ, రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ, యు వజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ పాల్గొన్నారు.

ఇళ్లు అనుమతులూ లేవు..

ఆందోళన వ్యక్తం చేస్తున్న వాసాలమర్రి గ్రామస్తులు

- ఆ గ్రామాన్ని దత్తత తీసుకున్న సీఎం కేసీఆర్
- ఊరంతటినీ అభివృద్ధి చేస్తానని హామీ
- రెండేళ్ల కిందే రూ.152 కోట్లతో డీపీఆర్..
- ఇప్పటికీ నిధులు రాక అడుగుముందుకు పడని పనులు
- త్వరగా ఇళ్లు కట్టించాలని గ్రామస్తుల డిమాండ్
- సొంతంగా కట్టుకునే అనుమతి అయినా ఇవ్వాలని విజ్ఞప్తులు

సాక్షి, యాదాద్రి: సీఎం కేసీఆర్ దత్తత తీసుకున్న యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామస్తులు పక్కా ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. సీఎం ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి పనులు ఎప్పుడు చేపడతారా అని రెండేళ్లుగా వేచి ఉన్నామని.. ఇప్పటికీ ఇళ్లు, మౌలిక వసతుల నిర్మాణం ప్రారంభమే కాలేదని అంటున్నారు. కనీసం సొంతంగా కట్టుకునే పర్మిషన్లూ ఇవ్వడం లేదని చెప్తున్నారు. పాత, సగం కూలిపోయిన ఇళ్లలో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని వాపోతున్నారు. వెంటనే ఇళ్లు కట్టించి ఇవ్వాలని, లేకుంటే సొంతంగా కట్టుకునేందుకు అనుమతులైనా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ పోగుల ఆంజనేయులు, ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులతో కలిసి ఇటీవల భువనగిరి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం అందజేశారు.



తుర్కపల్లి మండలం వాసాలమర్రిలో కూలిపోయిన ఇళ్లపై కవర్ కప్పిన దృశ్యం

రెండేళ్ల క్రితం దత్తత తీసుకున్న సీఎం

వాసాలమర్రి గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్టు 2020 నవంబర్ 1న సీఎం కేసీఆర్ ప్రకటించారు. 2021 జూన్ 22న గ్రామసభ నిర్వహించి, స్థానికులతో సహపంక్తి భోజనం చేశారు. బంగారు వాసాలమర్రిగా అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. అంతకు ముందు జనగామ జిల్లా కొడకండ్లలో రైతువేదిక భవనాన్ని ప్రారంభించడానికి వాసాలమర్రి మీదుగా వెళ్తున్న సీఎం కేసీఆర్ కాన్వాయ్ ఎదుట గ్రామస్తులు నిరసన తెలిపే ప్రయత్నం చేశారు. ఆ విషయం తెలుసుకున్న సీఎం సాయంత్రం తిరుగు ప్రయాణంలో గ్రామంలోని రామాలయం వద్ద ఆగి మాట్లాడారు. వాసాలమర్రిని ఎర్రవల్లి తరహాలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామానికి ప్రత్యేకంగా లేఅవుట్ అభివృద్ధి చేసి, ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లు కట్టిస్తానని ప్రకటించారు. తర్వాత ప్రభుత్వ అధికారులు గ్రామంలో పర్యటించి చేపట్టాల్సిన పనులపై సర్వే చేశారు. రూ.152 కోట్లతో డీపీఆర్‌ను రూపొందించారు.



ఎర్రవల్లి ఫాంహౌస్‌కు వెళ్లే దారిలో ఉన్న వాసాలమర్రి గ్రామంలో కూల్చివేసిన ఇళ్లు

కానీ ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి విడుదల కాలేదు.

481 ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక

వాసాలమర్రిలో ప్రస్తుతం 103 పక్కా ఇళ్లు, మరో 481 పెంకుటిళ్లు, రేకుల ఇళ్లు, గుడిసెలు ఉన్నాయి. ఈ 481 ఇళ్లను కూల్చివేసి వాటి స్థానంలో పక్కా ఇళ్లను నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఉమ్మడి కుటుంబాలు ఉన్నవారి కోసం జీ ప్లస్ వన్, జీ ప్లస్ టూ పద్ధతిలో ఇళ్లు నిర్మించాలని నిర్ణయించారు. అంతర్గత మురుగు కాల్వలు, మంచినీటి ట్యాంకు, పార్కు, ఫంక్షన్‌హాల్, గ్రామ పంచాయతీ భవనం, సీసీ రోడ్లు, పాఠశాల భవనాలు, పోస్టాఫీస్, మినీ మార్కెట్, సబ్ సెంటర్‌లను నిర్మించాలని నిర్ణయించారు. గ్రామాన్ని పునర్నిర్మించే క్రమంలో తాత్కాలికంగా ఇళ్లు కూడా నిర్మించాలన్న ఆలోచనకు వచ్చారు. కానీ ఇవేవీ ముందుకు పడలేదు.

వెంటనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



గ్రామంలో 481 పెంకుటిళ్లు కూల్చివేసి డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తామని సీఎం ప్రకటించారు. రెండేళ్లు అవుతోంది. ఇళ్లను త్వరగా పూర్తి చేయాలనడమేగానీ నిర్మాణం ప్రారంభం కావడం లేదు. గ్రామ అభివృద్ధి కోసం రూ.152 కోట్లతో డీపీఆర్ పంపించారు. నిధులు రాలేదు. లేఅవుట్ కాలేదు. 50 ఇళ్లు కూలిపోయాయి. నా ఇల్లు కూడా సగం కూలిపోయింది. కొత్తగా కట్టుకుందామంటే పర్మిషన్ లేదు. వెంటనే ఇళ్లు కట్టించాలని, లేకుంటే కట్టుకునే పర్మిషన్ అయినా ఇప్పించాలని గ్రామస్తులు పంచాయతీపై ఒత్తిడి తెస్తున్నారు. ఏదైనా సీఎం సార్ నిర్ణయం తీసుకోవాలని అధికారులు అంటున్నారు. మూడు విడుతలుగా నిధులు ఇస్తామని ప్రభుత్వం చెప్పడంతో మౌలిక వసతుల కోసం రూ.58 కోట్లతో మరో డీపీఆర్ పంపించామని కలెక్టర్ చెప్తున్నారు. త్వరగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి.

– పోగుల అంజనేయులు, సర్పంచ్, వాసాలమర్రి

కొత్త నిర్మాణాలకు పర్మిషన్ ఇవ్వలేకపోతున్నాం



నూతన భవన నిర్మాణాలకు గ్రామ పంచాయతీ పర్మిషన్ ఇవ్వలేకపోతున్నాం. గ్రామంలో చాలా మంది పేదలు ఉన్నారు. వానాకాలంలో పాత ఇళ్లు కొన్ని కూలిపోయాయి. కొందరు గుడిసెలలో జీవిస్తున్నారు. ఇటు ప్రభుత్వం ఇళ్లు కట్టించి ఇవ్వకుండా.. మరోవైపు సొంత డబ్బులతో కట్టుకుందామనుకున్నా అనుమతులు ఇవ్వక పోవడంతో ప్రజల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది.

– పలుగుల మధు, ఉప సర్పంచ్

పోరాటంతోనే రామప్పకు యునెస్కో గుర్తింపు



రామప్ప దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత, మంత్రి సత్యవతి రాథోడ్

- మేడారం జాతరకు జాతీయ హోదా ఇవ్వాలి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

వెంకటాపురం(ఎం): ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరాటం.. స్థానిక ప్రజల పోరాటంతోనే రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు లభించిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం ములుగు జిల్లా వెంకటాపురం(ఎం) మండలంలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని రాష్ట్ర గిరిజన, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలసి ఆమె సందర్శించారు. రామప్ప ఆలయ ఈఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూజారులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలోకి ఆహ్వానించారు. తర్వాత వారు ఆలయంలో రామలింగేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం రామప్ప గార్డెన్‌లో ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడారు. కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో రామప్ప ఆలయం ఉన్నందున గుడికి సంబంధించి అభివృద్ధి పనులు చేపట్టడం సాధ్యం కాదని, ఆలయ పరిసరాల ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర 'మేడారం'.. ములుగు జిల్లాలో ఉండడం గర్వకారణమన్నారు. ఈ జాతరకు జాతీయ హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ములుగులో గిరిజన యూనివర్సిటీ కోసం 334 ఎకరాలను కేటాయించినట్లు వెల్లడించారు. ములుగు జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటైందని, వచ్చే ఏడాది నుంచి తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. కాగా, రూ.1,800 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం సమ్మక్క బ్యారేజీని నిర్మించినట్లు పేర్కొన్నారు. గోదావరి పరీవాహక కోత ప్రాంతాల్లో కరకట్టల నిర్మాణానికి ప్రభుత్వం రూ.130 కోట్ల నిధులను కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్, రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రకాశ్‌రావు, ఎమ్మెల్యే గంద్ర వెంకటరమణారెడ్డి, రెడ్కో చైర్మన్ సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదివాసీలే అడవికి బాస్‌లు

▶ మొదటి పేజీ తరువాయి

మీద చర్చించారు. వాటిని పరిష్కరించే విషయంలో తాను ప్రధాన మంత్రికి విన్నవిస్తానని చెప్పారు.

కేసీఆర్‌కు వచ్చే తీరిక లేదా: సంజయ్

త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాలే కేసీఆర్‌కు సీఎంగా ఆఖరి సమావేశాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నా రు. నాగోబా జాతరకు సరైన ఏర్పాట్లు చేయకపోవడం ఈ ప్రభుత్వం దిగజారుడి తనానికి నిదర్శనమన్నారు. నిజాం మనవడు చనిపోతే ప్రభుత్వం లాంఛనాలతో అంత్యక్రియ లు చేయించిన కేసీఆర్‌కు కనీసం నాగోబాకు వచ్చే తీరిక లే దా అని ప్రశ్నించారు. గిరిజనులంటేనే కేసీఆర్‌కు చులకన అ ని విమర్శించారు. ఆదివాసీ బిడ్డ రాష్ట్రపతి కాకుండా ఓడించేందుకు కుట్ర చేశారని ఆరోపించారు. కేసీఆర్ పోడు భూ ములకు పట్టాలిస్తానని మాట తప్పారని, తండాలకు నిధులు ఇవ్వకుండా ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. , కేసీఆర్ దండుపాళ్యం ముఠా నాయకుడని ఘాటుగా విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక నాగోబా జాతరను అబ్బురపడే విధంగా నిర్వహిస్తామని చెప్పారు. అంతకుముందు కేంద్ర మంత్రితో కలి సి బండి సంజయ్, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, ఆదిలాబాద్ బీజేపీ జిల్లా అధ్య క్షుడు పాయల్ శంకర్ నాగోబాకు పూజలు చేశారు.



నాగోబా విగ్రహానికి పూజలు చేస్తున్న అర్జున్ ముండా, బండి సంజయ్ సోయం బాపురావు తదితరులు

భయానక పరిస్థితిని ఎదుర్కొన్నా

అప్రమత్తతతో ఉండడమే ప్రాణాలను కాపాడింది ● ట్విట్టర్‌లో స్మితా సభర్వాల్ ఆవేదన



సాక్షి, హైదరాబాద్: 'నా ఇంట్లో ఒక అగంతకుడు చొరబడటంతో గత రాత్రి అత్యంత భయానక పరిస్థితిని ఎదుర్కొన్నా. అప్రమత్తతతో ఉండటంతో నా ప్రాణాలను రక్షించుకోగలిగాను'అని ముఖ్యమంత్రి కార్యదర్శి స్మిత సభర్వాల్ ఆదివారం ట్విట్టర్ ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. 'ఎంత సురక్షితంగా ఉన్నామనే భావనలో ఉన్నా.. ప్రతిసారీ తలుపులు, గడియలను స్వయంగా మనమే సరిచూసుకోవాలి' అన్న పాఠాన్ని ఈ ఘటన నేర్పిందని ఆమె పేర్కొన్నారు. ఆమె ఇంట్లో అర్ధరాత్రి వేళలో చొరబడిన ఓ డిప్యూటీ తహశీల్దార్‌తో పాటు అతడితో పాటు వచ్చిన మరో వ్యక్తిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించిన విషయం తెలిసిందే.

మానసిక రుగ్మతనా... మద్యం మత్తా..

- స్మితా సబర్వాల్ ఇంట్లో చొరబడిన నిందితుడిపై అనుమానాలు...




ఆనంద్‌కుమార్ రెడ్డి   బాబు

బంజారాహిల్స్ (హైదరాబాద్): ముఖ్యమంత్రి కార్యాలయంలో కీలక పదవిలో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ ఇంట్లోకి గురువారం రాత్రి అనుమానాస్పదంగా ప్రవేశించిన డిప్యూటీ తహసీల్దార్ చెరుకు ఆనంద్‌కుమార్‌రెడ్డి మానసిక స్థితిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్నేహితుడు బాబుతో కలిసి రాత్రి 11.34 గంటలకు ఆమె ఇంట్లోకి ప్రవేశించిన ఆనంద్ అక్కడి నుంచి 'ఎట్ యువర్ డోర్ స్టెప్'అంటూ ట్వీట్ చేశాడు. ఆమె నివాసముంటున్న ప్లాట్ యూసుఫ్‌గూడ పోలీసు లైన్స్‌లోని ప్లెజెంట్ వాలీ గేటెడ్ కమ్యూనిటీలో. అంతేకాకుండా 24 గంటలు పోలీసు సెక్యూరిటీ ఉంటుంది. ఇంత బందోబస్తు ఉన్న ప్లాట్‌లోకి అంత ధీమాతో ఎలా వెళ్లాడన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఆ సమయంలో నిందితుడు మద్యం తాగి ఉన్నాడా లేక మానసిక స్థితి కోల్పోయాడా అన్నది తేలాల్సి ఉంది. నిందితుడు పక్కాప్లాన్‌తోనే వచ్చినట్లుగా తెలుస్తోంది. స్నేహితుడిని బయట కారులో ఉంచి ఆనంద్ మాత్రమే లోనికి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఉద్యోగం విషయం మాట్లాడాలంటే పగలు రావాలిగానీ రాత్రి ఎందుకు వచ్చారు అన్నది అర్థం కావడం లేదు. మరోవైపు నిందితుడు విద్యావంతుడు. ఎమ్మెస్సీ మ్యాథ్స్, లా, జర్నలిజం చదివి న్యూఢిల్లీలో వార్త పత్రిక కరస్పాండెంట్‌గా, దక్కన్ క్రానికల్ ఆసియా ఏజ్ పత్రిక జర్నలిస్టుగా, సూర్య పత్రిక న్యూఢిల్లీ జర్నలిస్టుగా పనిచేసిన అనుభవం ఉంది. ఇంత కీలకమైన పోస్టుల్లో పనిచేసిన ఈయన ఐఏఎస్ అధికారిణి ఇంట్లోకి ఆ విధంగా వెళ్లడం విడ్డూరంగా ఉంది. ఏదేమైనా నిందితులను కస్టడీలోకి తీసుకుంటేనే పూర్తి వివరాలు వెలుగుచూసే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా స్మితా సబర్వాల్ ఇంటివద్ద ఉన్న సెక్యూరిటీ గార్డులు అంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం పోలీసుల నిర్లక్ష్యాన్ని బయటపెడుతోంది. వీరిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది.

ఆడబిడ్డలూ.. తస్మాత్ జాగ్రత్త

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ పాలనలో మినిమమ్ గవర్నెన్స్, మ్యాగ్జిమమ్ పాలిటిక్స్ ఫలితమే ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్ ఇంట్లోకి ఆగంతకుడు చొరబడిన ఘటన అని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి విమర్శించారు. 'సింగరేణి కాలనీలో ఆరేళ్ల పసిబిడ్డకే కాదు... ముఖ్యమంత్రి కార్యాలయంలో పనిచేసే మహిళా ఉన్నతాధికారిణికీ భద్రత లేని పాలనలో ఉన్నాం. ఆడబిడ్డలూ... తస్మాత్ జాగ్రత్త'అని ఆదివారం తన ట్విట్టర్‌లో రేవంత్ పోస్టు చేశారు.

ఇదేం 'శిక్ష'ణ..?

▶ మొదటి పేజీ తరువాయి

బాధ్యతలు తీసుకున్న ఓ కాంట్రాక్టు సంస్థ... కిందిస్థాయిలో ఒక్కో వ్యక్తికి 10 సెంటర్ల చొప్పున రూ. 7.5 లక్షలకు సబ్ కాంట్రాక్టు ఇచ్చినట్లు తెలిసింది. అయితే సబ్ కాంట్రాక్టు పొందిన వాళ్లంతా తరగతులు ప్రారంభించి దాదాపు నెల రోజులు నిర్వహించిన అనంతరం అప్పటివరకు చెప్పిన క్లాసులకు బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టు తీసుకున్న సంస్థలను డిమాండ్ చేశారు. కానీ కాంట్రాక్టు సంస్థలు పట్టించుకోకపోవడంతో సబ్ కాంట్రాక్టు సంస్థలు శిక్షణ తరగతులను నిలిపివేశాయి. దీంతో అర్ధంతరంగా కోచింగ్ నిలిచిపోవడంతో అభ్యర్థులు ఆందోళనకు దిగారు. కామారెడ్డి, నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లోని బీసీ స్టడీ సెంటర్ల నిర్వహణపై అభ్యర్థులు జిల్లా కలెక్టర్లను కలిసి ఫిర్యాదు చేయగా మరికొన్ని జిల్లాల్లో అభ్యర్థులను స్థానిక అధికారులకు ఫిర్యాదులు చేశారు. మరోవైపు దీనిపై వివాదం కొనసాగుతుండగానే శిక్షణ గడువు ముగిసిందంటూ కాంట్రాక్టు సంస్థలు బీసీ స్టడీ సర్కిల్ నుంచి బిల్లులు డ్రా చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

నోటీసులిచ్చినా స్పందించలేదు..

కలెక్టర్ల ఆదేశంతో రంగంలోకి దిగిన బీసీ సంక్షేమ అధికారులు వాస్తవ పరిస్థితులను గుర్తించి బీసీ స్టడీ సర్కిల్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ఇటీవల కాంట్రాక్టు పొందిన ప్రైవేటు సంస్థలకు నోటీసులు జారీ చేసింది. అవకతవకలపై వెంటనే వివరణ ఇవ్వాలని పేర్కొంది. కానీ ఈ నోటీసులకు ఆయా సంస్థల నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాలేదు.

అర్ధంతరంగా ఆపేస్తే ఎలా?

గ్రూప్–3, గ్రూప్–4 పోస్టులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అనగానే సంబరపడ్డా. నారాయణపేట జిల్లాలోని బీసీ స్టడీ సెంటర్‌లో కోచింగ్‌కు వెళ్లా. దాదాపు నెలన్నర తరగతుల అనంతరం శిక్షణను అర్ధంతరంగా ఆపేశారు. దీంతో సిలబస్ పూర్తికాక, ఇతర కోచింగ్ సెంటర్లకు వెళ్లే పరిస్థితి సతమతమవుతున్నా. – శ్వేత, బొమ్మన్‌పాడ్, నారాయణపేట జిల్లా

కుల, మతాల పేరుతో.. చిచ్చుపెట్టే శక్తుల్ని దూరం పెట్టాలి

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



భారతమాత మహా హారతి కార్యక్రమంలో పాల్గొన్న వెంకయ్యనాయుడు, కిషన్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్/ఖైరతాబాద్: కులం, మతం, భాష, వర్ణం, వర్గం పేర్లతో ప్రజల్ని విభజించే వ్యక్తుల్ని, శక్తుల్ని దూరం పెట్టాల్సిన అవసరం ఉందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఆదివారం భారతమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజాలో భారతమాత మహాహారతి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. మన భూమి వీరుల పురుటిగడ్డ, ఇక్కడి వీరులంతా శాంతి కోసం జీవితాలు త్యాగం చేశారే తప్ప యుద్ధ కాంక్షతో కాదన్నారు. చరిత్ర తిరగవేస్తే యుద్ధాల్లో భారతీయులు సాధించిన విజయాలు కనిపిస్తాయి కానీ అవేవీ మన దేశ విస్తీర్ణం పెంచుకోవాలని చేయలేదని గుర్తు చేశారు. శాంతి అహింస మన రక్తంలో ఉన్నాయన్నారు. విశాల భారతదేశం తత్వ గణిత శాస్త్రాల్లో ప్రపంచానికే తల్లిగా ఉండేదన్నారు. లాభదాయకమైన వ్యవసాయంతో, సుసంపన్నంగా, కళాసంపదతో ఉన్న మన దేశంలో బ్రిటిషర్లు ప్రవేశించి మనల్ని అన్ని రకాలుగా దోచుకున్నారన్నారు. వారిపై జరిపిన పోరాటాలు, వీరుల త్యాగాల నుంచి యువతరం స్ఫూర్తి పొందాలనేది తన ఆకాంక్ష అన్నారు. తాను విదేశాలకు వెళ్లినప్పుడు తన సాదా సీదా దుస్తులు చూసి ఎవరూ అగౌరవపరచలేదు కాబట్టి కన్నతల్లిని, మాతృభూమిని, మాతృభాషని మనం ఎప్పుడూ మరచిపోకూడదని ఉద్బోధించారు. మనదైన సంస్కృతి, సంప్రదాయం, సంగీతం, 64కళలను గౌరవించుకోవాలన్నారు. మాతృభాష కళ్లలాంటిది అయితే పరాయి భాష కళ్లద్దాల్లాంటివని.. కళ్లు లేకుండా ఎంత ఖరీదైన కళ్లద్దాలు పెట్టుకున్నా వృథా అని గుర్తుంచుకోవాలని సూచించారు. దేశం త్యాగం చేసిన మహనీయుల టంగుటూరి, అల్లూరి, కొమరంభీమ్, వీరపాండ్య కట్టబ్రహ్మన తదితరుల జీవిత చరిత్రల మన చరిత్రలో భాగం కావాల్సి ఉందన్నారు. దేశంలోని జనాల జీవితాల్లో నిజమైన వెలుగులు నింపినప్పుడే భారతమాతకు నిజమైన హారతి అని పేర్కొన్నారు.

దేశం, దైవ ప్రేమ రెండూ ఒకటే..

ఆర్ట్ ఆఫ్ లివింగ్ పండిట్ రవిశంకర్ మాట్లాడుతూ.. దేశం, దైవ ప్రేమ రెండూ ఒకటే అన్నారు. మన సంస్కృతిని కాపాడేందుకు ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. యువత పాశ్చాత్య సంస్కృతిలో పడి మన సంస్కృతిని మర్చిపోతున్నారన్న బాధ ఇక్కడికి విచ్చేసిన యువతను చూస్తే పోయిందన్నారు

కొత్త కోడళ్ల భేటింగ్


- నాగోబా ఆలయంలో మెస్రం వంశీయుల పూజలు
- కేస్లాపూర్ జాతరకు తరలివచ్చిన భక్తులు

ఇంద్రవెల్లి (ఖానాపూర్): ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయంలో మెస్రం వంశీయుల పూజలు కొనసాగుతున్నాయి. కొత్త కోడళ్ల భేటింగ్ ఆదివారం వేకువజాము వరకు కొనసాగింది. ముందుగా ఆలయ సమీపంలోని గోవడ్ వద్ద బస చేసిన మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు చేసి సంప్రదాయ వాయిద్యాలతో ఆలయానికి చేరుకున్నారు. 190 మంది కొత్త కోడళ్లు సతీదేవత ఆలయంలో పూజల అనంతరం భేటింగ్ (పరిచయం)లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వంశ పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. ఉదయం కోనేరు నుంచి పవిత్ర జలాన్ని గోవడ్ వద్దకు తీసుకువచ్చారు. ఆ నీటితో నైవేద్యం తయారు చేసి నాగోబా, సతీదేవతలకు సమర్పించారు. ఈ ప్రక్రియ అనంతరం వారంతా మెస్రం వంశంలో చేరినట్లుగా భావిస్తారు. అనంతరం కొత్తకోడళ్లు దీక్ష విరమించారు. ఆదివారం జాతరకు భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈనెల 28 వరకు జాతర కొనసాగుతుందని ఈవో రాజమౌళి, ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం తెలిపారు.



కోనేరు నుంచి పవిత్ర జలం సేకరిస్తున్న మెస్రం వంశ కొత్త కోడళ్లు

క్లుప్తంగా



వారణాసిలో సీఎన్‌జీ బోట్లు

వారణాసి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వారణాసిలో గంగా నదిలో తిరిగే అన్ని బోట్లకు పర్యావరణహిత సీఎన్‌జీ ఇంజిన్లను అమరుస్తామని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి చెప్పారు. 500 బోట్లను డీజిల్‌కు బదులు సీఎన్‌జీ ఇంజిన్లను అమర్చడం లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే 583 బోట్లను మార్చామన్నారు. మరో 2వేల బోట్లను సీఎన్‌జీకి మార్చే పనిలో ఉన్నామని చెప్పారు. ఇకపై పెద్ద శబ్దాలతో కాలుష్యాన్ని వెదజల్లే డీజిల్ బోట్లకు బదులుగా గంగానదిలో శబ్దంలేని, తక్కువ కలుషితాలను మాత్రమే వదిలే సీఎన్‌జీ బోట్లు పూర్తి స్థాయిలో రానున్నాయని చెప్పారు. సీఎన్‌జీ వల్ల పడవల నిర్వాహకులకు ఏటా రూ.30 వేల దాకా ఆదా అవుతుందన్నారు.

ప్రాంతీయ భాషల్లో సుప్రీం తీర్పు ప్రతులు..

సీజేఐ సూచనపై మోదీ హర్షం

న్యూఢిల్లీ: తీర్పుల ప్రతులను ప్రాంతీయ భాషల్లో కూడా అందుబాటులోకి తేవాలన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రయత్నాన్ని ప్రధాని మోదీ ప్రశంసించారు. ''సీజేఐ యోచన ప్రశంసనీయం. మన దేశంలో ఎన్నో భాషలున్నాయి. మన సాంస్కృతిక చైతన్యానికి ఇవి తోడ్పడతాయి. ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి కోర్సులను మాతృభాషల్లోనే అభ్యసించే అవకాశం ఇవ్వడంతోపాటు, భారతీయ భాషలను ప్రోత్సహించేందుకు కేంద్రం అనేక ప్రయత్నాలు చేస్తోంది'' అంటూ ట్వీట్ చేశారు.

ఉక్రెయిన్‌కు ఆయుధాలిస్తే భారీగా విరుచుకుపడతాం

పశ్చిమ దేశాలకు రష్యా హెచ్చరిక

కీవ్: ఉక్రెయిన్‌కు శక్తివంతమైన ఆయుధాలిచ్చి తమను తాము నాశనం చేసుకోవద్దని పశ్చిమదేశాలకు రష్యా పార్లమెంట్ స్పీకర్ వ్యాచెస్లావ్ వొలోదిన్ హెచ్చరించారు. ఎదురుదాడులకు ఉపయోగపడే ఆయుధాలను ఉక్రెయిన్‌కు అందజేస్తే, తాము మరింత శక్తివంతమైన ఆయుధాలను వాడాల్సి వస్తుందని, అంతిమంగా ప్రపంచ వినాశనానికే దారి తీస్తుందన్నారు. ఉక్రెయిన్‌కు యుద్ధ ట్యాంకులు మినహా గగనతల రక్షణ వ్యవస్థలు తదితరాలను అందజేస్తామంటూ నాటో, అమెరికా ఇస్తున్న హామీలపై ఆయన ఆదివారం ఈ మేరకు స్పందించారు.

ఆమె కమాండ్‌లో...

దేశంలో తొలిసారిగా కల్నల్ స్థాయికి ఎదిగిన మహిళా అధికారులు


- సియాచిన్‌లోనూ కమాండింగ్ అధికారులుగా మహిళల నియామకం
- నెరవేరిన దశాబ్దాల కల

ఆకాశంలో సగం కాదు...
నింగి నేల నీరు దేనినైనా పూర్తిగా
కమాండ్ చేస్తామంటోంది మహిళాలోకం
కఠోరమైన శారీరక శ్రమ చేయాల్సిన కదనరంగాన్ని కూడా నడిపించడానికి ముందుకొచ్చింది..
దశాబ్దాలుగా ఎందరో మహిళా అధికారుల
కల ఎట్టకేలకు నెరవేరింది.
100 మందికిపైగా మహిళలు పదోన్నతులు
పొంది కల్నల్ స్థాయికి ఎదిగారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



భారత ఆర్మీలో చరిత్రాత్మక ముందడుగు పడింది. సియాచిన్ సహా వివిధ కమాండ్ యూనిట్లను మహిళలు కూడా ముందుండి నడిపించనున్నారు. ఇన్నాళ్లూ పురుషులకు మాత్రమే పరిమితమైన ఈ బాధ్యతల్ని మొట్టమొదటి సారిగా మహిళలు కూడా నిర్వర్తించనున్నారు. రెజిమెంట్లు, బెటాలియన్లకు అధికార పదవుల్లో మహిళల నియామకానికి సంబంధించిన ఎంపిక ప్రక్రియ ఈ నెల 9 నుంచి 22 వరకు జరిగింది. దాదాపుగా 108 మంది మహిళా అధికారులు కల్నల్‌గా పదోన్నతులు పొందారు. 1992 నుంచి 2006 బ్యాచ్‌కు చెందిన మహిళా అధికారులకు పదోన్నతులు ఇవ్వడానికి ప్రత్యేక కమిటీ ఎంపిక ప్రక్రియ పూర్తి చేసింది. వీరంతా ఇంజనీర్స్, సిగ్నల్స్, ఆర్మీ ఎయిర్ డిఫెన్స్, ఇంటెలిజెన్స్ కోర్, ఆర్మీ సర్వీస్ కోర్, ఆర్మీ ఆర్డన్స్ కోర్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీర్స్ వంటి విభాగాలకు అధికారులుగా సేవలందిస్తారు. భారత సాయుధ బలగాల్లో 1992 నుంచి మహిళా అధికారులు ఉన్నారు. అయితే వారంతా షార్ట్ సర్వీసు కమిషన్ (ఎస్ఎస్‌సీ) అధికారులుగానే ఇన్నేళ్లుగా కొనసాగుతున్నారు. ఇంజనీర్లు, న్యాయవాదులు, వంటి అడ్మినిస్ట్రేటివ్ పాత్రలే పోషిస్తున్నారు. యుద్ధ క్షేత్రాల్లో గాయపడ్డ జవాన్లకి చికిత్స అందించే వైద్యులు, నర్సులుగా కూడా ఉన్నారు. 16–18 ఏళ్ల సర్వీసు ఉంటేనే కమాండర్ పదవికి అర్హత సాధిస్తారు. ఇప్పుడు కోర్ ఆఫ్ ఆర్టిలరీ, కంబాట్ సపోర్ట్ ఆర్మ్‌లలో మహిళా అధికారుల్ని నియమించనున్నారు. భారత వాయుసేన, నావికాదళంలో అన్ని విభాగాల్లో మహిళా అధికారులు ఉన్నారు. వారికి శాశ్వత కమిషన్లు కూడా ఉన్నాయి. యుద్ధ విమానాలను, యుద్ధ నౌకల్ని నడిపించే మహిళలూ ఉన్నారు. త్రివిధ బలగాల్లో అతి పెద్దదైన పదాతి దళంలో మాత్రమే మహిళల పట్ల ఇన్నాళ్లూ వివక్ష కొనసాగుతూ వచ్చింది.



ఎందుకీ వివక్ష

పురుషులతో పోలిస్తే మహిళల శారీరక దారుఢ్యంపై నున్న సందేహాలే ఇన్నాళ్లూ వారికి అవకాశాల్ని దూరం చేశాయి. మాతృత్వం, పిల్లల పోషణ, ప్రసూతి సెలవులు వంటివి మహిళలకు తప్పనిసరిగా ఇవ్వాలని, యుద్ధం ముంచుకొచ్చే నేపథ్యాల్లో అది సాధ్యం కాదనే వాదన వినిపించింది. కానీ ఇప్పుడిప్పుడే పరిస్థితుల్లో మార్పు వస్తోంది. మహిళలకు ఎక్కడైనా పని చేసే అవకాశం ఇవ్వాలని డిమాండ్లు వినిపించాయి. భారత వాయుసేన, నావికాదళంతో పోలిస్తే ఆర్మీలో వివక్ష ఎక్కువగా ఉంది. యుద్ధభూమిలో నేరుగా మహిళలుంటే శత్రు దేశానికి చిక్కితే పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు వస్తున్నాయి. దీంతో ఇప్పటికీ పోరాట క్షేత్రాల్లో మహిళా కమాండర్లను నియమించడానికి భారత సైన్యం ఇంకా సిద్ధంగా లేదు.

సుప్రీం తీర్పుతో నెరవేరిన కల

భారత సైన్యంలో పనిచేస్తున్న మహిళా అధికారులకు శాశ్వత కమిషన్, కమాండింగ్ పదవులు ఇవ్వాల్సిందేనని 2020 ఫిబ్రవరిలో సుప్రీం కోర్టు చరిత్రాత్మక తీర్పు చెప్పింది. వారు ఎన్ని సంవత్సరాలుగా సర్వీసులో ఉన్నారనే విషయంతో సంబంధం లేకుండా అందరికీ శాశ్వత కమిషన్ వర్తింపచేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పుతో ఆర్మీలో మహిళలు పురోగతి సాధించడానికి, నాయకత్వ సామర్థ్యాలను ప్రదర్శించడానికి, పదోన్నతులకు మార్గం సుగమమైంది.

యూనిట్‌ను కమాండ్ చేయడమంటే..?

పదాతి దళంలో క్షేత్ర స్థాయిలో సైనికులందరికీ నేరుగా ఆదేశాలు ఇస్తూ వారిని ముందుకు నడిపించే కీలక బాధ్యత. ఇప్పటివరకు పురుషులు మాత్రమే నిర్వహించిన ఈ బాధ్యతల్ని మహిళలు కూడా అందుకున్నారు. సైన్యంలో కల్నల్ పదవి మహిళకి లభిస్తే ఆమె కనుసన్నల్లోనే సైన్యం నడుస్తుంది. బ్రిగేడర్, మేజర్ జనరల్, లెఫ్టినెంట్ జనరల్ వంటి ఉన్నతాధికారులు నేరుగా సైనికులతో సంబంధాలను కొనసాగించరు. ఇలాంటి పదవుల్లోనే ఎన్నో సవాళ్లను మహిళలు ఎదర్కోవాల్సి ఉంటుంది. అప్పుడే మహిళల్లో నాయకత్వ సామర్థ్యం బయట ప్రపంచానికి తెలుస్తుంది.




''సియాచిన్‌లో మొట్టమొదటి మహిళా అధికారిగా శివ చౌహాన్‌ను నియామకం మాలో కొత్త ఉత్సాహాన్ని పెంచింది. స్త్రీ, పురుషులన్న భేదం లేకుండా ప్రతీ ఒక్కరికీ వారికి మాత్రమే సొంతమయ్యే సామర్థ్యాలుంటాయి. ఆర్మీలో మహిళలకు మంచి భవిష్యత్ ఉంది. శారీరక దారుఢ్యం ఉన్నవారు కూడా ఇన్నాళ్లూ వివక్ష కారణంగా పదవులకి దూరమయ్యారు. ఇక ఆ రోజులు పోయాయి''

- దీక్షా ధామిన్, ఆర్మీకి శిక్షణ పొందుతున్న యువతి

''ఆర్మీలోకి రావాలనుకునే మహిళల సంఖ్య ఇంకా పెరుగుతుంది. పోరాట క్షేత్రాలకు సంబంధించిన విభాగాల్లో కూడా మహిళా అధికారులు రావాలి. ఎందుకంటే మహిళలు ఎంతో చురుగ్గా, త్వరితగతిన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యంతో ఉంటారు''

- దీప్‌నూర్ సహోతా, ఆర్మీకి శిక్షణ పొందుతున్న యువతి



బైడెన్ ఇంట్లో ఎఫ్‌బీఐ సోదాలు

ఆరు రహస్య ఫైళ్లు స్వాధీనం

వాషింగ్టన్: రహస్య ఫైళ్ల వ్యవహారం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు చుట్టుకుంటోంది. వచ్చే ఏడాది జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ ఫైళ్లు బయటపడడం ఆయనకు ప్రతికూలంగా మారే అవకాశం కనిపిస్తోంది. ఆయన నివాసంలో తాజాగా చేపట్టిన సోదాల్లో మరో ఆరు ఫైళ్లు లభ్యం కావడం కలకలం రేపుతోంది. విల్మింగ్టన్‌లోని బైడెన్ ప్రైవేట్ నివాసంలో ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(ఎఫ్‌బీఐ) అధికారులు శుక్రవారం ఉదయం నుంచి రాత్రి దాకా ఏకంగా 13 గంటలపాటు సోదాలు చేపట్టారు. మొత్తం ఆరు ఫైళ్లు లభ్యమయ్యాయి. ఎఫ్‌బీఐ అధికారులు వీటిని ఉన్నతాధికారులకు నివేదించారు. సోదాల సమయంలో ఇరుపక్షాలకు చెందిన న్యాయ బృందాలతోపాటు శ్వేతసౌధం అధికారి ఒకరు ఉన్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. సోదాలు జరుపుతున్న సమయంలో బైడెన్ గానీ, ఆయన భార్య గానీ ఇంట్లో లేరని తెలిసింది. సోదాల్లో ఫైళ్లతో పాటు చేతి రాతతో ఉన్న కొన్ని పత్రాలు కూడా లభించినట్లు సమాచారం. ఆరు ఫైళ్లు లభ్యం కాగా, ఇందులో కొన్ని బైడెన్ సెనేటర్‌గా ఉన్నప్పటివి, మరికొన్ని ఉపాధ్యక్షుడిగా పనిచేసిన కాలానికి సంబంధించినవని ఆయన వ్యక్తిగత అటార్నీ బాబ్ బోయర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

నాకు ఎలాంటి విచారం లేదు: బైడెన్

గత ఏడాది నవంబర్ 2న వాషింగ్టన్ డీసీలో బైడెన్‌కు చెందిన పెన్ బైడెన్ సెంటర్‌లో, డిసెంబర్ 20న వాషింగ్టన్ ఇంట్లోని గ్యారేజీలో, ఈ ఏడాది జనవరి 12న అదే ఇంట్లో మరోసారి రహస్య దస్త్రాలు బయటపడడంతో వివాదం మొదలైంది. ఆ తర్వాత ఆయన వాటిని నేషనల్ ఆర్కైవ్స్ అందజేశారు. నిజానికి పదవీ కాలం ముగిసిన తర్వాత అధికారిక రహస్య పత్రాలను కలిగి ఉండటం చట్టవిరుద్ధం. ఇలాంటి చర్యలను అమెరికా ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుంది. అధ్యక్షుడిని అభిశంసించినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. ప్రెసిడెన్షియల్ రికార్డ్స్ చట్టం ప్రకారం.. పదవీ కాలం ముగిసిన తర్వాత అధికారిక పత్రాలను నేషనల్ ఆర్కైవ్స్‌కు పంపించాలి. ఇదిలా ఉండగా, తన నివాసాల్లో జరుగుతున్న సోదాలపై బైడెన్ స్పందించారు. ఫైళ్లు దొరకడంపై తనకు ఎలాంటి విచారం లేదన్నారు. అయితే, బైడెన్ తీరుపై రిపబ్లికన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహస్య పత్రాల విషయంలో బైడెన్ ఇక తప్పించుకోలేరని చెబుతున్నారు. ఆయన కుటుంబంతోపాటు కుమారుడు హంటర్ బైడెన్ అక్రమ వ్యాపారాలపై సమగ్ర దర్యాప్తుకు డిమాండ్ చేస్తున్నారు. బైడెన్ నివాసాల్లో రహస్య పత్రాలు బయటపడడంపై కాంగ్రెస్ విచారణ చేపడుతుందని స్పీకర్ కెవిన్ మెక్‌కార్తీ ఆశాభావం వెలిబుచ్చారు.

బైడెన్‌కు సన్‌స్ట్రోక్




బైడెన్ ఇంటి ఆవరణలో కారు వెనకాల పడున్న రహస్య పత్రాల బాక్సు (సర్కిల్లో)

అమెరికా ఉపాధ్యక్షుడిగా ఉన్న సమయంలో జో బైడెన్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తండ్రి అధికారమే అండగా ఆయన కుమారుడు హంటర్ బైడెన్ చెలరేగిపోయాడన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అమెరికాకు ప్రత్యర్థి దేశాలుగా భావించే చైనా, రష్యాలో హంటర్ బైడెన్‌కు వ్యాపారాలున్నాయి. ఆయా దేశాల్లో పలు కంపెనీల్లో ఆయన పెట్టుబడులు పెట్టి, భారీగా ఆర్జించినట్లు సమాచారం. అంతేకాకుండా రష్యా నుంచి హంటర్ లక్షలాది డాలర్లు ముడుపులుగా స్వీకరించాడని సాక్షాత్తూ మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించిన సంగతి తెలిసిందే. మరోవైపు హంటర్ బైడెన్‌కు చెందినవిగా భావిస్తున్న ల్యాప్‌టాప్‌ల్లో ఆయన మత్తు మందులు వాడుతున్న ఫొటోలు, ఇతర వీడియోలు, మెయిళ్లు బయటపడడం సంచలనం సృష్టించింది. 2019 డిసెంబర్‌లో ఎఫ్‌బీఐ ఆ ల్యాప్‌ట్యాప్‌లను స్వాధీనం చేసుకుంది. అందులోని వివరాలను న్యూయార్క్ పోస్టు పత్రిక ప్రచురించింది.

అమెరికాలో కాల్పులు..10 మంది మృతి

- మరో 10 మందికి గాయాలు
- చైనా న్యూ ఇయర్ వేడుకల్లో విషాదం



మాంటెరీ పార్క్: అమెరికాలోని లాస్ ఏంజెలెస్ నగరంలో భారీ కాల్పుల ఘటన చోటుచేసుకుంది. లూనార్ నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న వారిపై దుండగుడు జరిపిన కాల్పుల్లో 10 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆసియా సంతతి వారు, ముఖ్యంగా చైనీయులు అత్యధికంగా నివసించే మాంటెరీ పార్క్‌లోని గార్వే అవెన్యూలోని ఓ డ్యాన్స్ క్లబ్‌లో శనివారం రాత్రి 10.22 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ వ్యక్తి తుపాకీతో క్లబ్‌లో ఉన్న వారిపై విచక్షణారహితంగా కాల్పులు దిగినట్లు ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు. 10 మంది అక్కడికక్కడే చనిపోయారు. క్షతగాత్రులైన 10 మందిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. కాల్పులకు పాల్పడిన వ్యక్తి ఎవరు? డ్యాన్స్ క్లబ్‌లోని వారితో దుండగుడికి పరిచయం ఉందా? అతడు వాడిన ఆయుధం వంటి వివరాలను పోలీసులు వెల్లడించలేదు. దుండగుడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టిన పోలీసులు, కాల్పుల ఘటన వివరాలను ఆలస్యంగా వెల్లడించడానికి కారణాలు తెలియాల్సి ఉంది. అక్కడికి సమీపంలోని అల్హాంబ్రాలో చోటుచేసుకున్న మరో కాల్పుల ఘటనతో ఏమైనా సంబంధం ఉందా అనే విషయమై దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు చెప్పారు. రెండు రోజులపాటు జరిగే లూనార్ న్యూ ఇయర్ వేడుకలు లాస్ ఏంజెలెస్‌లో శనివారం మొదలయ్యాయి. ఇక్కడి చిన్నాపెద్దా వ్యాపార సంస్థల పేర్లు ఇంగ్లిష్‌తోపాటు చైనీస్ మాండరిన్ భాషల్లో ఉంటాయి. చైనీస్ వేడుకలను ఇక్కడ జరుపుకుంటుంటారు. చైనీస్ సినిమాలను ఇక్కడి థియేటర్లలో ప్రదర్శిస్తుంటారు. ఈ నెలలో అమెరికాలో జరిగిన ఐదో అతిపెద్ద కాల్పుల ఘటన ఇదని అధికారులు తెలిపారు. కొలరాడో నైట్‌క్లబ్‌లో రెండు నెలల క్రితం జరిగిన కాల్పుల్లో ఐదుగురు చనిపోయారు. గత ఏడాది మే 22న టెక్సాస్‌లోని ఉవాల్డే స్కూల్‌లో జరిగిన కాల్పుల ఘటనలో 21 మంది చనిపోయిన విషయం తెలిసిందే.

శ్రద్ధా వాకర్ హత్య కేసు.. 3,000 పేజీల చార్జిషీట్



న్యూఢిల్లీ: దేశవ్యాప్త సంచలనం సృష్టించిన శ్రద్ధా వాకర్ హత్య కేసులో 3 వేల పేజీల భారీ ముసాయిదా చార్జిషీట్‌ను ఢిల్లీ పోలీసు అధికారులు, న్యాయ నిపుణులు తయారు చేశారు. ఇందులో 100 సాక్ష్యాలతో కూడిన ఫోరెన్సిక్, ఎలక్ట్రానిక్ ఆధారాలున్నాయి. దీని నుంచి తుది చార్జిషీట్‌ను రూపొందించే పనిలో నిమగ్నమై ఉన్నారు. దక్షిణ ఢిల్లీలోని మెహ్రౌలీలో ఉండే అఫ్తాబ్ పూనావాలా తన భాగస్వామి శ్రద్ధా వాకర్‌ను గత మేలో గొంతు పిసికి చంపి, మృతదేహాన్ని 35 ముక్కలుగా నరికి, ఢిల్లీలోని వేర్వేరు ప్రాంతాల్లో పడేసేందుకు ముందుగా వాటిని ఫ్రిజ్‌లో ఉంచిన విషయం తెలిసిందే. ఛతర్‌పూర్ అటవీ ప్రాంతంలో లభించిన ఎముకలు శ్రద్ధవేనని డీఎన్ఏ నివేదికల్లో తేలింది. ఇవే కీలక ఆధారాలు కానున్నాయి.

'సంప్రదాయ పోలీసింగ్' బలోపేతం

డీజీపీలు/ఐజీపీల సదస్సులో మోదీ పిలుపు



న్యూఢిల్లీ: పోలీసు దళాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. కొత్త టెక్నాలజీలో సుశిక్షితులు కావాలన్నారు. అదేసమయంలో సంప్రదాయ పోలీసింగ్ విధానాలను బలోపేతం చేసుకోవాలని చెప్పారు. ఆదివారం డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ పోలీస్/ఇన్‌స్పెక్టర్ జనరల్స్ ఆఫ్ పోలీస్ 57వ అఖిల భారత సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగించారు. రాష్ట్ర పోలీసులు, కేంద్ర భద్రతా సంస్థలు పరస్పరం సహకారం పెంపొందించుకోవాలని అన్నారు. ఉత్తమమైన విధానాలను పంచుకోవాలని తెలిపారు. వాడుకలోని లేని క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలని అభిప్రాయపడ్డారు. పోలీసు శాఖ ప్రమాణాలను మరింత పెంచాల్సి ఉందన్నారు. వివిధ దర్యాప్తు సంస్థల నడుమ డేటాను ఇచ్చిపుచ్చుకొనే విధానం బలపడాలని, ఇందుకోసం నేషనల్ డేటా గవర్నెన్స్ ఫ్రేమ్‌వర్క్‌ను ఏర్పాటు చేయడం చాలా ముఖ్యమని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఇక జైళ్ల సమర్థ నిర్వాహణకు సంస్కరణలు చేపట్టాలని తెలిపారు. నూతన సవాళ్లు, పరిష్కార మార్గాలపై చర్చించుకొనేందుకు పోలీసు ఉన్నతాధికారుల సదస్సులు రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో కూడా నిర్వహించుకోవాలని సూచించారు. డీజీపీలు/ఐజీపీల సదస్సుకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ హాజరయ్యారు. నేషనల్ సెక్యూరిటీ, కౌంటర్ టెర్రరిజం, సైబర్ సెక్యూరిటీ వంటి అంశాలపై సదస్సులో చర్చించారు. వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 600 మందికిపైగా అధికారులు పాల్గొన్నారు.

మన టీ, సమోసాకు బ్రిటన్‌లో యమా క్రేజ్..!



లండన్: సాయంత్రమయ్యేసరికి వేడి వేడి సమోసా తిని, పొగలు గక్కే టీ ఒక కప్పు లాగిస్తే ఎలాగుంటుంది. ఆ కాంబినేషన్ ఇచ్చే కిక్కు వేరుగా ఉంటుంది కదా. మన దేశానికి మాత్రమే ప్రత్యేకమైన ఈ చాయ్, సమోసా కాంబినేషన్‌కి ఇప్పుడు బ్రిటన్ యువతరంలో యమా క్రేజ్ పెరుగుతోంది. సాధారణంగా తెల్లవారు టీతో పాటు బిస్కెట్లు తింటారు. ఇప్పుడు వారి జిహ్వలు కొత్త రుచులు కోరుకుంటున్నాయని యునైటెడ్ కింగ్‌డమ్ టీ అండ్ ఇన్‌ఫ్యూజన్స్ అసోసియేషన్ నిర్వహించిన తాజా అధ్యయనంలో వెల్లడైంది. వెయ్యి మందితో ఈ సర్వేని నిర్వహిస్తే సాయంత్రం స్నాక్‌గా గ్రానోలా బార్స్ (ఓట్స్‌తో చేసేది) చాలా బాగుంటుందని మొదటి స్థానం ఇచ్చారు. ఇక రెండోస్థానాన్ని మన సమోసా కొట్టేసింది. సర్వేలో పాల్గొన్న యువతరంలో 8 శాతం మంది సమోసాకి మొగ్గు చూపించారు.



బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వ న్యాయ సంస్కరణల యత్నాలను నిరసిస్తూ ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్‌లో జరిగిన ఆందోళన. ఇందులో లక్ష మందికి పైగా పాల్గొన్నారు

భద్రత మధ్య జోడో యాత్ర

సాంబా (జమ్మూకశ్మీర్): జమ్ములో జంటపేలుళ్ల నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పాదయాత్రకి అత్యంత కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. ఆదివారం ఉదయం కథువా నుంచి ప్రారంభమైన భారత్ జోడో యాత్ర మధ్యాహ్నానికి సాంబా జిల్లాలోని చక్ నానక్‌కు చేరుకుంది. షెడ్యూల్ ప్రకారమే రాహుల్ పాదయాత్ర అత్యంత ఉత్సాహభరితంగా సాగుతోంది.సోమవారం మధ్యాహ్నానికి రాహుల్ గాంధీ జమ్ము చేరుకుంటారని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ చెప్పారు. రాహుల్ యాత్రకు అద్భుతమైన స్పందన వస్తోందన్న ఆయన ఈ యాత్రతో బీజేపీ వెన్నులో వణుకు పుట్టిస్తోందని వ్యాఖ్యానించారు. అందుకే రాహుల్ ఇమేజ్‌ను డ్యామేజ్ చేయడానికి అసత్యాలు ప్రచారం చేస్తోందని ఆరోపించారు.



విద్వేషాలు సృష్టిస్తున్నారు: రాజ్‌నాథ్

రాహుల్ గాంధీ అధికారం కోసం ప్రజల్లో విద్వేషాలను సృష్టిస్తున్నారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు. రాహుల్ వల్ల అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్ట మసకబారుతోందని విమర్శించారు. ఆదివారం మధ్య ప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఒక కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. ప్రజాభిమానం, నమ్మకం పొందడం ద్వారానే అధికారం లభిస్తుందని ఆయన అన్నారు.

చైనాలో వారంలోనే 13 వేల మరణాలు

బీజింగ్: చైనాలో కోవిడ్–19 మహమ్మారి వ్యాప్తి కొనసాగుతూనే ఉంది. నిత్యం వేల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. గత వారం రోజుల్లో దేశవ్యాప్తంగా వివిధ ఆసుపత్రుల్లో ఏకంగా 13 వేల మంది కరోనా కాటుకు బలయ్యారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఈ విషయాన్ని చైనా సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్(సీడీసీ) ప్రకటించింది. కరోనా వల్ల ఆసుపత్రుల్లో కాకుండా ఇళ్లల్లో చనిపోయినవారి సంఖ్య ఎంత అన్నది బహిర్గతం చేయలేదు. దేశంలో ఇప్పటికే కరోనా ఆంక్షలను ఎత్తివేశారు. మరోవైపు నూతన సంవత్సర వేడుకలు ప్రారంభమయ్యాయి.

పెరూలో ఆందోళనలు హింసాత్మకం



లిమా/వాటికన్ సిటీ: దక్షిణ అమెరికా ఖండంలోని పెరూలో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు రోజురోజుకూ ఉధృతమవుతున్నాయి. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ జనం వీధుల్లోకి వస్తున్నారు. మారుమూల ప్రాంతాల నుంచి రాజధాని లిమాకు చేరుకుంటున్నారు. అధ్యక్షురాలు డినా బోలార్టే వెంటనే నుంచి దిగిపోవాలని డిమాండ్ చేస్తున్నారు. భద్రతా సిబ్బందితో ఘర్షణకు దిగుతున్నారు. డిసెంబర్ నుంచి ఇప్పటిదాకా ఘర్షణలో 55 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. తాజాగా శుక్రవారం రాత్రి దక్షిణ పూనోలో నిరసన ప్రదర్శన హింసాత్మకంగా మారింది. పోలీసులతో జరిగిన ఘర్షణలో ఒక నిరసనకారుడు మరణించాడు, 9 మంది గాయపడ్డారు. దేశంలో హింస ప్రజ్వరిల్లుతుండడంతో ప్రభుత్వ అప్రమత్తమైంది. పెరూలో 15వ శతాబ్దానికి చెందిన ప్రపంచ ప్రఖ్యాత కట్టడం, ప్రపంచ ఏడు వింతల్లో ఒకటైన మచ్చూపిచ్చూ సందర్శనను నిరవధికంగా నిలిపివేస్తున్నట్లు సాంస్కృతిక శాఖ ప్రకటించింది. మచ్చూపిచ్చూలో 417 మంది సందర్శకులు చిక్కుకుపోయారు. వారిలో 300 మందికిపైగా విదేశీయులున్నారు. పెరూలో హింసాకాండను వెంటనే ఆపాలని ప్రభుత్వానికి, ప్రజలకు పోప్ ఫ్రాన్సిస్ విజ్ఞప్తి చేశారు.

బ్రెజిల్ ఆర్మీ చీఫ్‌పై వేటు

బ్రసిలియా: జనవరి 8వ తేదీన బ్రెజిల్ పార్లమెంట్, అధ్యక్ష భవనం, సుప్రీంకోర్టుపై జరిగిన దాడుల నేపథ్యంలో బ్రెజిల్ ఆర్మీ చీఫ్ జనరల్ జులియో సీజర్ డి అర్రుడాపై వేటు పడింది. ఆయన స్థానంలో ఆగ్నేయ మిలటరీ కమాండ్ హెడ్ జనరల్ టామ్స్ మిగుయెల్ రిబిరో పయివా శనివారం నియమితులయ్యారు. మాజీ అధ్యక్షుడు బొల్సొనారో మద్దతుదారులుగా భావిస్తున్న వారు పాల్పడిన దాడికి సైనిక బలగాల్లో కొందరు అనుకూలంగా ఉన్నట్లు చేసిన వ్యాఖ్యలే జనరల్ జులియో కొంపముంచాయని భావిస్తున్నారు. అధ్యక్షుడు లులా డిసిల్వా ఈ పరిణామంపై ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు.

వృద్ధుడిని 8 కిలోమీటర్లు లాక్కెళ్లిన కారు

పట్నా: వాహనంతో ఢీకొట్టి, ఈడ్చుకెళ్లిన మరో ఘటన ఇది. వేగంగా వెళ్తున్న కారు వృద్ధుడిని ఢీకొట్టింది. బానెట్‌పై చిక్కుకుని, వేలాడుతున్న అతడు కారాపాలని ప్రాధేయ పడినప్పటికీ అందులోని వారు 8 కిలోమీటర్ల దూరం తీసుకెళ్లారు. అనంతరం బ్రేకులు వేయడంతో కిందపడిన వృద్ధుడిని కారుతో తొక్కుకుంటూ వెళ్లగా ప్రాణాలు కోల్పోయాడు. ఈ అమానుషం బిహార్ రాష్ట్రం తూర్పు చంపారన్ జిల్లా కొట్వాలోని 27వ నంబర్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. మృతుడిని బంగ్రా గ్రామానికి చెందిన శంకర్ చౌధురి(70)గా గుర్తించారు. శంకర్ చౌధురి సైకిల్‌పై రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో కారు ఢీకొట్టినట్లు ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు. బానెట్‌పై వేలాడుతున్న అతడు భయంతో కారు ఆపాలని కోరినప్పటికీ అందులోని వారు కనికరించలేదన్నారు. ఎనిమిది కిలోమీటర్ల దూరం వెళ్లాక స్థానికులు కేకలు వేయడంతో కారుకు బ్రేకులు వేశారు. కిందపడిన వృద్ధుడిని కారుతో తొక్కుకుంటూ వెళ్లారు. దీంతో, అతడు అక్కడికక్కడే చనిపోయాడు. అనంతరం కారును అక్కడే వదిలేసి డ్రైవర్, అందులోని వారంతా పరారయ్యారు.

సరిహద్దులో డ్రగ్స్ డ్రోన్ కూల్చివేత

చండీగఢ్: పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లో భారత్–పాకిస్తాన్ అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో మాదకద్రవ్యాల డ్రోన్‌ను కూల్చివేశారు. బీఎస్ఎఫ్ సిబ్బంది, పంజాబ్ పోలీసులు ఉమ్మడిగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. కక్కార్ గ్రామంలో 6 రెక్కలున్న డ్రోన్ ఎగురుతున్నట్లుగా గుర్తించామని, వెంటనే ఏకే–47 నుంచి 12 రౌండ్ల కాల్పులు జరిపి కూల్చివేశామని, ఇందులో 5 కిలోల హెరాయిన్ లభ్యమైందని అధికారులు ఆదివారం వెల్లడించారు. అంతర్జాతీయ సరిహద్దుకు కేవలం 2 కిలోమీటర్ల దూరంలో ఈ సంఘటన జరిగిందన్నారు. డ్రోన్‌కు సంబంధించి ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.



రాజన్నకు మొక్కులు

వేములవాడ: రాజన్నను ఆదివారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు కోడెమొక్కులు, కుంకుమపూజలు చేశారు.



శరణు శరణు మల్లన్న

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లన్న సన్నిధిలో ఆదివారం రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0/18.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

న్యాయవాదులకు క్రీడలు అభినందనీయం



బ్యాటింగ్ చేస్తున్న జడ్జి ఇ.వి.వేణుగోపాల్

కొత్తపల్లి(కరీంనగర్): మానసిక ఒత్తిడి తగ్గించేందుకు న్యాయవాదులకు క్రీడలు నిర్వహించడం అభినందనీయమని హైకోర్టు న్యాయమూర్తి ఇ.వి.వేణుగోపాల్ అన్నారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న న్యాయవాదుల క్రీడాంశాల్లో భాగంగా ఆదివారం రేకుర్తిలోని లయోల మైదానంలో జరిగిన క్రికెట్ పోటీల ఫైనల్ మ్యాచ్‌ను జిల్లా అదనపు సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్‌తో కలిసి ప్రారంభించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రం రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు, ఉపాధ్యక్షుడు ఆరెల్లి రాములు, కార్యదర్శి శ్రీధర్‌రావు, మాజీ అధ్యక్షుడు రఘునందన్ రావు పాల్గొన్నారు. అనంతరం 'శ్రీకరం ఫౌండేషన్' ఆధ్వర్యంలో రూపొందించిన బాలిక సంరక్షణ అవగాహన పోస్టర్‌ను హైకోర్టు న్యాయమూర్తి ఇ.వి.వేణుగోపాల్ ఆయన నివాసంలో ఆవిష్కరించారు. అంతకుముందు కొండగట్టు ఆంజనేయ స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

'విద్యాశాఖ డైరెక్టర్ క్షమాపణ చెప్పాలి'



కరీంనగర్: ఉపాధ్యాయ దంపతులు వేర్వేరు చోట్ల పనిచేస్తూ వారి వేదనను విద్యాశాఖ డైరెక్టర్‌కు చెప్పుకుందామని వెళ్తే టీచర్లా.. రౌడీలా అని వ్యాఖ్యలు చేసిన పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ శ్రీ దేవసేన వెంటనే క్షమాపణ చెప్పాలని ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జె.వెంకటరావు డిమాండ్ చేశారు. ఆదివారం సంఘ కార్యాలయంలో మాట్లాడుతూ.. స్పౌజ్ కేటగిరీలో ఉపాధ్యాయులు ఒకేచోట ఉండేలా చర్యలు తీసుకోవాలని గతంలో సీఎం కేసీఆర్ కూడా హామీ ఇవ్వగా అమలు కాలేదన్నారు. ఉపాధ్యాయులు చలో డైరెక్టర్ నినాదంతో హైదరాబాద్ వెళ్తే 'టీచర్లా.. రౌడీలా లేకపోతే సీఎల్ పెట్టి వచ్చారా లేదా'అని వ్యాఖ్యానించిన విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ధర్మాజీ చాందిని, బి.రాజేశ్‌నాయక్, ఆడేళ్ల, పోతన్న రవీందర్ నాయక్, భిక్షపతి పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయి



విద్యానగర్(కరీంనగర్): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఉమ్మడి కరీంనగర్ జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వై.వెంకటేశ్వర్లు అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ డివిజన్ తపాల ఉద్యోగుల ఆటలపోటీలు ఆదివారంతో ముగిశాయి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ప్రశాంతతకు దోహదం చేస్తాయని అన్నారు. క్రీడల ప్రేరణతో నిత్యం ఒక వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో విజేతలకు గణతంత్ర దినోత్సవం రోజున బహుమతులు అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఏఎస్పీ కిరణ్‌రెడ్డి, ఐపీవోలు శ్రీనాథ్‌రెడ్డి, చంద్రమోహన్, రాజు, శ్రవణ్, దయానంద్, పోస్టు మాస్టర్లు ఫజులుర్ రహమాన్, రవీందర్, తదితరులు ఉన్నారు.

గ్రూప్-2 శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు

కరీంనగర్: రాష్ట్ర వెనుకబడిన తరగతుల ఉద్యోగ నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రం, బీసీ స్టడీ సర్కిల్ కరీంనగర్ ఆధ్వర్యంలో గ్రూపు-2 ఉచిత శిక్షణ దరఖాస్తు గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎం.రవికుమార్ ఆదివారం ఒక ప్రకటలో తెలిపారు. కరీంనగర్,జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అభ్యర్థులు బీసీ స్టడీ సర్కిల్ వెబ్ సైట్ ద్వారా ఈ నెల 25 సాయంత్రం 5 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇదివరకే దరఖాస్తు చేసుకున్నవారికి ఎడిట్ చేసుకోవడానికి అవకాశం కల్పించామని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.1000 స్కాలర్‌షిప్, ఉచిత శిక్షణ మెటీరియల్ ఇవ్వబడుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయ ఫోన్ నంబరు 0878–2268686లో సంప్రదించాలని కోరారు.





బ్రహ్మోత్సవ శోభ

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ మార్కెట్‌రోడ్డు వేంకటేశ్వరస్వామి షష్ఠమ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నుంచి అధ్యయనోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని మామిడితోరణాలు, పూలు, అరటి ఆకులు, విద్యుత్‌దీపాలతో సుందరంగా అలకరించారు. నగర కూడళ్లు, ఆలయ మాడవీధుల్లో స్వాగత తోరణాలు విద్యుత్ దీపాలతో, దేవతామూర్తుల కటౌట్లతో జిగేలుమంటున్నాయి. కాగా.. బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆదివారం మంత్రి గంగుల కమలాకర్ తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈవో వెంకన్న, ఆలయ ధర్మకర్తలు చకిలం గంగాధర్, శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు గంప రమేశ్, నందెల్లి మహిపాల్, తదితరులు ఉన్నారు.

- కోటి ఆశలతో కొలువులు సాధిస్తున్న విద్యార్థులు
- ఉద్యోగంలో చేరిన తర్వాత డబ్బు చెల్లించాలని డిమాండ్
- తూతూ మంత్రంగా నిర్వహిస్తున్న జిల్లాలోని కళాశాలలు
- చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల డిమాండ్



అంతా.. బోగస్!

ప్రాంగణ నియామకాల్లో అక్రమ వసూళ్లు

కరీంనగర్‌లోని ఓ డిగ్రీ కళాశాలలో ప్రాంగణ నియామకాలు చేపట్టగా.. విద్యార్థిని ఎంపికైంది. ఉద్యోగంలో చేరేందుకు సంబంధిత కార్యాలయానికి వెళ్లింది. అక్కడి నిర్వాహకులు సంవత్సరం పాటు జీతం ఎంత ఉంటుందో అంత డబ్బులు ముందస్తుగా డిపాజిట్ చేయాలని అన్నారు. అప్పుచేసి డిపాజిట్ చేసిన ఆరునెలలకే ఏవోసాకులు చెప్పి ఉద్యోగం నుంచి తొలగించారు. డబ్బులు వెనక్కి కూడా ఇవ్వలేదు. సదరు విద్యార్థిని కళాశాలకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదు.

తిమ్మాపూర్ మండలంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో పలువురు విద్యార్థులకు ఉద్యోగం వచ్చింది. జాయినింగ్‌కు వెళ్తే సెక్యూరిటీ డిపాజిట్‌గా కొంత డబ్బు చెల్లించాలని డిమాండ్ చేశారు. కళాశాల యాజమన్యం కూడా ఒక నెల జీతం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు పలువురు విద్యార్థులు తెలిపారు.

శాతవాహనయూనివర్సిటీ(కరీంనగర్): చదువు పూర్తయ్యేలోపు కొలువు సాధించాలని నేటి యువత లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. ఇందుకోసం పేరున్న కళాశాలలో సీటు సాధించి, రూ.లక్షల్లో ఫీజు చెల్లిస్తున్నారు. కష్టపడి చదివి క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో కొలువు కొట్టేలా సన్నద్ధం అవుతున్నారు. ఒక్కో ఉద్యోగానికి 5వేల మంది పోటీ పడుతున్న నేటితరుణంలో అత్యుత్తమ ప్రతిభతో ప్రాంగణ నియామకాల్లో ఎంపికైతే ఆ ఉద్యోగం మూన్నాళ్ల ముచ్చటే అవుతోంది. క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఎంపిక అయిన విద్యార్థులను మొదట ఎలాంటి షరతులు లేవని తీసుకుంటూ.. ఉద్యోగాల్లో చేరేసరికి ఆరునెలల నుంచి ఏడాది వరకు జీతాలు ముందే కంపెనీల్లో డిపాజిట్ చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. చదువుకున్న కళాశాలలు సైతం రెండు నుంచి మూడు నెలల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం.

డబ్బు తీసుకుంటూ.. కొలువు తీసేస్తూ..

- కరీంనగర్‌లోని డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలకు వస్తున్న చాలా వరకు కంపెనీలు బోగస్‌వేనని విద్యార్థులు చెబుతున్నారు. ఎంపిక ప్రక్రియలో జీతాలు ఖచ్చితంగా ఇస్తామంటూ చెబుతూ, ఉద్యోగంలో చేరాక సెక్యూరిటీ డిపాజిట్ కింద డబ్బులు కట్టించుకుంటున్నారని అంటున్నారు.
- మరికొన్ని ప్రయివేటు కంపెనీలు డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యంతో ఏటా కొంత ప్యాకేజీ మాట్లాడుకుంటూ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించి విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసి ఉద్యోగాలు ఇస్తున్నారు.
- కంపెనీల్లో చేరిన కొద్దిరోజులకే కొలువు నుంచి తొలగిస్తుండగా.. ప్రతిభ ఉన్నా ఏదో సాకుతో కంపెనీ నుంచి సాగనంపుతున్నారని పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు.
- కంపెనీలు సైతం ప్రతిభ ఉన్నవారిని కాకుండా డబ్బులకు ఆశపడి బ్యాక్‌డోర్ నుంచి వస్తున్న వారిని ప్రొత్సహించడంతో ఇలాంటి తప్పులు జరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు.
- కరీంనగర్‌కు చెందిన కొన్ని కళాశాలల్లో ప్రయివేటు కంపెనీలకు డబ్బులు చెల్లిస్తూ ప్లేస్‌మెంట్లు నిర్వహించి తూతూ మంత్రంగా కొంతమందికి ఆఫర్ లెటర్లు అందిస్తున్నట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

జిల్లాలో కళాశాలలు, విద్యార్థులు

ఇంజినీంగ్ కాలేజీలు	14
విద్యార్థులు	13వేలు
డిగ్రీకాలేజీలు	104
విద్యార్థులు	72వేలు
ప్రాంగణ నియామకాల్లో ఎంపికైనవారు	
ఇంజినీరింగ్ విద్యార్థులు	3,800
డిగ్రీ విద్యార్థులు	8,200

అనుమతి రద్దు చేయాలి



ప్రయివేటు కళాశాలల్లో జరుగుతున్న ప్లేస్‌మెంట్లలో కంపెనీలు ఏదోఒక సాకు చెబుతూ డబ్బులు కట్టించుకుంటున్నాయి. డబ్బు చెల్లించనివారిని తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలి.

– జూపాక శ్రీనివాస్, పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు

ఎస్సారార్‌లోని అమృతవర్షిణికి శ్రీభాష్యం పేరు



విజయసారథి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మంత్రి కమలాకర్, వినోద్‌కుమార్, సునీల్‌రావు

- కాపువాడ నుంచి బొమ్మకల్ వరకు శ్రీభాష్యం విజయసారథి మార్గ్
- తెలంగాణ ముద్దుబిడ్డ శ్రీభాష్యంకు సముచిత గౌరవం కల్పిస్తాం
- సంస్మరణ సభలో మంత్రి కమలాకర్, ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

కరీంనగర్‌కల్చరల్: ఎస్సారార్ కళాశాలలో రూ.15కోట్ల వ్యయంతో నిర్మించే ఆడిటోరియానికి అంతకుముందు నిర్ణయించిన అమృతవర్షిణి స్థానంలో పద్మశ్రీ శ్రీభాష్యం విజయసారథి పేరును పెడతామని, అదే ఆవరణలో ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తామని రాష్ట్ర బీసీసంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. సర్వవైదిక సంస్థానం ట్రస్టు ఆధ్వర్యంలో యజ్ఞవరాహక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన శ్రీభాష్యం విజయసారథి సంస్మరణ సభకు మంత్రి కమలాకర్, ప్రణాళికసంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరు అయ్యారు. కాపువాడ నుంచి బొమ్మకల్ వరకు శ్రీభాష్యం విజయసారథి మార్గ్‌గా నామకరణం చేస్తామని హామీ ఇచ్చారు. శ్రీభాష్యం మరణం సాహితీలోకానికి తీరని లోటని అన్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. దేశం గర్వించదగ్గ పండితుడు, తెలంగాణ ముద్దుబిడ్డ శ్రీభాష్యంకు పద్మశ్రీ దక్కడం గర్వకారణమని, అయితే రాష్ట్ర ప్రభుత్వం తరఫున సముచిత గౌరవం కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సంస్కృత భాష వాడుక భాషగా లేదని, సంస్కృతం కొందరికే పరితమితం కావడం మన దురదృష్టంగా అభివర్ణించారు. రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు శ్రీభాష్యంతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సభలో మేయర్ సునీల్‌రావు, గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, డిప్యూటీ మేయర్ చల్లాస్వరూపరాణి, సుడా చైర్మన్ జీవీ. రామకృష్ణారావు, టీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ ఎమ్మెల్యే వుచ్చిడి మోహన్‌రెడ్డి, బొమ్మకల్ సర్పంచ్ పురమల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో 50శాతం నిధులు కేటాయించాలి

- బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్



చొప్పదండిలో బాలుడితో ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్

చొప్పదండి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాబోయే బడ్జెట్‌లో బీసీలకు 50శాతం నిధులు కేటాయించాలని, బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా ఆదివారం చొప్పదండి మండలంలో పర్యటించారు. ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన బీసీల రిజర్వేషన్లు పెంచాలన్నారు. బండి సంజయ్ కేంద్రంలో కొట్లాడి బీసీ రిజర్వేషన్ల పెంపు మాట్లాడిన తర్వాతనే ఓట్ల కోసం రావాలని అన్నారు. జీవో 317తో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుండానే ఓట్ల కోసం హాతాత్తుగా టీచర్ల బదిలీలు చేపడుతున్నారని ఆరోపించారు. రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు రావడానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వ కృషి ఉన్నదన్న ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలను ఖండించారు. రామప్ప అభివృద్ధికి ఎన్నికోట్లు విడుదల చేసారో చెప్పాలన్నారు. దళితబంధు కోసం కేటాయించిన నిధులు విడుదల చేయకుండా, తిరిగి బడ్జెట్‌లో నిధులు కేటాయించడమేమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నల్లాల రాజేందర్, నియోజకవర్గ ఇన్‌చార్జి కొంకటి శేఖర్, మంద రవీందర్, మహాంకాళి తిరుపతి, స్వరూన, అనూష, స్వప్న , తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏఈఈ పరీక్షలు


తిమ్మాపూర్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరీక్షలు ఆదివారం కరీంనగర్ జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా ముగిశాయి. పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ తనిఖీ చేశారు. కరీంనగర్, తిమ్మాపూర్ మండలంలోని వాగేశ్వరి, శ్రీ చైతన్య, జ్యోతిష్మతి, వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 16 కేంద్రాలు ఏర్పాటు చేశారు. సుమారు 85శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. హుజూరాబాద్ ఆర్డీవో హరిసింగ్, తహసీల్దార్లు కనకయ్య, రాజయ్య, లక్ష్మారెడ్డి, లక్ష్మీనరసింహారావు, శ్రీనివాస్ పరీక్ష కేంద్రాలకు ఇన్‌చార్జీలుగా వ్యవహరించారు. ఎస్సై ప్రమోద్‌రెడ్డి ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడకుండా పర్యవేక్షించారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న గరిమా అగర్వాల్



ఏ.అంజయ్య, రాంనగర్



అంజయ్యకు వచ్చిన బిల్లు

ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి కరీంనగర్‌లోని రాంనగర్‌కు చెందిన ఏ.అంజయ్య. ఇతడి ఇంటికి ఈనెల రూ.530 కరెంటు బిల్లు వచ్చింది. అయితే.. రూ.2,262 ఏసీడీ చార్జీలు అదనంగా వేశారు. ఈ చార్జీలపై సరైన అవగాహన లేక ఆందోళనకు గురవుతున్నాడు అంజయ్య. విద్యుత్ వినియోగదారులపై ఈ అదనపు భారం ఏంటన్ని ప్రశ్నిస్తున్నాడు.

ఏసీడీ వాత.. బిల్లుల మోత

- అడ్డగోలు విద్యుత్ బిల్లులతో వినియోగదారుల గగ్గోలు
- ఇప్పటికే పలుసేవల కింద అదనపు బాదుడు
- తప్పదంటున్న విద్యుత్‌శాఖ.. ససేమిరా అంటున్న వినియోగదారులు
- వచ్చేనెల 6న జరిగే ఈఆర్సీలో నిలదీసేందుకు సమాయత్తం

కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ వినియోగదారులకు ఏసీడీ (అడిషనల్ కంజంప్షన్ డిపాజిట్) షాక్ తగులుతోంది. ఇప్పటికే పలుసేవల కింద అదనపు వసూళ్లు చేపడుతున్న ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ తాజాగా ఏసీడీచార్జీలు విధిస్తూ మోయలేనిభారాన్ని మూటగడుతోంది. దీంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది విద్యుత్ చార్జీలు పెంపుదలతో హైరానా పడ్డ వినియోగదారులకు డెవలప్‌మెంట్ చార్జీలతో షాక్ తగిలింది. అయినప్పటికీ సర్దుకుపోగా.. ప్రస్తుత ఏసీడీ చార్జీలతో భగ్గుమంటున్నారు. వినియోగదారులకు అండగా నిలిచేందుకు పలు పార్టీలు ఆందోళన బాటపట్టాయి. ఇప్పటి వరకు 300 యూనిట్లు ఆపై విద్యుత్ వినియోగించిన వారికి మాత్రమే వసూలు చేసే ఈ చార్జీలను ఈ నెల నుంచి 300లోపు యూనిట్లు కాల్చేవారిపై సైతం మోపుతుండటంతో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఈ చార్జీలు అధిక మొత్తంలో పట్టణ ప్రజలపై పడుతుంటడం ఆందోళన కల్గిస్తోంది.

సామాన్యులకు షాక్

విద్యుత్ సంస్థ విధించే ఏసీడీ చార్జీలతో సామాన్యులకు షాక్ తప్పడం లేదు. కరీంనగర్ సర్కిల్ పరిధిలో 2.65 లక్షల సర్వీసుల నుంచి రూ.19.10 కోట్ల వసూలుకు రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే జనవరి బిల్లులు ఏసీడీ చార్జీలు కలుపుతూ జారీ అవుతున్నాయి. దీంతో వినియోగదారులకు ఏం చేయాలో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. డిపాజిట్ పేరిట వసూలుచేయడం సరికాదన్న వాదనలు విన్పిస్తున్నాయి. ఈ చార్జీలపై అధికారులను నిలదీసేందుకు సైతం సిద్ధమవుతున్నట్లు తెలిసింది. కరీంనగర్‌లో ఫిబ్రవరి 6వ తేదీన నిర్వహించే ఈఆర్సీ సమావేశంలో ఈ అంశాన్ని గట్టిగా ఎదుర్కొనేందుకు సమాయత్తం కావాలని నిర్ణయించినట్లు సమాచారం.

ఈఆర్సీ నిర్ణయం మేరకే



టీఎస్ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని వినియోగదారులకు విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ) నిర్ణయించిన రెగ్యులేషన్ నంబర్ 6-2004 ప్రకారం ఏడాదికోసారి ఏసీడీ విధిస్తోంది. వినియోగదారుడు గతేడాది వాడుకున్న యూనిట్ల సరాసరి నెలకు లెక్కించి రెండు నెలల డిపాజిట్‌ను ఏసీడీగా జనవరి బిల్లులో చూపించడం జరుగుతుంది. వినియోగదారుడు కొత్త సర్వీసు తీసుకున్నప్పుడు 1 కిలోవాట్ లోడ్‌కు రూ.200 చొప్పున సెక్యూరిటీ డిపాజిట్(ఎస్‌డి)గా వసూలు చేయడం జరిగింది. అనంతరం వినియోగదారుడు వాడుకునే యూనిట్లను బట్టి ఏసీడీ డిపాజిట్‌గా ఉంచడం జరుగుతుంది. విద్యుత్ సంస్థ తీసుకున్న నిర్ణయానికి వినియోగదారులు సహకరించాలి. విద్యుత్ బిల్లులతో పాటు ఏసీడీ చార్జీలు కూడా చెల్లిస్తూ.. సంస్థ అభివృద్ధిలో భాగస్వాములుగా నిలవాలి.

– వడ్లకొండ గంగాధర్, ఎస్ఈ కరీంనగర్



గోలి వేణు, మారుతినగర్



వేణుకు వచ్చిన బిల్లు

ఈ చిత్రంలోని వ్యక్తి గోలి వేణు. కరీంనగర్ మారుతినగర్‌లో నివాసం ఉంటున్నాడు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈనెల విద్యుత్ బిల్లు రూ.411 రాగా.. ఏసీడీ చార్జీలు రూ.1,240 అదనంగా చెల్లించాలని వేశారు. ఇప్పటికే పలుచార్జీల పేరిట వసూలు చేస్తున్న విద్యుత్‌శాఖ ఏసీడీ పేరిట వాప పెడుతోందని అంటున్నాడు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఏసీడీ చార్జీలు ఎత్తేయాలని డిమాండ్ చేస్తున్నాడు.

క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలి మృతి


లక్ష్మి (ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన పారిపెల్లి లక్ష్మి(115) వృద్ధాప్యం కారణంగా వచ్చిన అనారోగ్య సమస్యలతో ఆదివారం మృతిచెందింది. ఆమె భర్త కొన్నేళ్ల క్రితమే చనిపోయాడు. లక్ష్మి 1908లో జన్మించిందని గ్రామస్తులు తెలిపారు. ఆమె మృతికి సర్పంచ్ మంతెన సంతోష్, ఎంపీటీసీ సభ్యురాలు పల్లె మంజుల సంతాపం ప్రకటించారు.

ఒకే ఈతలో మూడు గొర్రె పిల్లలు


గొర్రె పిల్లలను చూపుతున్న గంగరాజం

రాయికల్(జగిత్యాల): మండలంలోని రామాజీపేటలో మ్యాకల గంగరాజంకు చెందిన గొర్రె ఆదివారం ఒకే ఈతలో మూడు పిల్లలకు జన్మనిచ్చింది. ఇలా జరగడం చాలా అరుదు అని మండల పశువైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు.

విచ్చలవిడిగా గుడుంబా విక్రయాలు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లోని గ్రామాల్లో గత కొంతకాలంగా విచ్చలవిడిగా గుడుంబా విక్రయిస్తున్నారు. జగిత్యాల పట్టణ శివారులోని టీఆర్‌నగర్ గ్రామంలో అంతా నిరుపేదలు కావడం, ఇక్కడ పెద్ద ఎత్తున నాటుసారా లభిస్తుండటంతో కొనుగోలు చేస్తున్నారు. గుడుంబా మత్తులో చాలామంది రోడ్ల వెంట పడిపోతున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. పలువురు లీటర్ గుడుంబాను రూ.80 నుంచి రూ.150 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

బైక్ కొనివ్వలేదని యువకుడి బలవన్మరణం

జగిత్యాలక్రైం: బైక్ అడిగితే కొనివ్వలేదని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎలుకబావి వాడకు చెందిన పుప్పాల వసంత భర్త కొన్నేళ్ల క్రితం మృతిచెందాడు. వీరికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. వసంత కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను పోషిస్తోంది. ఈ క్రమంలో కుమారుడు శశికుమార్(18) తనకు బైక్ కొనివ్వాలని తల్లిపై కొన్ని రోజులుగా ఒత్తిడి తెస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా సాధ్యం కాదని ఆమె చెబుతూ వస్తోంది. దీంతో మనస్తాపానికి గురైన శశికుమార్ శనివారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జగిత్యాల పట్టణ సీఐ కిశోర్ తెలిపారు.

పొత్కపల్లిలో మద్యానికి బానిసై ఒకరు..

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని పొత్కపల్లి గ్రామానికి చెందిన రెడ్డి ప్రశాంత్(28) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ప్రశాంత్ కొన్ని నెలలుగా మద్యానికి బానిసయ్యాడు. భార్య, కుటుంబసభ్యులతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఆదివారం కూడా గొడవ పడి, తన గదిలోకి వెళ్లి ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పనిచేసే ప్రభుత్వాన్ని మర్చిపోవద్దు


జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రసమయి


సర్పంచ్ రమేశ్‌ను కుర్చీలో కూర్చోబెడుతున్న వినోద్‌కుమార్

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్
- నుస్తులాపూర్ నూతన పంచాయతీ భవనం ప్రారంభం

తిమ్మాపూర్(మానకొండూర్): పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు మర్చిపోవద్దని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. నుస్తులాపూర్‌లో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, స్థానిక సర్పంచ్ రావుల రమేశ్‌లతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్ రమేశ్ గ్రామంలో ఆడపిల్ల పుడితే కానుకగా రూ.5,116 ఇవ్వడం అభినందనీయమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమం కోసం పని చేస్తోందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో తనపై గెలిచిన బండి సంజయ్ నియోజకవర్గానికి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని ఆరోపించారు. రైతుల కోసం 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. కాళేశ్వరం నీళ్లతో రాష్ట్రమంతా సస్యశామలం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ జాతీయ పార్టీగా దేశవ్యాప్తంగా విస్తరిస్తుండటంతో బీజేపీకి భయం పట్టుకుందన్నారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ నిధులు మంజూరు చేశారని చెప్పారు. ఎల్‌ఎండీ కాలనీ నుంచి నుస్తులాపూర్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. నుస్తులాపూర్ గ్రామం జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచిందని గుర్తు చేశారు. ఎంపీగా బండి సంజయ్ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆర్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, స్వరూప, గట్టయ్య, రేఖ, రాజు, లావణ్య, కొండయ్య, రమేశ్, పద్మ, తా జుద్దీన్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. మన్నెంపల్లిలో కుమార్ స్మారకార్థం నిర్వహించిన వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే రసమయి ప్రారంభించారు.

ఉపాధ్యాయులు ఆందోళన చెందొద్దు

కరీంనగర్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల విషయంలో అందరికీ న్యాయం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఎవరూ ఆందోళన చెందొద్దని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం టీఆర్‌టీఎఫ్ ప్రతినిధులు కరీంనగర్‌లో ఆయనను కలిశారు. బదిలీలు పదోన్నతులకు సర్కారు పచ్చ జెండా ఊపిన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటకం రమేశ్ మాట్లాడుతూ.. 317 జీవో బాధితులకు, 13 జిల్లాల స్పౌజ్ కేసులు, మిస్సింగ్ స్పౌజ్‌ల విషయంలో న్యాయం చేయాలని కోరారు. పండిత పీఈటీ పోస్టుల అప్‌గ్రెడేషన్, పీఎస్ హెచ్‌ఎం పోస్టుల మంజూరు వంటి అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. అనంతరం వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, సుడా చైర్మన్ రామకృష్ణారావులు టీఆర్‌టీఎఫ్ డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల జిల్లాల అధ్యక్షులు సింగిశీల ప్రభాకర్‌రావు, నందికొండ విద్యాసాగర్, తుంగూరి సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్. అశోక్‌రావు, రాష్ట్ర బాధ్యులు మధుచంద్ర, సర్వర్, కూర రమేశ్, జిల్లా బాధ్యులు హాయ్ లతీఫ్, రమణారావు, భానుప్రకాశ్, మొహియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చెంజర్లలో అదుపుతప్పి వ్యాన్ బోల్తా

- రోడ్డును గీసుకుంటూ వెళ్లి, ఆర్టీసీ బస్సును ఢీకొన్న వైనం
- బస్సు డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెనుప్రమాదం
- 35 మంది ప్రయాణికులు సురక్షితం


చెంజర్ల శివారులో ప్రమాద దృశ్యం

మానకొండూర్: మండలంలోని చెంజర్ల శివారులో కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై ఓ వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. రోడ్డును గీసుకుంటూ వెళ్లి ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రయాణికులు పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం ఆయిల్ డ్రమ్ములతో ఓ వ్యాన్ కరీంనగర్ నుంచి విజయవాడకు వెళ్తోంది. చెంజర్ల శివారులో స్పీడ్ బ్రేకర్ల వద్దకు రాగానే వ్యాన్ డ్రైవర్ ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేశాడు. ఈ క్రమంలో వ్యాన్ అదుపుతప్పి, బోల్తా పడి, రోడ్డును గీసుకుంటూ ముందుకు వెళ్తోంది. ఇది గమనించిన హుజూరాబాద్ నుంచి కరీంనగర్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ జి.శ్రీకాంత్ చాకచక్యంగా వ్యవహరించారు. వెంటనే బస్సును రహదారి పక్కన నిలిపివేశాడు. అయినా వ్యాన్ దూసుకొచ్చి, బస్సును ఢీకొట్టింది. అందులో ఉన్న 35 మంది ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. కానీ పెనుప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వ్యాన్ డ్రైవర్, క్లీనర్ కూడా సురక్షితంగా బయట పడ్డారు. ఈ ఘటనతో రహదారిపై వాహనాలు నిలిచిపోయి, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

జాతీయ అథ్లెటిక్ పోటీలకు ఎంపిక


పతకాలు అందుకుంటున్న అశోక్, ప్రభాకర్

జమ్మికుంట(హుజూరాబాద్): మెదక్‌లోని ఇందిరా స్టేడియంలో రెండు రోజులుగా తెలంగాణ రాష్ట్ర మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలు ఆదివారం ముగిశాయి. జమ్మికుంట మండలంలోని మడిపల్లికి చెందిన అంబాల ప్రభాకర్, మున్సిపల్ పరిధిలోని అబాది జమ్మికుంటకు చెందిన ఎగిత అశోక్‌లు సత్తా చాటారు. ప్రభాకర్ జావెలిన్ త్రోలో బంగారు, హ్యామర్ త్రోలో కాంస్య, అశోక్ హ్యామర్ త్రోలో బంగారు పతకాలు సాధించారని రాష్ట్ర ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి లక్ష్మారెడ్డిలు తెలిపారు. అనంతరం వారికి పతకాలు అందజేశారు. ఫిబ్రవరి 16 నుంచి 19 వరకు హరియాణా రాష్ట్రంలోని కురుక్షేత్రలో జరిగే జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలకు వీరిద్దరూ ఎంపికైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యుడు ప్రభుకుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఖాదీ ట్రస్ట్ చైర్‌పర్సన్‌గా వాణీదేవి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వాణీదేవి

జమ్మికుంట(హుజూరాబాద్): మండలంలోని వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్టాన్ ట్రస్ట్ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్సీ వాణీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం హనుమకొండలోని ఖాదీ కార్యాలయంలో ట్రస్ట్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్సీ వాణీదేవిని చైర్‌పర్సన్‌గా, కటంగూరి రామచంద్రారెడ్డిని వైస్ చైర్మన్‌గా ప్రతిపాదించగా సెక్రెటరీ వి.కిషన్‌రావు, సభ్యులు బలపరిచారు. దీంతో ఎమ్మెల్సీని ట్రస్ట్ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఖాదీ ట్రస్ట్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గోపాల్‌రావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆనంద్ మేళా


మేళాను ప్రారంభిస్తున్న ఈడీ సునీల్‌కుమార్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన ఆనంద్ మేళా ఆకట్టుకుంది. ఆదివారం రాత్రి మహాత్మా గాంధీ క్రీడా మైదానంలో నిర్వహించిన మేళాను ఈడీ సునీల్ కుమార్, దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు ఉషాకుమార్‌లు జ్యోతిప్రజ్వలన చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ.. విద్యుత్ రంగంలో దేశ్యావ్యాప్తంగా విస్తరించిన ఎన్టీపీసీ అధికారులు, ఉద్యోగుల మానసికోల్లాసానికి కృషి చేస్తోందన్నారు. పలువురు ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాళ్లు కొనుగోలుదారులతో నిండిపోయాయి. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతులను మంత్రముగ్ధుల్ని చేశాయి. కార్యక్రమంలో ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు అధికారులు, దీప్తి మహిళా సమితి సభ్యులు, ఉద్యోగుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

భార్యను కడతేర్చిన భర్త

- ఆర్థిక ఇబ్బందులు, అప్పులు తీర్చే విషయంలో గొడవపడి, ఘాతుకం
- పరారీలో నిందితుడు
- మృతురాలు కుట్టుశిక్షణ కేంద్రం కో–ఆర్డినేటర్
- బొమ్మారెడ్డిపల్లిలో ఘటన


జ్యోతి (ఫైల్)


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సతీమణి స్నేహలత, ఎంపీపీ కరుణశ్రీ, ఎస్సై అశ్విని


జ్యోతి మృతదేహం

ధర్మారం(ధర్మపురి): ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి తన భార్యతో గొడవ పడి, చివరికి ఆమెను కడతేర్చి, పరారయ్యాడు. పోలీసులు, మృతురాలి సోదరుడు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని బొమ్మారెడ్డిపల్లికి చెందిన సింగిరెడ్డి ఎల్లారెడ్డికి ఇదే మండలంలోని చామనపల్లి గ్రామానికి చెందిన జ్యోతి అలియాస్ హేమలతకు 13 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు. దంపతులిద్దరూ కష్టపడి పని చేసుకునేవారు. జ్యోతి మహిళా సమాఖ్యలో చురుగ్గా ఉంటూ ధర్మారంలో సొంతంగా కుట్టుశిక్షణ కేంద్రం నిర్వహిస్తూ ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ ఫ్యాకల్టీగా పని చేసేది. రెండేళ్లుగా రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ కేంద్రం కో–ఆర్డినేటర్‌గా పని చేస్తోంది. ఆమె భర్త ఎల్లారెడ్డి ఆర్టీసీలో కార్గో ఏజెంట్‌గా పనిచేస్తూ, ఓ బస్సును కొనుగోలు చేసి, సంస్థలోనే కాంట్రాక్టుపై నడిపిస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు వచ్చి, అప్పులు చేశారు. వాటిని తీర్చే విషయంలో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం నుంచి రాత్రి 11 గంటల వరకు జ్యోతి తన ల్యాప్‌టాప్‌లో కుట్టు శిక్షణకు సంబంధించిన వివరాలను నమోదు చేసి, నిద్రపోయింది. ఇద్దరు కూతుళ్లు తమ నానమ్మ రాజమ్మ వద్ద మరో గదిలో నిద్రించారు. ఆదివారం ఉదయం 7 గంటల వరకూ జ్యోతి నిద్ర లేవలేదు. కూతురు వెళ్లి లేపే ప్రయత్నం చేయగా ఉలుకూపలుకు లేకుండా పడి ఉంది. వెంటనే తండ్రి ఎల్లారెడ్డికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్‌గా వచ్చింది. రాజమ్మ ఇరుగు పొరుగు వారిని పిలవడంతో వచ్చి, చనిపోయినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పెద్దపల్లి సీఐ ప్రదీప్‌కుమార్, ధర్మారం ఎస్సైలు శ్రీనివాస్, అశ్వినిలు సంఘటన స్థలానికి వెళ్లి, మృతదేహాన్ని పరిశీలించారు. జ్యోతి తలకు గాయం ఉండి, రక్తస్రావం కావడంతో హత్య జరిగినట్లు తేల్చారు. కాగా ఆర్థిక అవసరాలకు, అప్పులు చెల్లించేందుకు వ్యవసాయ భూమిని విక్రయిద్దామని భర్తపై ఒత్తిడి తెచ్చినందుకే హత్య చేశాడని మృతురాలి సోదరుడు రాజేందర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎల్లారెడ్డిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. జ్యోతి హత్య విషయం తెలుసుకున్న వెంటనే మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి, ఎల్‌ఎం ట్రస్టు చైర్‌పర్సన్ స్నేహలత, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, సహకార సంఘాల ఫోరం జిల్లా చైర్మన్ బలరాం రెడ్డిలు గ్రామానికి చేరుకొని, మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి కుటుంబసభ్యులను ఓదార్చారు.

కారు ఢీకొని గొర్రెల కాపరికి తీవ్ర గాయాలు

- 10 గొర్రెలు మృతి
- నర్సయ్యపల్లె శివారులో ఘటన


మృతిచెందిన జీవాలను పరిశీలిస్తున్న ఎస్సై అశోక్‌రెడ్డి

సుల్తానాబాద్ రూరల్(పెద్దపల్లి): మండలంలోని నర్సయ్యపల్లె శివారులో రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గొర్రెల కాపరి తీవ్రంగా గాయపడగా, 10 గొర్రెలు మృతిచెందాయి. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. ఎలిగేడు మండలంలోని శివపల్లికి చెందిన మామిడి ఎల్లయ్య ఆదివారం తన గొర్రెలను మేపేందుకు రోడ్డు పైనుంచి తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి గోదావరిఖని వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో 10 జీవాలు అక్కడికక్కడే మృతిచెందగా మరో 5 గొర్రెలకు, ఎల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు .

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

- గేదెను తప్పించబోయి సిమెంట్ గద్దెను ఢీకొన్న కారు
- మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కరీంనగర్‌క్రైం: స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు హాజరైన కొద్దిసేపటికే ఆ విద్యార్థులు ప్రమాదానికి గురయ్యారు. గాయాలతో బయటపడగా వారు ప్రయాణిస్తున్న కారు దగ్ధమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలోని బావుపేటకు చెందిన శ్రీనాథ్, సన్నీ, మహబూబ్‌నగర్‌కు చెందిన అరుణ్, అభిరాం, రామచంద్రారెడ్డి, దేవరాజులు హైదరాబాద్‌లోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నారు. శనివారం వీరి స్నేహితుడు, కరీంనగర్‌కు చెందిన సాయిచేతన్ పుట్టినరోజు కావడంతో హైదరాబాద్‌లోని కొంపెల్లికి చెందిన లోకేశ్ అనే యువకుడి కారును అద్దెకు తీసుకొని, కరీంనగర్ వచ్చారు. రాత్రి వేడుకలు పూర్తయ్యాక ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు కారులో మానేరు డ్యాం ఉజ్వల పార్కు నుంచి సప్తగిరికాలనీకి వెళ్తున్నారు. ఈ క్రమంలో స్పోర్ట్స్ స్కూల్ వద్ద గేదె అడ్డు రావడంతో దాన్ని తప్పించబోయి ఎదురుగా ఉన్న సిమెంట్ గద్దెకు ఢీకొట్టారు. ఈ ఘటనలో వారికి గాయాలయ్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, బాధితులను ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికే కారులో మంటలు చెలరేగి, పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు వెంటనే వచ్చి, మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో అరుణ్‌కు తీవ్ర గాయాలవగా చికిత్స పొందుతున్నట్లు సమాచారం. కారు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

మెడికల్ కాలేజీకి వృద్ధురాలి మృతదేహం


కళావతి (ఫైల్)


నివాళులర్పిస్తున్న మేయర్, వైద్యాధికారులు, ఎన్జీవో ప్రతినిధులు, సెక్యూరిటీ సిబ్బంది

కోల్‌సిటీ(రామగుండం): ఓ వృద్ధురాలు అనారోగ్యంతో మృతిచెందగా ఆమె కోరిక మేరకు మృతదేహాన్ని కుటుంబసభ్యులు మెడికల్ కాలేజీకి దానం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా చెన్నూరు మున్సిపాలిటీకి చెందిన జన్నం కళావతి(65) ఐదేళ్ల క్రితం చెన్నూరులో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు నేత్ర, అవయవ, శరీర దానంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరైంది. అక్కడ తాను మరణించాక శరీరం దానం చేస్తానని వారికి అంగీకార పత్రం ఇచ్చింది. ఈ క్రమంలో ఇటీవల ఆమె ఆరోగ్యం క్షీణించి, ఆదివారం తెల్లవారుజామున మృతిచెందింది. దీంతో ఆమె కోరిక ప్రకారం సోదరులు జన్నం కైలాసం, నాగభూషణం, శంకర్, ధనుంజయ్, రవీంద్రకుమార్, విజయ్‌కుమార్‌లు మృతదేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించడానికి ముందుకు వచ్చారు. రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాజేందర్, ప్రతినిధి బెజిగోపాల్ త్రివేది, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు లింగమూర్తి, కేఎస్.వాసు, టెక్నీషియన్ ఆరిఫ్‌లు చెన్నూరు వెళ్లి, అంబులెన్స్‌లో కళావతి మృతదేహాన్ని రామగుండం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)కి తీసుకువచ్చారు. మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్ సమక్షంలో అనాటమీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్‌కు అప్పగించారు. ఆసుపత్రి ఆర్‌ఎంవో డాక్టర్ అప్పారావు, డాక్టర్ రాహుల్, సెక్యూరిటీ సిబ్బందితో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళావతి సోదరులను, సహకరించిన ఆర్‌ఎంపీ పి.సత్తయ్యను ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మేయర్ అనిల్‌కుమార్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబిందు సింగ్, సదాశయ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రావణ్ కుమార్, లింగమూర్తి తదితరులు అభినందించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

- తొలుత కుమారుడికి ఉరి బిగించిన వైనం
- చుట్టుపక్కలవారు పరిగెత్తుకురావడంతో ప్రాణాలతో బయటపడిన బాలుడు
- మల్లాపూర్‌లో ఘటన


సోమయ్య (ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన సూర సోమయ్య(30)కు ఏడేళ్ల క్రితం కోరుట్ల పట్టణానికి చెందిన కవితతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. దంపతులకు కొంతకాలంగా గొడవలు జరుతున్నాయి. ఈ క్రమంలో కవిత కూతుళ్లను తీసుకొని, పుట్టింటికి వెళ్లిపోయింది. ఇరు కుటుంబసభ్యులు పలుమార్లు సోమయ్య, కవితలతో మాట్లాడి, సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నించారు. కానీ ఆమె కాపురానికి రానని తేల్చిచెప్పింది. అప్పటి నుంచి సోమయ్య తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో కుమారుడు హేమంత్‌కు ఉరి బిగించాడు. తర్వాత తానూ ఉరేసుకున్నాడు. గమనించిన సోమయ్య తల్లి సాలవ్వ గట్టిగా విలపించడంతో చుట్టుపక్కలవారు పరిగెత్తుకు వచ్చారు. హేమంత్‌ను ఉరితాడు నుంచి విడిపించడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. సోమయ్య మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయాడు. కరీంనగర్ టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు కళాశాల బస్సు డ్రైవర్ ఓదెలు(45) శనివారం ఉదయం విద్యార్థులను బస్సులో తీసుకొని వెళ్తున్నాడు. జ్యోతినగర్ మెయిన్‌రోడ్డుపై ఆటో అడ్డురావడంతో ప్రమాదం జరిగింది. ఓదేలును పోలీసులు పోలీసుస్టేషన్‌కు తరలించగా ఫిట్స్ రావడంతో నగరంలోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ చనిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

2007 బ్యాచ్ కానిస్టేబుళ్ల ఆత్మీయ సమ్మేళనం



కరీంనగర్‌క్రైం: ఉమ్మడి జిల్లాకు చెందిన 2007 బ్యాచ్ సివిల్ కానిస్టేబుళ్లు ఆదివారం కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. కార్యక్రమానికి 65 మంది హాజరయ్యారు. వీరిలో పలువురు ఇతర ఉద్యోగా లకు ఎంపికైనవారూ ఉన్నారు. తమ ఐక్యత చాటేందుకే ఒక్కచోట చేరామని తెలిపారు. తమలో ఆర్థికంగా ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే అండగా ఉండాలని తీర్మానించారు. ఐదేళ్లకోసారి ఈ సమ్మేళనం నిర్వహిస్తూ ప్రజాహిత కార్యక్రమాలు చేపడుతామన్నారు. కుమారస్వామి, మల్లేశం, మహేశ్, మహేందర్, కృష్ణంరాజు, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని రేచపల్లి శివారులో ఆదివారం పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై మనోహర్‌రావు తెలిపారు. పక్కా సమాచారంతో దాడి చేసి, వారిని పట్టుకున్నామని చెప్పారు. రూ.4,800 స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

సేనాధిపతికి రాష్ట్రస్థాయి సాహితీ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న దాస్యం సేనాధిపతి

కరీంనగర్ కల్చరల్: భువనగిరి యాదాద్రి జిల్లా మోత్కూరులో ప్రజా భారతి ఆధ్వర్యంలో జరిగిన సాహితీసభలో కరీంనగర్‌కు చెందిన కవి, రచయిత, విమర్శకుడు దాస్యం సేనాధిపతికి రాష్ట్రస్థాయి సాహితీ పురస్కారం వరించింది. ఈమేరకు తుంగతుర్తి ఎమ్మెల్యే కిశోర్‌కుమార్, మేడ్చల్ అడిషనల్ కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డిల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, డాక్టర్ సుద్దాల అశోక్ తేజ, డాక్టర్ పోరెడ్డి రంగయ్య, సంస్థ బాధ్యులు ఉప్పలయ్య, జయశ్రీ, ఎస్ఎస్ చారి, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి గంగుల

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో రూపొందించిన 2023 క్యాలెండర్‌ను ఆదివారం రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తన క్యాంపు ఆఫీస్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేల్పుల శ్రీనివాస్, సూదుల వెంకటరమణ, గౌరవ సలహాదారు బోనాల మల్లికార్జున్, ఉపాధ్యక్షులు జగన్‌మోహన్, రఘు, కార్యదర్శి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏకదశ రాత్రులు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ దేవ్నళ్లపురిలోని శివ భక్త మార్కండేయ స్వామి ఆలయంలో ఆదివారం ఏకదశ రాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపకులు, పూజారి చిలుక నర్సప్ప గణపతిపూజ, శివ పూజలు, మార్కండేయ స్వామి వారికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 24న మార్కండేయ జయంతి వరకు జరిగే పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పూజల్లో ఆలయ సంక్షేమ ట్రస్టు బాధ్యులతోపాటు భక్తులు పాల్గొన్నారు.

శివాలయానికి విరాళం



చెక్కు అందిస్తున్న అశోక్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి మీ సేవా కేంద్రం నిర్వాహకులు వేముల అశోక్–సుస్మిత దంపతులు రూ.25,116 విరాళం ప్రకటించారు. ఆదివారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు నందాల తిరుపతి, సుంకిశాల సంపత్‌రావులకు అశోక్ విరాళం చెక్కును అందించారు.

ఆర్యవైశ్య జిల్లా మహాసభ కార్యవర్గ సమావేశం

కరీంనగర్: ఆర్యవైశ్య జిల్లా మహాసభ కార్యవర్గ సమావేశం ఆదివారం గాంధీరోడ్‌లోని వైశ్యభవన్‌లో జిల్లా అధ్యక్షుడు చంద రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నిరుపేద ఆర్యవైశ్య విద్యార్థులకు సాలర్‌షిప్, ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న ఆర్యవైశ్యులకు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించి సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ఏర్పాటు చేయలేదన్నారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ స్పందించి ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు శివనాథుని శ్రీనివాస్, అనగం శ్రీనివాస్, వుప్పల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి



శ్రీనివాస్ రెడ్డి

కరీంనగర్: పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా సైదాపూర్ మండలంలోని ఘన్‌పూర్ పాఠశాలలో ఎస్జీటీగా పని చేస్తున్న అట్ల శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.చెన్నయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోనే శ్రీనివాస్, పల్లెపాటి వేణుగోపాల్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. అట్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పీఆర్‌టీయూ సంఘం బలోపేతానికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

చిత్ర కథ

పార్కింగ్ ప్రమాదకరమే..



కరీంనగర్‌లోని మంకమ్మ తోటలో ట్రాన్స్‌ఫార్మర్ కింద విద్యుత్ అధికారులు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారనుకుంటే పొరపాటే. అక్కడ పార్కింగ్ స్థలం లేకపోవడంతో ప్రమాదకరమని తెలిసి కూడా కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ కింద కొద్దిపాటి స్థలంలో ఇలా వాహనాలను పార్కింగ్ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేసి వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

సాక్షి ఎఫెక్ట్

గేట్‌వాల్వ్ గుంత పూడ్చివేత



కరీంనగర్ మండలం దుబ్బపల్లిలో ప్రమాదకరంగా ఉన్న గేట్‌వాల్వ్ గుంతను పంచాయతీ సిబ్బంది పూడ్చి వేశారు. ఆదివారం ‘సాక్షి’లో ‘ప్రమాదకరంగా గేట్‌వాల్వ్ గుంత’ పేరిట ప్రచురితమైన ఫొటో కథనానికి ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి స్పందించారు. ఎంపీడీవో ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది మట్టితో గుంతను పూడ్చి చదును చేశారు. మూడు నెలల నుంచి మూలమలుపులో ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చివేయడంపై వాహనదారులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

– కరీంనగర్‌రూరల్

పూర్వీకులు అందించిన గొప్ప ఆలయ సంపద



మాట్లాడుతున్న మార్వాడీ మందిర్ కమిటీ బాధ్యులు

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని మార్వాడీ హనుమాన్ మందిర్‌కి వందేళ్ల చరిత్ర ఉందని, మహిమాన్వితమైన ఆలయాన్ని తమ పూర్వీకులు అందించిన గొప్ప ఆలయ సంపద అని రాజస్థాన్ సేవా సమాజ్, మార్వాడీ మందిర్ కమిటీ బాధ్యులు అన్నారు. ఆదివారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆలయాన్ని మరింత అద్భుతంగా తీర్చిదిద్దేందుకు మూడేళ్ల చేపట్టిన పునర్నిర్మాణ పనులు పూర్తయ్యాయని అన్నారు. మందిరంలో రామాలయం, శివాలయం, హనుమాన్ ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. ఈనెల 25, 26, 27వ తేదీల్లో ప్రత్యేక మార్వాడీ హనుమాన్ మందిరం ప్రాణప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందన్నారు. ఆలయ ప్రారంభోత్సవానికి రాజస్థాన్ (ఝాలరియా)పీఠాధిపతులు ఘనశ్యామాచారి స్వామీజీ వేదమంత్రోచ్చారణల మధ్య, హోమాలతో ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే మార్వాడీ మందిర్ దేవతామూర్తుల ప్రతిష్ఠా కార్యక్రమానికి భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాజస్థాన్ సేవా సమితి, మార్వాడీ మందిర్ కమిటీ బాధ్యులు మహేశ్‌కుమార్ డోడియా, చాంద్ మాల్ ముందడా, గిరిధర్ లాల్ డోడియా, కమల్ కిషోర్ సోనీ, లక్ష్మీనారాయణ డోడియ, నరేశ్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా లావణ్య



నియామక పత్రం అందజేసి అభినందిస్తున్న కర్ర సత్యప్రసన్న

కరీంనగర్‌టౌన్: మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌కు చెందిన సిరిపురం లావణ్యను నియమించినట్లు మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ ప్రజాసమస్యలపై పోరాడుతూ మహిళా కాంగ్రెస్ అభివృద్ధికి పాటుపడతామని అన్నారు. తన నియామకానికి సహకరించిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ అసెంబ్లీ నియోజక వర్గం నాయకులు మేన్నేని రోహిత్‌రావు, జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డిలకు లావణ్య కృతజ్ఞతలు తెలిపారు.

వృత్తి ఉద్యోగం.. ప్రవృత్తి నటన

- వందల లఘు చిత్రాల్లో వివిధ పాత్రలు
- అవార్డులు.. ప్రశంసలు
- ఆదర్శం.. ఈ ఏఈవో ఉదయ్‌కుమార్



షూటింగ్‌లో ఉదయ్ కుమార్

కరీంనగర్ అర్బన్: వృత్తి.. ప్రవృత్తుల సంగమం ఈ ఉదయ్‌కుమార్. వ్యవసాయ శాఖలో ఉద్యోగమైనా సెలవు దొరికితే పలు పాత్రలతో తనదైన శైలిని ప్రదర్శిస్తున్నారు. లఘుచిత్రాలు, ప్రభుత్వ నాటకాలు, డబ్బింగ్ తదితర పాత్రలను పోషిస్తూ ఔరా అనిపిస్తున్నారు. చిన్నతనం నుంచి ఏర్పడిన నాటక అభిరుచిని కొనసాగిస్తూ మరుగునపడుతున్న నాటక రంగ ఉనికిని చాటుతూ.. యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. సందేశ చిత్రాలకు ప్రాధాన్యతనిస్తుండగా తదనుగుణ పాత్రలకు జీవం పోస్తున్నారు. తండ్రిగా, విలన్‌గా, హీరో, అన్న, తమ్ముడు, యువకుడు, వ్యాపారి తదితర గెటప్‌లతో వీక్షకులను రంజింపజేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రులతో అవార్డులు పొందగా జిల్లాస్థాయిలో ప్రశంసలకు లెక్కేలేదు. వ్యవసాయ శాఖలో ఏఈవో ఉద్యోగం చేస్తూనే లఘుచిత్రాలు, నాటకాలతో రాణిస్తున్న సదరు అధికారిపై ‘సాక్షి’ పరిచయ కథనం..

కరీంనగర్‌లోని తిలక్‌రోడ్డుకు చెందిన గద్దె ఉదయ్‌కుమార్ బాల్యదశ నుంచే నాటక రంగమంటే ప్రత్యేక ఆసక్తి. తల్లిదండ్రులు వెంకటస్వామి–శాంతకుమారి ప్రోత్సాహంతో మరింతగా రాణిస్తూ అందరి మన్ననలు పొందారు. విద్యార్థి దశలో వెర్రి గారాబం నాటకంతో విశేష ప్రచారం పొందారు. 1990లో వ్యవసాయ శాఖలో ఉద్యోగం సాధించగా తదుపరి మాతృ సంస్థ చైతన్య కళాభారతి సంస్థ ద్వారా పలు నాటకాలు ప్రదర్శించారు. మనిషి, ప్రేమ పిచ్చోళ్లు, దేవత రూపం, విధాత, టర్నింగ్ పాయింట్, క్షతగాత్రుడు, క్లిక్, చెల్లని పైసలు, దొంగలు, లాలలీల, అగ్నిపరీక్ష, ఖరీదైన జైళ్లు, గర్భగుడి, మార్గదర్శి నాటికలు ప్రత్యేక గుర్తింపునిచ్చాయి. శ్రీరాముల సత్యనారాయణ పరిచయం ద్వారా రంగస్థల ప్రవేశం చేయగా ఇప్పటికీ కొనసాగిస్తున్నారు.

ముఖ్యమంత్రులతో ప్రశంసలు

గతంలో ప్రభుత్వ పథకాలపై నాటికల రూపంలో ప్రదర్శనలిచ్చేవారు. గ్రామ, పట్టణ కూడళ్లలో వినోదంతో పాటు విషయాన్ని చేరవేసేవారు. రైతు రాజ్యం, నీరు మీరు, నాకు ఇల్లు వచ్చింది, వృక్షో రక్షతి రక్షితః వంటి నాటకాలను ప్రదర్శించారు. నాటకరంగంలో శ్రీరాములు సత్యనారాయణ, రమేశ్‌బాబు, మల్లయ్య, ప్రస్తుతం మంచాల రమేశ్, సతీశ్, ఏకే రెడ్డి, వెంకటనారాయణ బృందంగా ఎన్నో ప్రదర్శనలు ఇస్తున్నారు. రాష్ట్రస్థాయి నాటక పోటీల్లో రవీంద్రభారతి వేదికగా ఎన్నో నాటకాలు వేసి ప్రథమస్థానంలో నిలిచారు. అప్పటి ముఖ్యమంత్రులు ఎన్టీ రామారావు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డులు పొందారు. వీరి నాటక బృందానికి రెండు సార్లు నంది అవార్డులు వరించడం నటన శైలికి తార్కాణం.

మరింతగా రాణిస్తా..



ఉద్యోగపరంగా గుర్తింపు పొందుతూనే అభిరుచి రంగంలో ప్రత్యేకంగా నిలువాలన్నదే నా ఆకాంక్ష. రానున్న రోజుల్లో ఉద్యోగ, కళా రంగాల్లో మరింత కృషి చేసి ప్రజల మనసుల్లో నిలవాలని కోరిక. అధికారులు, సినీ ఇండస్ట్రీ పెద్దలు తదనుగుణంగా ప్రోత్సహించడం నా అదృష్టం. – జి.ఉదయ్ కుమార్, ఆర్టిస్ట్



పురస్కారం అందుకుంటున్న ఉదయ్

నాటక ప్రదర్శనలు.. లఘు చిత్రాలు

- అశ్లీలతకు తావు లేకుండా యువతకు, నేటి సమాజానికి సందేశమిచ్చే నాటకాలు, లఘు చిత్రాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.
- రాష్ట్రస్థాయిలో ఇప్పటివరకు 50 నాటకాలను ప్రదర్శించగా చైతన్య కళాభారతి కరీంనగర్ ద్వారా సుమారు 600ల ప్రదర్శనలు ఇచ్చారు.
- 1996లో రాష్ట్రస్థాయి మీడియా వర్క్‌షాప్ ఇన్‌లిక్టింగ్ మొదటి శిక్షణ కార్యక్రమానికి ఎంపిక కాగా 45రోజుల పాటు దేవదాసు కనకాల, దీక్షిత్, బిక్షు, డీఎస్ఎస్ లాంటి దిగ్గజాల వద్ద శిష్యరికం చేశారు.
- 1999 నుంచి సినిమా షార్ట్ ఫిల్మ్‌లలో నటిస్తున్నారు. ఆడోళ్ల రాజ్యం, స్కైలాబ్, తిర్వని, రాజ్‌కహని, బ్రహ్మచారి, గర్భశోకం వంటి సినిమాల్లో నటించారు.
- ఆడపిల్ల, మల్లి, యమలోకం, రైతురాజ్యం, సారంగపాణి, కేజీఎఫ్ ఇలా 380వరకు షార్ట్ ఫిలిమ్స్‌లో నటించారు.

కళాభారతి చేనేత హస్తకళా మేళా ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్యాంప్రసాద్‌లాల్

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్‌లోని రాజరాజేశ్వర కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కళాభారతి చేనేత హస్తకళా మేళాను ఆదివారం అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరసమైన ధరలకు నాణ్యమైన వస్త్రాలు, వస్తువులు అందుబాటులో ఉండటం సంతోషకరమని, నేరుగా కళాకారులకు అమ్మకాల ద్వారా ఉపాధి లభిస్తోందన్నారు. నిర్వాహకులు జెల్ల సత్యనారాయణ, శనిగరం కిశోర్ మాట్లాడుతూ మేళా ఫిబ్రవరి 15వ వరకు కొనసాగుతుందని అన్నారు. పురుషులు, మహిళలు, చిన్నారులకు సంబంధించిన డ్రెస్ మెటీరియల్స్, చీరలు, ఖాదీవస్త్రాలు, కొయ్య, చెక్క బొమ్మలు, అలకరణ సామగ్రి వంటివి అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఆదరించాలని కోరారు.

మానవహారాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న మర్రి వెంకటస్వామి

కరీంనగర్: హేతువాదులు, నాస్తికులు, బహుజనులపై జరుగుతున్న దాడులు, రాజ్యాంగంను కాపాడాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్వేచ్ఛ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే ‘మానవహారం’ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మిల్కూరి వాసుదేవరెడ్డిలు అన్నారు. ఆదివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో జరిగిన సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాలు, బీసీ సంఘం, కార్మిక, మహిళా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మతోన్మాదం పెరిగిపోయిందని, కులాల, మతాల మధ్య వైరుధ్యాలను సృష్టిస్తుందని, రాజ్యాంగాన్ని, చట్టాలను కాలరాస్తుందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను దుర్వినియోగం చేస్తోందని, ప్రశ్నించే వారి గొంతులు నొక్కుతూ భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో సీపీఐ, సీపీఎం నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, బీసీ సంఘం, ఉపాధ్యాయ సంఘాలు, మహిళా, కార్మిక, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అలరించిన పేరెంట్స్ గేమ్స్



సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో..

కరీంనగర్‌స్పోర్ట్స్: భగత్‌నగర్‌లోని సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు జీల్–2023 పేరిట నిర్వహించిన క్రీడా పోటీలు అలరించాయి. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు బాల్‌రేస్, స్పూన్‌రేస్, వాలీబాల్, సప్తపది, బ్రిక్‌రేస్, స్లో వాకింగ్, మ్యూజికల్ చైర్, బెలూన్ రేస్ తదితర ఆటలు నిర్వహించారు. అంతకుముందు ఈ పోటీలకు సిద్ధార్థ విద్యాసంస్థల డైరెక్టర్ దాసరి శ్రీపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఎప్పుడూ బిజీగా గడిపే తల్లిదండ్రులకు ఆటవిడుపులా ఏటా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



వివేకానంద విద్యానికేతన్‌లో..

‘వివేకానంద’లో పేరెంట్స్ వాలీబాల్ లీగ్

కరీంనగర్‌స్పోర్ట్స్: భగత్‌నగర్‌లోని వివేకానంద విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు పితృదేవోభవ పేరిట నిర్వహించిన వాలీబాల్ పోటీలు అలరించాయి. తల్లిదండ్రులు తమ పిల్లలకు ధీటుగా వాలీబాల్ ఆడి సందడి చేశారు. అంతకుముందు ఈ పోటీలను వివేకానంద విద్యాసంస్థల అధినేత సొగాని కొమురయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మిథున్ జే మిస్త్రీ, ఏవో తుంగని సంపత్, సాగర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

‘సెయింట్ జాన్స్’లో వార్షికోత్సవ సంబరం




వేడుకల్లో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్

కరీంనగర్: నగరంలోని సెయింట్‌జాన్స్ హైస్కూల్‌లో క్యాథలిస్ట్ సిస్టర్స్ ఆఫ్ సెయింట్ ఆన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 60వ వార్షికోత్సవ సంబరం అంబరాన్నంటింది. ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి ఈవీ వేణుగోపాల్ హాజరై వేడుకలను అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. అనంతరం పదోతరగతిలో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్ అందజేశారు. హైదరాబాద్ ప్రావిన్స్ సీఎస్ఏ ప్రొవెన్షియల్ సుపీరియర్ డాక్టర్ నిర్మల అధ్యక్షతన జరిగిన వేడుకల్లో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె.యువరాజు, అడ్వకేట్ ఈవీ శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజారెడ్డి, కార్పొరేటర్ వి.రాజేందర్‌రావు, పూర్వ విద్యార్థి సంఘం ప్రతినిధులు డాక్టర్ కేవీ త్రినాథ్‌రెడ్డి, బద్రుద్దీన్ ఖిమానీ, మహేష్, వేణుగోపాల్, లూర్దుమాత చర్చ్ ఫాదర్ ఆర్.థామస్, కరస్పాండెంట్ నక్షత్రం, హెచ్ఎం పి.ఇన్నాలు, ఫాతిమా, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటే పోటీ పరీక్షలు

కరీంనగర్‌స్పోర్ట్స్: ధన్గర్‌వాడి ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం కరీంనగర్ ఆర్ఆర్ షోటోకాన్ కరాటే అకాడమీ విద్యార్థులకు కరాటే పోటీ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికీ వారి అర్హత ఆధారంగా బెల్టులు, సర్టిఫికెట్లను అకాడమీ చీఫ్ గౌరు రాజిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో కోచ్ లు దీప్తి, మాలతీ, చిరంజీవి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల్లో 50శాతం కేటాయించాలి



విద్యానగర్(కరీంనగర్): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన మైనార్టీ సబ్సిడీ రుణాల్లో 50శాతం మహిళలకు కేటాయించాలని ఎంఐఎం పార్టీ మహిళా కార్పొరేటర్లు కోరారు. ఆదివారం కరీంనగర్‌లోని ఎంఐఎం కార్యాలయంలో మహిళా కార్పొరేటర్లు సమావేశమై మాట్లాడారు. మైనార్టీ రుణాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రతీ ఆదివారం కరీంనగర్‌లోని దారుస్సలాంలో ఎంఐఎం మహిళా కార్పొరేటర్లు ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. తమ డివిజన్ల పరిధిలోని మహిళలు వచ్చి సమస్యలు విన్నవించుకోవచ్చని, సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు ఇఫ్రా తస్రీన్, షాకిరా అంజుమ్, గౌసియా బేగం, జహెరా బాను, నుజ్హత్ పర్వీన్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు రాఫియ సుల్తానా పాల్గొన్నారు.

మెరిట్ కమ్ రోస్టర్‌తో సీనియార్టీ లిస్టు తయారు చేయాలి



మాట్లాడుతున్న మీసాల మల్లిక్

కరీంనగర్: త్వరలో జరుగనున్న ఉపాధ్యాయ బదిలీల్లో మెరిట్ కమ్ రోస్టర్‌తో కూడిన సీనియారిటీ లిస్టును తయారు చేయాలని తెలంగాణ ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్ డిమాండ్ చేశారు. ఆదివారం సంఘ కార్యాలయంలో మాట్లాడుతూ.. గతంలో జరిగిన బదిలీలలో కానీ ప్రమోషన్‌లలో కానీ మెరిట్‌తో కూడిన సీనియార్టీ లిస్టును తయారు చేయడం జరిగిందని, అలా తయారు చేయడంలో మెరిట్ కమ్ రోస్టర్‌కు అర్థమే లేదన్నారు. మెరిట్ కమ్ రోస్టర్ ద్వారా ఉద్యోగం పొందిన ఉపాధ్యాయులకు అదే విధమైన సీనియార్టీ లిస్టును తయారు చేయాలని అన్నారు. నాయకులు సురేష్, రాజు, శంకర్, సంపత్ పాల్గొన్నారు.

కరీంనగర్‌వాసులకు మలేషియా తెలుగు పురస్కారాలు



ద్రోణాచారి



శ్రీనివాస్

విద్యానగర్(కరీంనగర్): మలేషియా తెలుగు సంఘం, క్లాంగ్ శాఖ ఆధ్వర్యంలో ఏటా మలేషియాలో నిర్వహించే సంక్రాంతి సంబరాల్లో భాగంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న తెలుగు వారికి ఇచ్చే పురస్కారాలను 2023 సంవత్సరానికి కరీంనగర్‌కు చెందిన కవి, రచయిత, వీఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్, ఇన్‌కాం టాక్స్ ప్రాక్టీషనర్ వేములవాడ ద్రోణాచారికి సాహితీ పురస్కారం, గాయకుడు కరపర్తి శ్రీనివా స్‌కు కళా పురస్కారాలను ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్ అవార్డు వివరాలతోపాటు ఆహ్వాన పత్రాలను వారికి పంపించారు. ఈనెల 28న మలేషియా క్లాంగ్‌లోని మజీలీస్ ప్రబండరం లైబ్రరీలో జరిగే కార్యక్రమంలో అవార్డులు అందజేసి సత్కారించనున్నట్లు ఆహ్వాన పత్రాల్లో నిర్వాహకులు పెర్కొన్నారు.

రెండోరోజు అద్దె బస్సు డ్రైవర్ల సమ్మె

కరీంనగర్: ఆర్టీసీ కరీంనగర్–1,2 డిపోల అద్దె బస్సుల డ్రైవర్లు చేస్తున్న సమ్మె ఆదివారం రెండోరోజు కొనసాగింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ యాజమాన్యం, బస్సు యజమానులు ఇంతవరకు చర్చలకు పిలువలేదని, సమ్మెను ఉధృతం చేస్తామని అన్నారు. ఒకవైపు పోలీసులు, మరోవైపు ఓనర్ల వేధింపులతో డ్రైవర్లు తీవ్ర మానసిక ఆందోళనలకు గురవుతున్నారని అన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ఓనర్లతో మాట్లాడి డిమాండ్లు పరిష్కరించాలని అన్నారు. పున్నం రవి, చెలికాని శ్రీనివాస్, పులిపాక ప్రసాద్, మనోహర్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11 కేవీ రాంనగర్ ఫీడర్ పరిధిలోని చేపల మార్కెట్ నుంచి సంతోష్‌నగర్ రోడ్ నంబర్ 9 వరకు గల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు.

ఆ రూ.495 కోట్లు ఇప్పించండి

- ఏపీకి బదలాయించిన సీఎస్ఎస్ నిధులపై మంత్రి హరీశ్‌రావు
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌కు బదలాయించిన కేంద్ర ప్రాయోజిత పథకాలకు (సీఎస్ఎస్) సంబంధించిన రూ.495 కోట్లు తిరిగి ఇప్పించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి టి.హరీశ్‌రావు డిమాండ్ చేశారు. 2014–15లో సీఎస్ఎస్ కింద తెలంగాణకు హక్కుగా రావాల్సిన నగదును పొరపాటున ఆంధ్రప్రదేశ్‌లో ఖాతాలో జమచేశారని, దాన్ని తిరిగి తెలంగాణకు ఇప్పించాలని కోరారు. ఈ మేరకు హరీశ్‌రావు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు విజ్ఞప్తి చేసినా, కేంద్రానికి లేఖలు రాసినా ఫలితం లేకుండా పోయిందని చెప్పారు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత మొదటి సంవత్సరంలో (2014–15) కేంద్రం నుంచి వచ్చే నిధులను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య జనాభా ప్రాతిపదికన విభజించారని, అయితే పొరపాటుగా మొత్తం సీఎస్ఎస్ నిధులను ఆంధ్రప్రదేశ్‌కు జమ చేశారని గుర్తుచేశారు. దీంతో తెలంగాణ నష్టపోయిందన్నారు. ఈ విషయాన్ని తాము ఇప్పటికే ఏపీ, కేంద్ర ప్రభుత్వాలతోపాటు అకౌంటెంట్ జనరల్ దృష్టికి తీసుకువెళ్లినట్లు వివరించారు. ఎనిమిదేళ్లు గడుస్తున్నా ఆ రూ.495 కోట్లను తెలంగాణకు ఇంకా సర్దుబాటు చేయలేదన్నారు. ఇప్పటికైనా ఆ మొత్తాన్ని తిరిగి ఇప్పించేలా కృషి చేయాలని, వ్యక్తిగతంగా చొరవ తీసుకొని తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని సీతారామన్‌ను కోరారు.

మంగ్లీ కారుపై రాళ్లు

బళ్లారి ఉత్సవాల్లో ఘటన



సాక్షి, బళ్లారి: బళ్లారి ఉత్సవ్‌లో పాటలు పాడేందుకు వచ్చిన ప్రముఖ గాయని మంగ్లీ కారుపై కొందరు రాళ్లు విసరడంతో అద్దాలు పగిలిపోయాయి. నగరంలో నిర్వహించిన ఉత్సవంలో శనివారం రాత్రి 12 గంటల వరకు మంగ్లీ తెలుగు, కన్నడ భాషలకు చెందిన వివిధ రకాలు పాటలు పాడి అలరించారు. కార్యక్రమం ముగిశాక బయటకు వచ్చేటప్పుడు ఆమెను కలుసుకునేందుకు పెద్ద సంఖ్యలో యువత పోటీ పడ్డారు. దీంతో పోలీసుల స్వల్ప లాఠీచార్జి కూడా చేయాల్సి వచ్చింది. అంతలోనే ఆమె మేకప్ గదిలోకి వెళ్లడంతో కొందరు ఆమె కారుపై రాళ్లు రువ్వడంతో కారు గ్లాసు పగిలిపోయింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

అడవిపై ఈ-కన్ను

- పగటి వేళ చెరువులో కొంతసేపు జలకాలాటలు ఆడిన ఓ పెద్దపులి. ఆ తర్వాత ఒడ్డునే ఉన్న ఓ చెట్టుకు శరీరం, తల రుద్దుకుంటూ సేదతీరింది.
- ఒకచోట రెండు, మూడు పులులు తమ పిల్లలతో కలిసి ఆడుకుంటూ ఫుల్లుగా ఎంజాయ్ చేశాయి.
- కొన్ని జంతువులు ఇతర జంతువులపై దాడికి దిగి, ఆకలి తీరాక పక్క నుంచి బలహీనమైన ఇతర వన్యప్రాణులు వెళుతున్నా పట్టించుకోలేదు.
- ఓ నీటిగుంటలో ఒక సాంబార్ జింక నిద్రిస్తుండగా అడవి కుక్కలు దాన్ని చుట్టుముట్టే ప్రయత్నం చేశాయి. క్షణాల్లోనే అప్రమత్తమైన ఆ జింక వేగంగా తప్పించుకోవడంతో అడవి కుక్కలు నిరాశగా వెళ్లిపోయాయి.
- ఎఫ్–6 (పులి) రాత్రి వేళ స్వేచ్ఛగా సంచరించడం స్పష్టంగా కన్పించింది.
- ఇలాంటి అనేక వీడియోలు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో కెమెరాల్లో రికార్డయ్యాయి.

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో ఎలక్ట్రానిక్-ఐ నిఘా వ్యవస్థ

- పులులు, ఇతర వన్యప్రాణుల ప్రతి కదలిక పక్కాగా, స్పష్టంగా రికార్డ్
- కీలక ప్రదేశాల్లో 10 అత్యాధునిక కెమెరాలతో పర్యవేక్షణ
- ఇంటర్నెట్ నెట్‌వర్క్ లేనిచోట్ల రేడియో ఫ్రీక్వెన్సీతో 24 గంటల సర్వైలెన్స్
- ఎక్కడి నుంచైనా లైవ్‌లో వీక్షించే అవకాశం
- మరిన్ని ఏర్పాటు చేస్తే పూర్తిస్థాయిలో వన్యప్రాణులు, అటవీ సంరక్షణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 2,611 చ.కి.మీ పరిధిలో విస్తరించి పెద్దపులుల అభయారణ్యంగా పేరుగాంచిన అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్)లో పటిష్టపరిచిన ఎల్రక్టానిక్-ఐ (ఈ-కన్ను) నిఘా వ్యవస్థ సత్ఫలితాలనిస్తోంది. పెద్దపులులు, ఇతర వన్యప్రాణుల కదలికలు తెలుసుకునేందుకు, వాటి సంరక్షణకు.. అటవీ ఆక్రమణలు, జంతువుల వేట, కలప స్మగ్లింగ్‌ను అడ్డుకునేందుకు బాగా ఉపయోగపడుతోంది. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కొంతకాలం క్రితమే ప్రయోగాత్మకంగా ఏటీఆర్‌లో అధికారులు ప్రారంభించారు. ప్రస్తుతానికి పది కెమెరాలను వినియోగంలోకి తీసుకురాగా.. పులులు, ఇతర జంతువులకు సంబంధించి వచ్చిన లైవ్ వీడియోలు, ఫొటోలు అబ్బురపరిచే విధంగా ఉన్నట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

ఎక్కడినుంచైనా పర్యవేక్షణ

క్షేత్రస్థాయిలో పెద్దసంఖ్యలో అటవీ సిబ్బందిని నియమించాల్సిన అవసరం లేకుండా, కీలకమైన, క్లిష్టమైన ప్రదేశాల్లో వారానికి ఏడు రోజులు 24 గంటల పాటు (24/7) కచ్చితత్వంతో అటవీ ప్రాంతాన్ని పర్యవేక్షించేందుకు దీని ద్వారా వీలు కలిగింది. సాఫ్ట్‌వేర్ ఆధారిత వ్యవస్థ ద్వారా పనిచేసే ఈ విధానంలో... వివిధ సెన్సిటివ్ జోన్లలో హై రెజల్యూషన్ థర్మల్, ఇన్‌ఫ్రారెడ్ కెమెరాల ద్వారా మనుషులు, పులుల కదలికలను రికార్డ్ చేశారు. ఉన్నతాధికారుల సెల్‌ఫోన్‌కు జంతువుల కదలికలు, ఇతర ఘటనలకు సంబంధించిన అలర్ట్‌లు, నోటిఫికేషన్లు వచ్చే సాంకేతికతను ఏర్పాటు చేశారు.

రేడియో ఫ్రీక్వెన్సీతో ఇంటర్నెట్ అనుసంధానం

అడవిలో ఇంటర్నెట్ నెట్‌వర్క్ కవర్ కాని చోట్ల రేడియో ఫ్రీక్వెన్సీతో 360 డిగ్రీల పరిధిలో 24 గంటల సర్వైలెన్స్ ద్వారా పులులు, వన్యప్రాణుల కదలికల్ని గమనిస్తూ పర్యవేక్షించగలుగుతున్నారు. రేడియో ఫ్రీక్వెన్సీ నెట్‌వర్క్ నుంచి ఇంటర్నెట్‌కు దృశ్యాలు కన్వర్టయ్యే స్ట్రీమింగ్‌తో ఎక్కడి నుంచైనా లైవ్‌లో మానిటర్ చేసే అవకాశాలుండడం అధికారులకు ఉపకరిస్తోంది. అడవుల్లో మొబైల్ టవర్లు నెలకొల్పలేని మారుమూల అటవీ ప్రాంతాల్లో, సిగ్నల్స్ లేనిచోట రేడియో వేవ్ కమ్యూనికేషన్ ద్వారా...ఇంటర్నెట్ ఓవర్ రేడియో (ఐవోఆర్‌ఏ) విధానం ద్వారా వాకీటాకీలు పనిచేసేలా వ్యవస్థను రూపొందించారు.

ఐటీ శాఖతో చర్చలు

ఫారెస్ట్ కోడ్ ప్రకారం బీట్ ఆఫీసర్లు నెలలో 26 రోజుల పాటు రాత్రి వేళ అడవిలో తిరగాలి. టేకు చెట్లను కొట్టినా, అడవి నరికినా వాటిని వారు గుర్తించిపై అధికారులను అలర్ట్ చేయాలి. ప్రస్తుతం ఈ-ఐ ఏర్పాటుతో వీరి పని సులభంగా మారింది. ప్రస్తుతం ఏటీఆర్‌లో ఈ వ్యవస్థను మరింత విస్తృతం చేసే ఆలోచనతో అధికారులున్నారు. పైలెట్ ప్రాజెక్ట్ స్థాయిలో చేసేందుకు తెలంగాణ ఐటీశాఖతో ఏటీఆర్ అధికారులు చర్చలు జరిపినట్టు సమాచారం. ప్రస్తుతం పది కెమెరాలతోఏర్పాటు చేసిన విధానం వల్ల పరిమితంగానే అడవి కవర్ అవుతోంది. దీనిని మరింత విస్తృత పరచడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వంద నుంచి రెండువందల దాకా కెమెరాలు ఏర్పాటు చేస్తే బావుంటుందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో వాచ్ టవర్‌కు అడ్వాన్స్‌డ్ కెమెరా కోసం రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థ కోసం రూ.50 లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఏటీఆర్‌కు దాదాపు వంద ఎంట్రీ పాయింట్లు ఉన్నందున, రెండువందల కీలక ప్రదేశాల్లో కెమెరాలు ఏర్పాటు చేస్తే దేశంలోనే పటిష్టమైన నిఘా వ్యవస్థ కలిగిన టైగర్ రిజర్వ్‌గా దీనిని తీర్చిదిద్దవచ్చునని చెబుతున్నారు.

అడవిలో కదలికలన్నీ తెలిసిపోతున్నాయ్..



వన్యప్రాణుల సంరక్షణకు ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు. ఈ–ఐ కెమెరాలతో అడవిలో ఏం జరుగుతోందో తెలిసిపోతోంది. జంతువుల కదలికలను స్పష్టంగా చూడగలుగుతున్నాం. లోతైన లోయలు, కొన్ని ఇతర ప్రాంతాల్లో పర్యవేక్షణ చాలా కష్టంగా ఉంటుంది. వాకీటాకీలు పనిచేయని పరిస్థితులుంటాయి. ఇంటర్నెట్ ఓవర్ రేడియో విధానం ద్వారా మొబైల్ సిగ్నల్స్ లేకపోయినా సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునేందుకు అవకాశం ఉంటుంది.

– రోహిత్ గొప్పిడి, డీఎఫ్‌వో, నాగర్‌కర్నూల్ జిల్లా

ముగ్గురు బిడ్డలను రోడ్డుపై వదిలేసి..

- ప్రియుడితో వెళ్లిపోయిన మహిళ
- కన్న బిడ్డలపై తల్లి కర్కశత్వం
- యాదగిరిగుట్టలో ఆలస్యంగా వెలుగులోకి
- అధికారుల సంరక్షణలో చిన్నారులు



అధికారులు, పోలీసుల వద్ద చిన్నారులు

యాదగిరిగుట్ట: అమ్మతనానికి ఓ తల్లి మాయని మచ్చ తెచ్చింది. పేగు తెంచుకుని పుట్టిన ముగ్గురు చిన్నారులను నడిరోడ్డుపై వదిలేసి ప్రియుడితో కలసి వెళ్లిపోయింది. ఎముకలు కొరికే చలిలో ఆ చిన్నారులు తల్లి కోసం రోదిస్తూ పడిన వేదన వర్ణనాతీతం. చివరకు పోలీసులు పిల్లలను చేరదీసి బాలల పరిరక్షణ అధికారులకు అప్పగించారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన లక్ష్మి పన్నెండేళ్ల క్రితం బాబుని ప్రేమించి వివాహం చేసుకుంది. కానీ తరచూ గొడవల కారణంగా లక్ష్మి భర్త బాబు.. మూడేళ్ల క్రితం కుటుంబాన్ని వదిలి వెళ్లిపోయాడు. అప్పటికే వీరికి లక్ష్మణ్ (8), రాజేశ్వరి (7), రేవంత్ (5) అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్త వెళ్లిపోవడంతో లక్ష్మి.. పిల్లలను చూసుకుంటూ చిన్న చిన్న పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. ఈ క్రమంలో అక్కడే నివాసం ఉండే ఓ ఆటో డ్రైవర్‌తో లక్ష్మికి పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారడంతో అతడితో సహజీవనం చేస్తోంది.

పిల్లలు అడ్డుగా ఉన్నారని..

ఆటో డ్రైవర్ రాజుతో సహజీవనం చేస్తున్న తరుణంలో లక్ష్మి తన ముగ్గురు పిల్లల అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుంది. అందులో భాగంగానే ఈ నెల 14వ తేదీన ఆటో డ్రైవర్ రాజుతో కలసి యాదగిరిగుట్టకు వచ్చింది. ఆ రోజు రాత్రి తమతో వచ్చిన ముగ్గురు పిల్లలను యాదగిరిగుట్ట పట్టణ పరిసరాల్లో వదిలేసి.. లక్ష్మి, ఆటో డ్రైవర్ రాజుతో కలసి వెళ్లిపోయింది. దీంతో ఎముకలు కొరికే చలిలో ఆ రోజు రాత్రంతా ముగ్గురు పిల్లలు పట్టణంలోనే ఏడుస్తూ ఉండి పోయారు. మరుసటి రోజు ఉదయం యాదాద్రి కొండపైకి వెళ్లే మార్గంలోని పార్కింగ్ వద్ద చిన్నారులు ఏడుస్తూ తిరుగుతుండగా.. ట్రాఫిక్ కానిస్టేబుల్ కోటి వీరిని గమనించి పట్టణ పోలీస్ స్టేషన్‌లోని ఎస్‌ఐ సుధాకర్‌రావు దగ్గరకు తీసుకెళ్లాడు. అక్కడ ఎస్‌ఐ పిల్లలకు టిఫిన్ చేయించి, వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సంబంధం లేదన్న పెదనాన్న

ఈ నేపథ్యంలో అధికారులు చిన్నారులను ఈ నెల 17వ తేదీన భువనగిరిలో విచారించారు. తల్లి తమను యాదగిరిగుట్టలో వదిలేసి మరో వ్యక్తిని వివాహం చేసుకొని వెళ్లిపోయిందని పిల్లలు తెలిపారు. దీంతో చిన్నారుల పెదనాన్న జంగయ్యకు ఫోన్ చేసి భువనగిరికి పిలిపించగా జంగయ్య.. ఆ పిల్లలతో తమకు సంబంధం లేదని చెప్పి వెళ్లిపోయినట్టు తెలిసింది. ప్రస్తుతం ఐదేళ్ల రేవంత్ రంగారెడ్డి శిశు గృహంలో, మరో ఇద్దరు పిల్లలు రాజేంద్రనగర్‌లోని చైల్డ్‌కేర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఉన్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సైదులు, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ జయశ్రీ వెల్లడించారు.

ఇక శనివారాల్లోనూ వీసా అపాయింట్‌మెంట్లు

సాక్షి, హైదరాబాద్: తొలిసారిగా వీసా కోసం దరఖాస్తు చేసుకున్నవారి నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు ఢిల్లీలోని యూఎస్ ఎంబసీతోపాటు ముంబై, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్లు శనివారం ప్రత్యేక ఇంటర్వ్యూలకు చర్యలు చేపట్టాయి. వ్యక్తిగత ఇంటర్వ్యూల నిర్వహణ కోసం ఈ నెల 21న తమ కార్యకలాపాలను ప్రారంభించాయి. రాబోయే నెలల్లో సైతం ఎంపిక చేసిన శనివారాల్లో వీసా అపాయింట్‌మెంట్ల కోసం అదనపు స్లాట్‌లను జారీ చేయనున్నట్టు న్యూఢిల్లీలోని యూఎస్ ఎంబసీ ఒక ప్రకటనలో తెలిపింది. వీసాల ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంచేందుకు 2023 జనవరి–మార్చి మధ్యకాలంలో వాషింగ్టన్, ఇతర ఎంబసీల నుంచి డజన్ల మంది అధికారులు భారతదేశానికి రానున్నారు. ఇటీవల భారతదేశంలో 2.50 లక్షలకుపైగా అదనపు బీ1/బీ2 వీసా అపాయింట్‌మెంట్లను జారీ చేసింది. అదనపు అపాయింట్‌మెంట్ల జారీకి ముంబైలోని కాన్సులేట్ వారపు పనివేళలను పెంచింది. వేసవి నాటికి దేశంలోని యూఎస్ ఎంబసీ, కాన్సులేట్లు పూర్తిస్థాయి సిబ్బందితో కోవిడ్–19 మహమ్మారికి ముందునాటి స్థాయిలో వీసాల ప్రాసెసింగ్ చేపడతాయని న్యూఢిల్లీలోని యూఎస్ ఎంబసీ ఆశాభావం వ్యక్తం చేసింది.

వైభవంగా ‘వసంత’ వేడుక



బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం

- ఆలయం తరపున ఉచిత పార్కింగ్
- వేకువజామున 3 గంటల నుంచే అక్షరాభ్యాసాలు
- చలువపందిళ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నాం
- భక్తులకు పాలు, పండ్లు పంపిణీ చేస్తాం
- ‘సాక్షి’తో ఈవో విజయరామారావు

భైంసా(ముధోల్): వసంత పంచమి పురస్కరించుకుని బాసర సరస్వతీ అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో విజయరామారావు పేర్కొన్నారు. వసంత పంచమి ఏర్పాట్లపై ఆదివారం ‘సాక్షి’తో మాట్లాడారు. ఈ నెల 24, 25, 26 తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహించనున్న వేడుకలకు ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 26న గురువారం తెల్లవారుజామున మూడుగంటల నుంచే అక్షరాభ్యాసాలు ప్రారంభమవుతాయన్నారు. గతేడాది 2,800 అక్షరాభ్యాస పూజలు జరిగాయని, ఈసారి మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. కోటి గాజుల మండపం, టీటీడీ ఖాళీస్థలంలో భక్తులు సేదదీరేందుకు తడకల పందిళ్లు ఏర్పాటు చేస్తున్నామని, క్యూలో ఉన్న భక్తులకు పాలు, పండ్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.



విజయరామారావు, ఆలయ ఈవో



సరస్వతీ అమ్మవారు

బాసరకు వచ్చే భక్తులకు ఆలయ భూముల్లో ఉచిత పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నాం. అన్నదాన భవనం పక్కన ఖాళీస్థలంలో, గోదావరి నది నుంచి ఆలయానికి వచ్చే మార్గంలో, శ్రీరామ లాడ్జి ముందున్న ఖాళీ స్థలాల్లో ఉచితంగా వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నాం. ఈ మూడు మార్గాల్లో వచ్చే భక్తులు వాహనాలను అక్కడే ఉంచి దర్శనానికి రావాల్సి ఉంటుంది. వసంత పంచమి రోజున రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

అందరినీ ఆహ్వానించాం

వసంత పంచమి వేడుకలకు రావాలని రాష్ట్ర ప్రముఖులను ఆహ్వానించాం. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు పలువురు అధికారులు, ప్రముఖులకు ఆలయం తరపున ఆహ్వాన పత్రికలు అందించాం. మూడు రోజుల పాటు జరిగే వసంత పంచమి వేడుకల్లో భక్తులంతా సరస్వతీ అమ్మవారిని దర్శించుకుని ప్రశాంతంగా వెళ్లేలా అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి.

సమీక్ష నిర్వహించాం

ఇప్పటికే ఆలయ సిబ్బంది, ఆయాశాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించాం. భక్తుల కోసం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నాం. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. గోదావరి స్నానఘట్టాల వద్ద గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంటారు. గోదావరిలో నీరు ఎక్కువగా ఉన్నందువల్ల భక్తులకు ప్రమాద హెచ్చరికలు తెలియజెప్పేలా సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నాం.

ప్రత్యేక అలంకరణ

జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని పూలతో సుందరంగా తీర్చిదిద్దనున్నాం. ఆలయ గోడలు, గోపురాలు, స్వాగత తోరణాలు విద్యుత్ దీపాలతో అలంకరించి కొత్తశోభ సంతరించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. గోదావరి స్నానఘట్టాల వద్ద ప్రత్యేక లైట్లు, వ్యాసమహర్షి, మహంకాళి ఆలయం వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయనున్నాం.

అమ్మవారి నాణేలు సిద్ధం

బాసర వచ్చే భక్తులకు జ్ఞాన సరస్వతీ అమ్మవారి నాణేలు సిద్ధంగా ఉంచాం. రూ.40, రూ.70లతో వేర్వేరుగా నాణేలు ఆలయ ప్రాంగణంలో విక్రయించనున్నారు. రూ.150 లకు సరస్వతీ అమ్మవారి క్యాలెండర్ కొనుగోలు చేసుకోవచ్చు. బెల్లం లడ్డూలు సైతం తయారు చేయిస్తున్నాం. అధికంగా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు విన్నవించాం.

‘హిమాలయ’మంత అభిమానం



సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనప్ప చిత్రపటంతో సాయిరామ్‌రెడ్డి

కౌటాల: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సేవా కార్యక్రమాలకు ముగ్ధుడైన యువకుడు ఎమ్మెల్యేపై అభిమానాన్ని హిమాలయాలపై చాటుకున్నాడు. ఎమ్మెల్యే కీర్తిని దేశవ్యాప్తం చేయాలన్న సంకల్పంతో ఆయన చిత్రపటంతో హిమాలయాల్లోని 12,500 మీటర్ల ఎత్తయిన కేదారికంఠ కొండను అధిరోహించాడు. కౌటాల మండలం ముత్తంపేటకు చెందిన కారెం సాయిరాంరెడ్డి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చేస్తున్న నిత్యాన్నదానం, నిరుద్యోగులకు ఉచిత కోచింగ్, కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కార్యక్రమాలను దేశంలో అందరికీ తెలియజేయాలనే ఉద్దేశంతో హిమాలయాలు ఎక్కాలని నిర్ణయించుకున్నాడు. హైదరాబాద్‌కు చెందిన 20 మందితో కలిసి ఈనెల 16న ఢిల్లీ వెళ్లారు. 17న డెహ్రాడూన్, సాంక్రి చేరుకున్నాడు. 18న ఉదయం సాంక్రి నుంచి బయలుదేరి హిమాలయాలలో దాదాపు 20 కిలో మీటర్లు ప్రయాణం చేసి 12,500 అడుగుల ఎత్తులోని కేదారికంఠను అధిరోహించారు. హిమాలయాలపై జాతీయ జెండాతోపాటు, ఎమ్మెల్యే కోనప్ప చిత్రపటం ప్రదర్శించారు. దీంతో తన ఆకాంక్ష నెరవేరిందని సాయిరాంరెడ్డి ‘సాక్షి’కి ఫోన్‌లో తెలిపాడు.

ఎగువన నీళ్లు.. దిగువన కన్నీళ్లు



జలకళతో రాళ్లవాగు ప్రాజెక్టు



భూషణరావుపేట శివారులో నీళ్లు లేక బీటలువారిన వరి పొలం

- రాళ్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతుల పరిస్థితి
- ఇష్టారాజ్యంగా తూము గేట్లు తిప్పుతున్నా పట్టించుకోని అధికారులు
- వరి పంట ఎండిపోతోందని ఆవేదన

కథలాపూర్(వేములవాడ): నిజామాబాద్–జగిత్యాల జిల్లాల సరిహద్దులోని కథలాపూర్ మండలం భూషణరావుపేట రాళ్లవాగు ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లు ఉన్నాయి. అయినా, ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. ప్రాజెక్టు కుడి కాలువ గేట్లను కొందరు ఇష్టానుసారంగా తిప్పి నీటిని వదలడం, బంద్ చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీనిని నియంత్రించాల్సిన నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు ఉన్నాయి.

3,500 ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం

- రాళ్లవాగు ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లుంటే.. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పెల్లి మండలం కోనాపూర్, కథలాపూర్ మండలం భూషణరావుపేట, ఊట్‌పెల్లి, కథలాపూర్, మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ పరిధిలోని 3,500 ఎకరాలకు నీళ్లందించడం లక్ష్యం.
- ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిశాయి. అయినా,చివరి ఆయకట్టుకు నీరందడంలేదు.
- ఇందులో అంతర్యమేమిటో అధికారులకు, ప్రజాప్రతినిధులకే తెలియాలని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాజెక్టు నిజామాబాద్ జిల్లాలో... కాలువలు జగిత్యాల జిల్లాలో..

రాళ్లవాగు ప్రాజెక్టు నిజామాబాద్ జిల్లా బాల్కొండ డివిజన్ పరిధిలో ఉంది. దానికాలువలు జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలో ఉన్నాయి. ప్రాజెక్టు కుడికాలువ గేట్‌ను ఇష్టమొచ్చినట్లు కొందరు రైతులు తిప్పి కోనాపూర్ గ్రామాల భూములకు నీళ్లందేలా చూస్తున్నారు. ఆ తర్వాత గేట్లు బంద్ చేస్తున్నట్లు మిగతా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని నీటిపారుదలశాఖ అధికారులు పలుమార్లు గుర్తించినా బాధ్యతలపై చర్యలు తీసుకోలేదనే విమర్శలున్నాయి. ఏటా యాసంగిలో వరికి నీళ్లందించే విషయంలో రైతుల మధ్య వివాదాలు నెలకొంటున్నాయి. రెండు జిల్లాల నీటిపారుదల శాఖ అధికారులు చర్చించి తాత్కాలికంగా పరిష్కారం చూపిస్తూ ఏళ్లతరబడి నెట్టుకురావడంతో ఈ దుస్థితి నెలకొందని ఆయకట్టు రైతులు మండిపడుతున్నారు.

ఎండుతున్న వరి పంట

- రాళ్లవాగు ప్రాజెక్టును నమ్ముకొని ఈ యాసంగిలో కథలాపూర్ మండలం భూషణరావుపేట, ఊట్‌పెల్లి పరిధిలో సుమారు 1,000 ఎకరాలు, కోనాపూర్ పరిధిలో సుమారు 500 ఎకరాల్లో వరి సాగు చేశారు.
- ప్రాజెక్టు కుడికాలువ గేట్ ద్వారా రోజూ నీళ్లు వదిలి రెండు గంటల తర్వాత బంద్ చేస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు.
- నిబంధనలకు విరుద్ధంగా గేట్లు బంద్ చేయడం, వదలడం చేస్తున్నా అధికారులు చోద్యం చూస్తుండటంతో వరి పంట ఎండే పరిస్థితి దాపురించిందని భూషణరావుపేట, ఊట్‌పెల్లి, కథలాపూర్ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- రెండు జిల్లాల అధికారులు చొరవ చూపి రాళ్లవాగు ప్రాజెక్టు ఆయకట్టుకు నీళ్లందించి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

మంత్రి, ఎమ్మెల్యే స్పందిస్తేనే పరిష్కారం



రాళ్లవాగు ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లున్నయి. నాకున్న ఆరెకరాల్లో వరి ఏసిన. యాసంగి ఆరంభంలో కాలువ నీళ్లు వచ్చినియ. ఇప్పుడు చుక్కలేదు. గేట్‌ను ఇష్టమొచ్చినట్లు తిప్పుతున్నారు. అధికారులకు తెలిసినా పట్టించుకుంటలేరు. రాష్ట్రమంత్రి ప్రశాంత్‌రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబులు చొరవ తీసుకుంటే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. యాసంగి పంటలు గట్టెక్కుతాయి.

– బోడ మాదవరెడ్డి, రైతు


మూడెకరాల్లో పంట ఎండింది



ఎప్పటిలాగే ఈ యాసంగింలో నాలుగు ఎకరాల్లో వరి వేసిన. ప్రాజెక్టు కుడికాలువకు కొన్నిరోజులు నీళ్లు వచ్చినయి. 10 రోజులుగా రావడంలేదు. రెండు బోరుబావులు ఎండిపోయినయి. నీళ్లు అందక మూడెకరాల్లో వరి పొలం బీటలు వారింది. కాలువలో నీళ్లు వచ్చేలా చూసి పంట కాపాడాలె.

– గుగ్లోత్ చిన్నయ్య, రైతు, భూషణరావుపేట

చివరి ఆయకట్టుకు అందుతాయి



రాళ్లవాగు ప్రాజెక్టును ఇటీవల పరిశీలించాం. ప్రాజెక్టులో పంటలకు సరిపడా నీళ్లున్నాయి. కాలువద్వారా ఈ సీజన్‌లో చివరి ఆయకట్టుకు నీళ్లందించే వీలుంది. కొందరు రైతులు గేట్లను ఇష్టమొచ్చినట్లు తిప్పుతుండటంతో సమస్య తలెత్తింది. ప్రాజెక్టు బాల్కొండ డివిజన్‌లో ఉండటంతో అక్కడి ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడాం. ఉన్నతాధికారుల దృష్టికి సమస్య ను తీసుకెళ్లాం.

– రవికుమార్, డీఈ, నీటి పారుదల, వేములవాడ

కోనాపూర్ వరకే నీళ్లు

రాళ్లవాగు ప్రాజెక్టును పరిశీలించాం. యాసంగిలో కోనాపూర్ శివారు భూముల వరకే నీళ్లు సరిపోతాయి. అందుకోసం ప్రతీరోజు కొద్దిగా నీళ్లు వదిలి బంద్ చేయిస్తున్నాం. చివరి ఆయకట్టు వరకు నీళ్లందిస్తే ప్రాజెక్టులో నీళ్లు అడుగంటిపోతాయి. అందుకోసమే కొద్దిగా నీళ్లు వదిలిపెడుతున్నాం.

– నాగేశ్, డీఈ, నీటి పారుదల, బాల్కొండ డివిజన్, నిజామాబాద్

సన్నిధి

మంచి మాట

పని చెయ్యడం ఒక వేడుక

ఫలితం రావడానికి పనిచెయ్యడం ప్రాతిపదిక. ప్రయత్నం పని చెయ్యడానికి ప్రాతిపదిక. ఏ పరిణామానికైనా ప్రయత్నం, పని చెయ్యడం ఉండాలి. ప్రయత్నంతో పని చెయ్యడానికి మనిషి పూనుకోవాలి; ప్రయోజనకరమైన ఫలితాలను సాధించాలి.

'తప్పులు జరుగుతాయన్న భయంతో పని మొదలుపెట్టకపోవడం చెడ్డవాడి లక్షణం; అజీర్ణం అవుతుందనే భయంవల్ల భ్రాంతిలో ఎవరు భోజనాన్ని వదిలేస్తారు? అని హితోపదేశం మాట. తప్పులు జరుగుతాయని పని చెయ్యకపోవడం నేరం. పని చెయ్యడం గురించి ఓషో ఇలా చెప్పారు...

జీవితం అన్నది బాధ్యతలతో మాత్రం పని చెయ్యడమా? లేదా వేడుకలో పాలుపంచుకోవడమా? పని చెయ్యడం మాత్రమే జీవితం అయితే జీవితం ఇబ్బందికరమైనదై ఇరుకైందిగా మారిపోతుంది. బరువెక్కిన హృదయంతో జీవించాల్సి వస్తుంది. కృష్ణుడు పని చెయ్యడం మాత్రమే బాధ్యతగా జీవించినవాడు కాదు. జీవితాన్ని ఒక వేడుకగా; ఒక ఉత్సవంగా మార్చుకున్నవాడు. జీవితం ఇంట్లో చదువుకునే పాఠం కాదు. జీవితాన్ని ఒక ఉత్సవంగా మార్చుకోవడం వల్ల ఎవరూ జీవితాన్ని కోల్పోవడం లేదు. పని చెయ్యి; ఆ పనిని వేడుకలాగా మార్చెయ్యి. అప్పుడు పని కూడా ఆట పాటల సంకలనంగా మారిపోతుంది. అందువల్ల చిన్నపని కూడా నిండుగా ఉంటుంది. పని సౌందర్యాత్మకం అవుతుంది.

పనికి బానిసలుగా మారినవాళ్ల గురించి మీకు తెలిసి ఉంటుంది. పని చెయ్యడం కోసం జీవించేవాళ్లు ఉద్రిక్తతలో జీవించాల్సి వస్తుంది. పని పిచ్చివాళ్లైనవాళ్లు జీవించడాన్ని ఒక కర్మాగారంగా మార్చేసు కుంటున్నారు.'చెయ్యి లేదా చచ్చిపో' అని ఘోషిస్తున్నారు. పని చెయ్యడం తప్పితే మరో కోణం వాళ్లకు తెలీదు. వాస్తవానికి వాళ్లకు పని చెయ్యడానికి ప్రయోజనం ఏమిటో తెలియదు.

జీవితం అన్నది ఒక వేడుక. మనం పని చెయ్యడం నాట్యం చేస్తున్నట్టు ఉండాలి. పని చెయ్యడం ద్వారా వేడుకను తీసుకురావాలి. కఠినమైన జీవితాన్ని తలుచుకుంటూ ఉంటే పాడడానికీ, ఆడడానికీ, వేడుక చేసుకోవడానికీ సమయం లేకుండా పోతుంది. జీవితం ఇంటికీ, కార్యాలయానికీ మధ్యలో ఆగిపోతుంది. ఈ రెండు ప్రదేశాల మధ్యలో ముళ్లకంచెను ఏర్పరుచుకుని మానసికంగా మీరు బాధకు గురి అవుతున్నారు. ఒక రోజున జీవితంలో విశ్రాంతిని, ప్రశాంతతను అనుభవించాలని మీరు అనుకుంటారు. కానీ ఆ రోజు రాదు; పని పిచ్చివాళ్లు ఎప్పటికీ జీవితాన్ని వేడుక చేసుకోరు.

కృష్ణుడు జీవితాన్ని ఉత్సవంగా మార్చుకున్నాడు. పువ్వులు, పక్షులు, ఆకాశ తారలు జీవితాన్ని వేడుక చేసుకుంటున్నాయి. మనిషి తప్పితే జీవరాశులన్నీ జీవితాన్ని వేడుక చేసుకుంటున్నాయి. పువ్వులు ఎందుకు పూస్తూ ఉన్నాయి? అని అడగండి. తారలు ఎందుకు ఆకాశంలో తేలుతున్నాయి? అని అడగండి. గాలి ఎందుకు ఒంటరిగా వీస్తోంది? అని అడగండి.



సూర్యుడికి కింద జీవిస్తున్నవి అన్నీ వేడుక చేసుకుంటున్నాయి. ప్రపంచమే వేడుక చేసుకుంటోంది. మనిషి కూడా ప్రపంచంలో భాగమే అని కృష్ణుడు చెబుతున్నాడు; వేడుక చేసుకోండి అని చెబుతున్నాడు.

ఏ పనీ చెయ్యకుండా వేడుక చేసుకోమని కృష్ణుడు చెప్పలేదు. గాలి పని చెయ్యకుండా వీచడం లేదు. తార ఒకేచోట నుంచుని వేడుక చేసుకోవడంలేదు. అది కదులుతూనే ఉంది. పువ్వులు పుయ్యడం కూడా పనే. అయితే వీటికి పని చెయ్యడం ముఖ్యం కాదు. వేడుక ముఖ్యం. వేడుక ముందు ఉంటుంది అదే సమయంలో అవి తమ బాధ్యతల్ని కూడా నెరవేరుస్తాయి. వేడుకకు కొనసాగింపే పని; జీవితమే ఒక ఉత్సవం.

పని చెయ్యడంలోని సౌందర్యాన్ని, పని చెయ్యడంవల్ల సత్ఫలితాన్ని మనిషి సొంతం చేసుకోవాలి. పని చేస్తూ మనిషి తన జీవితాన్ని ఉత్సవం చేసుకోవాలి.

– శ్రీకాంత్ జయంతి

గురువాణి



అభ్యాసానుసారిణీ విద్యా

అయినదానికీ కానిదానికీ అబద్ధం చెప్పడం అలవాటయితే... ఎన్ని పుణ్యకర్మలు చేసినా అనుభవించే యోగ్యత ఉండని స్థితికి చేరుకుంటాం. ఎంతగా నూనెపోస్తున్నా.. గాలి గట్టిగా వీస్తుంటే దీపం ఎలా వెలుగుతుంది! అందుకే పెద్దలు చెబుతారు ''సత్యానుసారిణీ లక్ష్మీ – కీర్తిః త్యాగానుసారిణీ/అభ్యాసాను సారిణీ విద్యా – బుద్ధిః కర్మానుసారిణీ''అని. సత్యం పలుకుతున్నంత కాలం లక్ష్మీదేవి కటాక్షం తనంతట తానుగా కలుగుతూనే ఉంటుంది. ప్రతిదానికీ అబద్ధం ఆడడం అంటే మన మనసు మోసం చేయడానికి అలవాటు పడిందని గుర్తు. అటువంటి మనసు ఉన్నప్పుడు సుఖాలు అనుభవించడానికి కావలసిన యోగ్యతను భగవంతుడు ఎలా అనుగ్రహిస్తాడు!

అందుకే శ్రీరామచంద్రమూర్తి అంటాడు ''సత్యమేవేశ్వరో లోకే సత్యం పద్మాశ్రితా సదా/ సత్యమూలాని సర్వాణి సత్యాన్నాస్తి పరం పదమ్.'' అంటే సత్యమే భగవంతుడని. మన సంపదలన్నీ దాన్ని ఆశ్రయించే ఉన్నాయంటున్నాడు. అయితే ఒక్కొక్కసారి ఉపద్రవం వస్తుంటుంది. అప్పుడు కూడా సత్యమే చెప్పండి ..అని శాస్త్రాలు చెప్పలేదు. 80వేల మంది కింకరులు యుద్ధానికి వెళ్ళేముందు అశోకవనాన్ని బంధించిన హనుమ ప్రతాపాన్ని చూసి.. సీతమ్మ దగ్గరకు వెళ్ళి..'సీతమ్మా! ఇప్పటివరకు నీతో కిచకిచలాడిన వానరం అశోక వనాన్ని బంధించింది. ఆ వానరం ఎందుకొచ్చింది, నీతో ఏం మాట్లాడింది'' అని అడిగారు.

''పాముకు ఎన్ని కాళ్ళున్నాయో, ఎలా ముందుకుపోతున్నదో మరో పాముకు మాత్రమే తెలుస్తుంది. మీ రాజ్యంలోకి ఎవరు వచ్చారో, మీ వనాన్ని బంధించడానికిఎవరొచ్చారో మీకే తెలియాలి. నాకెలా తెలుస్తుంది..'' అన్నది. అంటే ఆమె అబద్ధం చెప్పినట్లేనా! కావచ్చు కానీ తన క్షేమం కోరి, తన భర్త తరఫున దూతగా వచ్చిన వ్యక్తి ప్రాణానికి ప్రమాదం కలుగకుండా చూడడానికి అలా చెప్పవలసి వచ్చింది. ప్రాణ రక్షణకు, ప్రాణి రక్షణకు అలా చెప్పినప్పుడు దోషం అన్వయం కాదు. ఇటువంటి ధర్మసూక్ష్మాలను తెలుసుకొని ప్రవర్తించాలి. దీనిని సాకుగా తీసుకొని ప్రతిదానికీ అబద్ధం ఆడడం మంచిది కాదు.అబద్ధాలాడడాన్ని తప్పుగా భావించి ప్రయత్నపూర్వకంగా సత్యం పలకడం అలవాటు చేసుకోవాలి.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అభ్యాసానుసారిణీ విద్యా... ఎంతగా శ్రమించి అభ్యసిస్తే చదువు అంత బాగా ఒంటపడుతుంది. అభ్యాసం అంటే స్మరిస్తూ, మననం చేస్తూ ఉండాలి. అప్పుడే విద్య మనకు కరతలామలకం అవుతుంది.

సువార్త



రెండంతల ఆశీర్వాదం

పూర్వము కలిగిన దానికంటే రెండంతలు అధికముగా యెహోవా అతనికి దయచేసెను (యోబు 42:10). ఊజు దేశములో యోబు అనే భక్తుడు నివసించేవాడు. అతని ప్రవర్తన గురించి చాలా చక్కగా బైబిల్‌లో రాయబడింది. చెడుతనాన్ని విసర్జించిన వ్యక్తిగా అతని గూర్చి చేయబడిన పరిచయం విలక్షణమైనది. దేవునియందు భయభక్తులు కలిగి జీవించుటలో ఎన్నడు వెనకడుగు వేయలేదు. ఒక పక్క దేవునితో సహవాసం మరొక పక్క అనేకులకు సహాయపడే మనస్తత్వం కలిగినవాడు. ఉన్నతమైన ఆశీర్వాదాలతో కొనసాగుచున్న తన జీవితంలో అకస్మాత్తుగా శ్రమలు ఓ ప్రవాహం వలె పొర్లుకొని వచ్చాయి.

యోబు పొందిన శ్రమలు వర్ణనాతీతం. అన్ని విధాలుగా అపవాది యోబును శోధించినప్పటికి అంతిమ విజయాన్ని మాత్రం యోబు పొందుకున్నాడన్నది లేఖన సత్యం. శ్రమలు దొమ్మీగా మన మీద పడుతున్నప్పుడు వాటికి ఎలా స్పందించాలో, ఆ పరిస్థితులలో ఎలా ప్రవర్తించాలో యోబు నుండి చాలా నేర్చుకోవచ్చు. దేవుడు యోబును రెండంతలుగా ఆశీర్వదించడంలో ఆయనకున్న దివ్య ప్రణాళికల ఔన్నత్యాన్ని తెలియచేస్తుంది. కొన్ని కొన్ని సార్లు మనకు అర్థం కాని శ్రమలను సయితం దేవుడే మన జీవితాల్లో అనుమతిస్తాడు. అటువంటి సందర్భాల్లో మనం కృంగిపోకుండా ఉండగలిగితే విజయ తీరాలకు చేరుకోగలము. శ్రమల్లో మనం చాలా పాఠాలు నేర్చుకోవాలని, విశ్వాసంలో ఇంకా ఇంకా బలపడాలని దేవుడు ఆశిస్తున్నాడు. ఒక్కమాటలో చెప్పాలంటే మన శ్రమల్లోనే మన విశ్వాస జీవిత పటిష్టత బహిర్గతమౌతుంది.

క్రైస్తవ జీవితంలో కొన్నిసార్లు వచ్చి పడే శ్రమలు విశ్వాసిని నిలబెట్టడానికే గానీ పడగొట్టడానికి కాదు. శ్రమల్లో అందరూ విడిచిపెట్టి వెళ్లిపోవచ్చు లేదా నిందించవచ్చు గానీ దేవుడు ఆ వ్యక్తిని చూచేవాడు, బలపరిచేవాడు. మేఘాలు వర్షించాలంటే అవి బద్దలవ్వాలి. భూమిలో వేసిన గింజ ఫలించాలంటే అన్నిటికంటే ముందుగా అది పగలాలి. దానిలో ఉన్న పైపొర పగిలినప్పుడు మొక్క మొలకెత్తుతుంది. అదేవిధంగా దేవుని కరుణా కటాక్షములతో రెట్టింపు ఆశీర్వాదం, రెండంతల దీవెనలు నీ స్వంతమౌతాయి.

– డా॥ జాన్ వెస్లీ, క్రైస్ట్ వర్షిప్ సెంటర్

ఇస్లాం వెలుగు

సంస్కరించే సిగ్గు

కొన్నిసార్లు మానవుడు పైశాచిక ప్రభావానికి లోనై దొంగతనం, అసత్యం, తాగుడు, జూదం, వ్యభిచారంలాంటి పాపాలకు ఒడిగడుతుంటాడు. నిజానికి ఇవన్నీ మానవ నైజానికి వ్యతిరేకమైనవి. దైవగ్రంథం ఇలాంటి కార్యాలను 'మున్కర్'అన్న పదంతో సంబోధించింది. అంటే పాపం, లేక దుష్కార్యం అని అర్థం. వీటిని మున్కర్ తో పోల్చడమంటే, ఇవి మానవ నైజానికి సరిపడనివి, వ్యతిరేకమైనవి అన్నమాట. నైజం అంగీకరించనప్పుడు పైశాచిక స్వభావం ఆ కార్యాలను చేయమని బలవంతం చేస్తుంది. అలాంటప్పుడు దుష్కార్యాలను అసహ్యించుకునే ఏదో ఒక వస్తువు మానవ స్వభావంలో ఖచ్చితంగా ఉండాలి. అందుకే దేవుడు, 'సిగ్గు'లేక 'బిడియం' అన్న పదార్థాన్ని మానవ స్వభావంలో ప్రవేశపెట్టాడు. ధార్మిక పరిభాషలో 'సిగ్గు'(బిడియం)అంటే, ఏదైనా పాపకార్యం వైపుకు మొగ్గేమనిషి స్వయంగా తన నైజం ముందు, తన ప్రభువు ముందు వ్యక్తంచేసే దాన్ని సిగ్గు అంటారు. సిగ్గు అనబడే ఈ శక్తే మానవులను అన్నిరకాల అశ్లీలతలు, దుర్మార్గాలనుండి కాపాడుతుంది. ఒకవేళ ఎప్పుడైనా, ఏదైనా పైశాచిక ప్రలోభానికి లోనై ఏదైనా పాపకార్యానికి పాల్పడితే, 'సిగ్గు' అనేది వారి మనసును కెలుకుతూ ఉంటుంది. పశ్చాత్తాపానికి లోను చేస్తుంది. ముహమ్మద్ ప్రవక్త (స) వారి బోధనల్లో కూడా సిగ్గుబిడియాల పరిధి చాలా విస్తృతంగా ఉంది. జీవితంలోని అన్నిరంగాలనూ అది పరివేష్టించి ఉంది. అందుకని దాంపత్య జీవితానికి సంబంధించి కూడా నైతిక సంస్కరణ విషయంలో సిగ్గు, బిడియాల పాత్రే ప్రధానం.

సిగ్గు అన్న విషయం స్వభావంలో ఉన్న మనిషి ఏ విధమైన అనైతిక కార్యకలాపాలకూ పాల్పడే అవకాశం ఉండదు. సిగ్గు అనేది లేనప్పుడు విచ్చలవిడితనం పెరిగిపోతుంది. అందుకే సిగ్గులేని చేష్టల్ని అందరూ అసహ్యించుకుంటారు. 'అలా ప్రవర్తించడానికి సిగ్గులేదూ?'అన్న మాటల్ని మనం తరచూ వింటూ ఉంటాం కూడా! ప్రవక్త మహనీయుల వారు పరస్త్రీతో చాలా జాగ్రత్తగా, వినమ్రంగా, గౌరవభావంతో మాట్లాడాలని, అమ్మతో మాట్లాడుతున్నప్పుడు, తోబుట్టువుతో మాట్లాడుతున్నప్పుడు ఎలాంటి భావన ఉంటుందో అదే భావన పరాయి మహిళల విషయంలో కూడా ఉండాలని స్పష్టంగా చెప్పారు. సిగ్గు బిడియాలన్నవి స్త్రీలకైనా, పురుషులకైనా పెట్టని ఆభరణాలని, వాటిని అలవరచుకోవాలని ఆయన సెలవిచ్చారు.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

సినిమా

ఆగస్టులో జైలర్?



రజనీకాంత్

వెండితెరపై 'జైలర్' రాక ఏప్రిల్ నుంచి ఆగస్టుకు మారిందా? అంటే అవుననంటోంది కోలీవుడ్. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'జైలర్'. ఈ చిత్రాన్ని ఏప్రిల్‌లో రిలీజ్ చేయడానికి చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ సన్నాహాలు చేస్తోందనే వార్తలు వచ్చాయి. తాజాగా ఆగస్టులో రిలీజ్ చేయాలని భావిస్తున్నారని సమాచారం. మణిరత్నం దర్శకత్వంలో భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న 'పొన్నియిన్ సెల్వన్ పార్ట్ 2' (ఏప్రిల్ 28 విడుదల) బాక్సాఫీస్ వసూళ్లకు ఇబ్బంది లేకుండా ఉండేలా 'జైలర్' టీమ్ స్నేహపూర్వకంగా ఏప్రిల్ రిలీజ్‌ను వాయిదా వేసుకుందని కోలీవుడ్ టాక్. అయితే ఈ విషయంపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది.



ప్రభాస్



మహేశ్‌బాబు



రామ్‌చరణ్



అల్లు అర్జున్



నాని



విజయ్ దేవరకొండ, సమంత



అఖిల్



అడివి శేష్



సమంత

'పాన్' కథాచిత్రమ్

'బాహుబలి'తో తెలుగు సినిమాలో మార్పు వచ్చింది. అప్పటివరకూ మన తెలుగు సినిమా తెలుగు ప్రేక్షకులకు నచ్చితే చాలన్నట్లు ఉండేది. అయితే 'బాహుబలి' తర్వాత తెలుగు సినిమా పాన్ ఇండియా రేంజ్‌కి ఎదిగింది. అందుకే ప్రస్తుతం 'పాన్ కథ'లకే ఇండస్ట్రీ మొగ్గు చూపుతోంది. ఈ ఏడాది తెలుగు నుంచి దాదాపు డజనుకి పైగా 'పాన్ ఇండియా' చిత్రాలు రానున్నాయి. ఇక ఈ 'పాన్ కథా చిత్రమ్' వివరాలు తెలుసుకుందాం.

'ధమాకా', 'వాల్తేరు వీరయ్య' (రవితేజ కీ రోల్ చేశారు) చిత్రాల సక్సెస్ జోష్‌లో ఉన్న రవితేజ చేస్తున్న తాజా చిత్రాల్లో 'టైగర్ నాగేశ్వరరావు' ఒకటి. స్టూవర్టుపురం దొంగగా చెప్పుకునే టైగర్ నాగేశ్వరరావు జీవితం ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు దర్శకుడు వంశీ. 1970 బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రం ఈ ఏడాదే రిలీజ్ కానుంది. అలాగే రవితేజ హీరోగా నటిస్తున్న మరో చిత్రం 'రావణాసుర' కూడా పాన్ ఇండియా రిలీజ్ అని తెలుస్తోంది. సుధీర్ వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ఏప్రిల్ 7న విడుదల కానుంది. మరోవైపు 'బాహుబలి' పాన్ ఇండియా సక్సెస్ తర్వాత ప్రభాస్ చేసే ప్రతి సినిమా పాన్ ఇండియా రేంజ్‌లో ప్రేక్షకుల ముందుకు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది మూడు పాన్ ఇండియా చిత్రాలతో ప్రభాస్ రానున్నారు. ప్రస్తుతం ప్రభాస్ హీరోగా 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న 'సలార్', దర్శకుడు ఓం రౌత్ తెరకెక్కించిన మైథలాజికల్ ఫిల్మ్ 'ఆదిపురుష్' ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. జూన్ 16న 'ఆదిపురుష్', సెప్టెంబరు 28న 'సలార్' రిలీజ్‌కి రెడీ అవుతున్నాయి. ఈ సినిమాలే కాకుండా ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో 'రాజా డీలక్స్' (అధికారిక ప్రకటన రావాల్సి ఉంది) అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం కూడా ఈ ఏడాదే పాన్ ఇండియా రిలీజ్‌గా థియేటర్స్‌లోకి వస్తుందనే టాక్ వినిపిస్తోంది. ఇక హీరో మహేశ్‌బాబు తాజా చిత్రం పాన్ ఇండియా రిలీజ్ కానుంది. 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా ఇది. ఫ్యామిలీ అండ్ ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఆగస్టు 11న ఈ చిత్రాన్ని రిలీజ్ చేసేలా సన్నాహాలు చేస్తున్నారు. ఇక పవన్ కల్యాణ్ నుంచి కూడా ఓ పాన్ ఇండియా చిత్రం రానుంది. క్రిష్ దర్శకత్వంలో పవన్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ ఫిల్మ్ 'హరిహర వీరమల్లు'. 17వ శతాబ్దం నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం వేసవిలో రిలీజ్ కానున్నట్లు తెలుస్తోంది. మరోవైపు శంకర్ దర్శకత్వంలో హీరో రామ్‌చరణ్ ఓ పాన్ ఇండియా మూవీ చేస్తున్నారు. రాజకీయాలు, ఐఏఎస్ ఆఫీసర్ల నేపథ్యంతో కూడిన ఈ యాక్షన్ ఫిల్మ్ ఈ ఏడాదే థియేటర్స్‌లోకి రానుంది. ఇంకోవైపు ఆల్రెడీ 'పుష్ప: ది రైజ్'తో పాన్ ఇండియా సక్సెస్ కొట్టిన అల్లు అర్జున్ ఇదే సినిమాకు కొనసాగింపుగా వస్తున్న 'పుష్ప: ది రూల్' సినిమాతో ప్రస్తుతం బిజీగా ఉన్నారు. దర్శకుడు సుకుమార్ తెరకెక్కిస్తున్న 'పుష్ప: ది రూల్' చిత్రం ఈ ఏడాది చివర్లో రిలీజ్ కానున్నట్లు తెలుస్తోంది. ఇక శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని హీరోగా నటించిన విలేజ్ బ్యాక్‌డ్రాప్ మాస్ ఫిల్మ్ 'దసరా' కూడా పాన్ లిస్ట్‌లో ఉంది. ఈ చిత్రం మార్చి 30న రిలీజ్ కానుంది. 'శాకుంతలం'తో సమంత కూడా పాన్ ఇండియా జాబితాలో చేరారు. దేవ్ మోహన్ ఓ లీడ్ రోల్ చేసిన ఈ మైథలాజికల్ లవ్‌స్టోరీకి గుణశేఖర్ దర్శకుడు. ఈ చిత్రం ఫిబ్రవరి 17న రిలీజ్ కానుంది. ఇంకోవైపు హీరో రామ్, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో పాన్ ఇండియా స్థాయిలో ఓ హై ఓల్టేజ్ యాక్షన్ ఫిల్మ్ రూపొందుతోంది. అలాగే అఖిల్ హీరోగా సురేందర్‌రెడ్డి తెరకెక్కిస్తున్న స్టైలిష్ యాక్షన్ మూవీ 'ఏజెంట్' వేసవి రిలీజ్‌కి రెడీ అవుతోంది. శివ నిర్వాణ దర్శకత్వంలో విజయ్‌దేవర కొండ-సమంతల పాన్ ఇండియా ప్రేమకథా చిత్రం 'ఖుషి' ఈ ఏడాది వెండితెరపై ప్రేమ కురిపించనుంది. అలాగే రంజిత్ జయకొడి దర్శకత్వంలో సందీప్ కిషన్ హీరోగా చేసిన గ్యాంగ్‌స్టర్ ఫిల్మ్ 'మైఖేల్' వచ్చే నెల 3న రిలీజ్ కానుంది. సాయిధరమ్‌తేజ్ హీరోగా కార్తీక్ దండు దర్శకత్వంలో రూపొందిన మిస్టిక్ థ్రిల్లర్ 'విరూపాక్ష' ఏప్రిల్ 21న విడుదల కానుంది. వరుణ్ తేజ్ కూడా పాన్ క్లబ్‌లో చేరారు. తెలుగు, హిందీ భాషల్లో శక్తికాంత్ దర్శకత్వంలో వరుణ్ ఓ పాన్ మూవీ కమిట్ అయ్యారు. ఇక 'గూఢచారి'కి సీక్వెల్‌గా అడివి శేష్ చేస్తున్న 'గూఢచారి 2' కూడా పాన్ ఇండియా రిలీజే. ఇంకా గ్యారీ బీహెచ్ దర్శకత్వంలో నిఖిల్ చేసిన స్పై థ్రిల్లర్ 'స్పై', తేజా సజ్జా హీరోగా దర్శకుడు ప్రశాంత్ వర్మ తీసిన అడ్వెంచరస్ మైథలాజికల్ ఫిల్మ్ 'హను మాన్' (మే 12న రిలీజ్) తదితర చిత్రాలు పాన్ ఇండియా రిలీజ్‌లుగా ఈ ఏడాదే రానున్నాయి.

మంచి కథకు పాటలు అవసరంలేదు - మహేశ్



సుధీర్‌బాబు హీరోగా, శ్రీకాంత్, 'ప్రేమిస్తే' ఫేమ్ భరత్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హంట్'. ఎస్. మహేశ్ దర్శకత్వంలో వి. ఆనంద ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఎస్. మహేశ్ మాట్లాడుతూ– ''ఓ యాక్సిడెంట్‌లో గతం మర్చిపోయే ఓ పోలీసాఫీసర్ తన గురించి ఎలా తెలుసుకున్నాడు? తన లైఫ్‌లో జరిగిన ఓ చేదు ఘటన తాలూకు మిస్టరీని ఎలా ఛేదించాడు? అన్నదే ఈ చిత్రకథ. మంచి కథ కుదిరితే సినిమాలో కమర్షియల్ సాంగ్స్ అవసరం ఉండదు. 'హంట్'లో అలాంటి పాటలు ఉండవు. అయితే సందర్భోచితంగా సాగే ఒకే ఒక్క పాట ఉంటుంది. అలాగే హీరోయిన్ క్యారెక్టర్ లేదు. ఈ మధ్య వచ్చిన 'ఖైదీ', 'విక్రమ్' సినిమాల్లో హీరోయిన్ పాత్ర, కమర్షియల్ పాటలు లేకపోయినా ప్రేక్షకులు ఆదరించారు. నేను 'హంట్' చేయడానికి ఆ సినిమాలు కాన్ఫిడెన్స్ ఇచ్చాయి. ఇక ఈ సినిమాలోని ఆరు యాక్షన్ సీక్వెన్స్‌లతో పాటు ఎమోషన్ సీన్స్ కూడా ఉన్నాయి. క్లైమాక్స్ చూశాక ఓ మంచి ఫీలింగ్‌తో ప్రేక్షకులు థియేటర్ నుంచి బయటకు వెళ్తారు'' అని అన్నారు.

సిక్స్ టీన్స్‌కి సీక్వెల్‌గా...



సందీప్

సందీప్ అశ్వా, రవీంద్ర నాథ్ ఠాకూర్, తరుణ్ సాగర్, విశ్వేష్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రిస్క్'. '6 టీన్స్' (2001)కు సీక్వెల్‌గా ఈ చిత్రాన్ని ఘంటాడి కృష్ణ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడం, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న ఈ సినిమా ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను దర్శకుడు నక్కిన త్రినాథరావు విడుదల చేశారు. ''6టీన్స్'లోని 'దేవుడు వరమందిస్తే..' పాట తెలుగు ప్రేక్షకులకు నన్ను మ్యూజిక్ డైరెక్టర్‌గా పరిచయం చేసింది. ఇక అక్రమ మార్గంలో డబ్బు సంపాదించుకోవాలనుకునే నలుగురు కుర్రాళ్ల కథతో 'రిస్క్' తీశా. ఈ చిత్రంలో 8 పాటలు, బిట్ సాంగ్ ఉన్నాయి'' అని ఘంటాడి కృష్ణ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఘంటాడి కృష్ణ.

ఓ సాథియా...



ఆర్యన్ గౌర, మిస్టీ చక్రవర్తి

'జీ జాంబీ' ఫేమ్ ఆర్యన్ గౌర, మిస్టీ చక్రవర్తి జంటగా నటించిన చిత్రం 'ఓ సాథియా'. తన్విక-జశ్విక క్రియేషన్స్ పతాకంపై దివ్య భావన దర్శకత్వంలో చందన కట్టా నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమాలోని టైటిల్ సాంగ్ 'ఓ సాథియా'ను ప్రముఖ సంగీతదర్శకుడు మణిశర్మ విడుదల చేసి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సంగీత దర్శకుడు విన్ను సారథ్యంలో జావేద్ అలీ పాడిన ఈ పాటకు భాస్కర్‌భట్ల సాహిత్యం అందించారు. ''ప్యూర్ లవ్‌స్టోరీగా ఈ చిత్రాన్ని రూపొందించాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు కెమెరా: ఈజే వేణు.



టాప్ సీడ్‌పై గెలిచి... విజేతగా నిలిచి...

ఇండియా ఓపెన్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రపంచ నాలుగో ర్యాంకర్ ఆన్ సె యంగ్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. మహిళల సింగిల్స్ విభాగంలో ఆమె చాంపియన్‌గా నిలిచింది. న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన ఫైనల్లో ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా) 15-21, 21-16, 21-12తో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ అకానె యామగుచి (జపాన్)పై గెలిచింది. ఆన్ సె యంగ్ కెరీర్‌లో ఇది 12వ అంతర్జాతీయ టైటిల్. విజేతగా నిలిచిన ఆన్ సె యంగ్‌కు 59,500 డాలర్ల (రూ. 48 లక్షల 17 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

అక్సెల్‌సన్‌కు కున్లావుత్ షాక్

ఇండియా ఓపెన్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్, టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అక్సెల్‌సన్ (డెన్మార్క్)కు చుక్కెదురైంది. పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ ఆరో ర్యాంకర్ కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్) 22-20, 10-21, 21-12తో అక్సెల్‌సన్‌ను తన కెరీర్‌లో తొలిసారి ఓడించి విజేతగా నిలిచాడు. కున్లావుత్‌కు 59,500 డాలర్ల (రూ. 48 లక్షల 17 వేలు) ప్రైజ్‌మనీ దక్కింది.



హతవిధి!

'క్రాస్ ఓవర్' మ్యాచ్‌లో భారత్ బోల్తా

'షూటౌట్'లో 4-5తో న్యూజిలాండ్ చేతిలో ఓటమి

టీమిండియా పతకం ఆశలు ఆవిరి

ఇక 9 నుంచి 16 స్థానాల కోసం భారత్ పోరు

మన హాకీ ఘనం... కానీ ఇది గతం! మరిప్పుడు... సొంతగడ్డపై ఆడుతున్నా... వేలాదిమంది ప్రేక్షకులు మైదానంలోకి వచ్చి మద్దతిస్తున్నా... భారత జట్టు పేలవమైన ప్రదర్శనతో మళ్లీ నిరాశపరిచింది. 2018 ప్రపంచకప్ హాకీలో నేరుగా క్వార్టర్ ఫైనల్ చేరిన టీమిండియా... ఈసారి 'క్రాస్ ఓవర్' తోనే సరిపెట్టుకుంది. క్వార్టర్ ఫైనల్లో బెర్త్ కోసం న్యూజిలాండ్‌తో ఆదివారం జరిగిన 'క్రాస్ ఓవర్' మ్యాచ్‌లో భారత్ అన్ని రంగాల్లో విఫలమై ఓడిపోయింది. దాంతో ఈ మెగా ఈవెంట్ చరిత్రలో భారత పతక నిరీక్షణ మరో నాలుగేళ్లు కొనసాగనుంది. 1975 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత్ ఆ తర్వాత ఏనాడూ సెమీఫైనల్ దశకు చేరుకోలేకపోయింది.

భువనేశ్వర్: ప్రపంచకప్ హాకీ టోర్నమెంట్‌లో భారత పతకం కథ కంచికి చేరింది. కళింగ స్టేడియంలో ఆదివారం జరిగిన 'క్రాస్ ఓవర్' మ్యాచ్‌లో భారత్ 'షూటౌట్'లో 4–5తో న్యూజిలాండ్ చేతిలో పరాజయం చవిచూసింది. దీంతో పతకం బరిలో లేని భారత్ ఇప్పుడు 9 నుంచి 16 స్థానాల కోసం వర్గీకరణ మ్యాచ్‌లు ఆడనుంది. ఈనెల 26న జపాన్‌తో భారత్ తలపడుతుంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే 9 నుంచి 12 స్థానాల కోసం 28న రెండో మ్యాచ్ ఆడుతుంది. జపాన్ చేతిలో భారత్ ఓడిపోతే 13 నుంచి 16 స్థానాల కోసం ఆడుతుంది.

న్యూజిలాండ్‌తో కీలకమైన సమయంలో రక్షణ శ్రేణి నిర్లక్ష్యం భారత జట్టు కొంపముంచింది. మూడో క్వార్టర్ వరకు 3–2తో ఆధిక్యంలో ఉన్న భారత్ నాలుగో క్వార్టర్‌లో పెనాల్టీ కార్నర్ అవకాశాలు ఎన్నో వచ్చినా... ఒక గోల్ చేయకపోగా... ప్రత్యర్థి గోల్‌నూ అడ్డుకోలేకపోయింది. దీంతో నిర్ణీత సమయం (నాలుగు క్వార్టర్లు) ముగిసే సమయానికి 3–3తో మ్యాచ్ 'డ్రా' అయ్యింది. టీమిండియా జట్టులో లలిత్ కుమార్ ఉపాధ్యాయ్ (17వ ని.లో), సుఖ్‌జీత్ సింగ్ (25వ ని.లో), వరుణ్ కుమార్ (41వ ని.లో) తలా ఒక గోల్ చేశారు. న్యూజిలాండ్ తరఫున సామ్ లేన్ (29వ ని.లో), కేన్ రసెల్ (44వ ని.లో), సీన్ ఫిండ్లే (50వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. మ్యాచ్ మొత్తంలో భారత్‌కు 10 పెనాల్టీ కార్నర్‌లు రాగా రెండింటిని సద్వినియోగం చేసుకొని మిగితా ఎనిమిదింటిని వృథా చేసుకుంది. న్యూజిలాండ్ జట్టుకు లభించిన రెండు పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలిచింది. ఆట 54వ నిమిషంలో న్యూజిలాండ్ ప్లేయర్ నిక్ రాస్‌కు ఎల్లో కార్డు లభించడంతో ఆ జట్టు చివరి ఆరు నిమిషాలు పది మంది ఆటగాళ్లతోనే ఆడింది. ఈ అవకాశాన్నీ భారత్ సద్వినియోగం చేసుకోలేకపోయింది.


న్యూజిలాండ్ ఆటగాళ్ల సంబరం


నిరాశలో భారత ఆటగాళ్లు

హోరాహోరీ షూటౌట్...

నిర్ణీత సమయంలో రెండు జట్లు సమంగా నిలువడంతో ఫలితం తేలడానికి 'షూటౌట్' నిర్వహించారు. 'షూటౌట్'లో తొలి ఐదు షాట్‌ల తర్వాత రెండు జట్లు 3–3తో సమంగా నిలిచాయి. దాంతో 'సడెన్ డెత్' అనివార్యమైంది. 'సడెన్ డెత్' నిబంధనల ప్రకారం ఒక జట్టు ప్లేయర్ గోల్ చేసి.. ఆ వెంటనే మరో జట్టు ప్లేయర్ విఫలమైనా... ఒక జట్టు ప్లేయర్ విఫలమై... ఆ వెంటనే మరో జట్టు ప్లేయర్ సఫలమైనా మ్యాచ్ ముగుస్తుంది. 'సడెన్ డెత్' తొలి షాట్‌లో న్యూజిలాండ్ ప్లేయర్ నిక్ వుడ్స్ విఫలమయ్యాడు. ఫలితంగా తదుపరి షాట్‌లో గోల్ చేస్తే భారత్‌కు విజయం దక్కేది. కానీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ తడబడ్డాడు. రెండో షాట్‌లో రెండు జట్ల ఆటగాళ్లు సఫలమయ్యారు. మూడో షాట్‌లో కివీస్ ప్లేయర్ హేడెన్ ఫిలిప్స్ విఫలం కావడంతో గెలిచేందుకు భారత్‌కు రెండో అవకాశం దక్కింది. అయితే మూడో షాట్‌లో భారత ప్లేయర్ సుఖ్‌జీత్ విఫలమయ్యాడు. నాలుగో షాట్‌లో కివీస్ ఆటగాడు సామ్ లేన్ గోల్ చేయగా... భారత ప్లేయర్ షంషేర్ సింగ్ గోల్ చేయకపోవడంతో న్యూజిలాండ్ విజయం ఖరారైంది. అంతకుముందు మరో 'క్రాస్ ఓవర్' మ్యాచ్‌లో స్పెయిన్ 'షూటౌట్'లో 4–3తో మలేసియాను ఓడించింది. ఈనెల 24న జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో ఆస్ట్రేలియాతో స్పెయిన్; బెల్జియంతో న్యూజిలాండ్ ఆడతాయి.

'షూటౌట్' సాగిందిలా...

భారత్		స్కోరు		న్యూజిలాండ్
హర్మన్‌ప్రీత్ సింగ్	✔	1-1	✔	నిక్ వుడ్స్
రాజ్‌కుమార్	✔	2-2	✔	సీన్ ఫిండ్లే
అభిషేక్	✘	2-3	✔	హేడెన్ ఫిలిప్స్
షంషేర్ సింగ్	✘	2-3	✘	సామ్ లేన్
సుఖ్‌జీత్ సింగ్	✔	3-3	✘	సామ్ హిహా
హర్మన్‌ప్రీత్ సింగ్	✘	3-3	✘	నిక్ వుడ్స్
రాజ్‌కుమార్	✔	4-4	✔	సీన్ ఫిండ్లే
సుఖ్‌జీత్ సింగ్	✘	4-4	✘	హేడెన్ ఫిలిప్స్
షంషేర్ సింగ్	✘	4-5	✔	సామ్ లేన్

స్వియాటెక్ అవుట్

- ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిన ప్రపంచ నంబర్‌వన్
- టాప్ సీడ్‌కు షాక్ ఇచ్చిన రిబాకినా
- ఏడో సీడ్ కోకో గాఫ్ కూడా ఓటమి


స్వియాటెక్


రిబాకినా

మెల్‌బోర్న్: గత ఏడాది ఎనిమిది టైటిల్స్ నెగ్గి.. వరుసగా 37 మ్యాచ్‌ల్లో విజయం సాధించి... స్థిరంగా టాప్ ర్యాంక్‌లో కొనసాగిన పోలాండ్ స్టార్, ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్‌కు ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ కలిసి రాలేదు. తొలి మూడు రౌండ్ మ్యాచ్‌ల్లో వరుస సెట్‌లలో నెగ్గిన ఆమెకు ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 25వ ర్యాంకర్, కజకిస్తాన్ అమ్మాయి ఎలీనా రిబాకినా క్లెం వేసింది. గత సంవత్సరం వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించి వార్తల్లో నిలిచిన రిబాకినా ఆద్యంతం నిలకడగా రాణించి ఆదివారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో 6–4, 6–4తో స్వియాటెక్‌ను ఓడించి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తొలిసారి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. గంటా 29 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో 22వ సీడ్ రిబాకినా ఆరు ఏస్‌లు సంధించింది. 24 విన్నర్స్ కొట్టిన ఆమె స్వియాటెక్ సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది.

ఒస్టాపెంకో తొలిసారి...

మరోవైపు ఏడో సీడ్, అమెరికా టీనేజర్ కోకో గాఫ్ కథ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. 17వ ర్యాంకర్ ఒస్టాపెంకో (లాత్వియా) 7–5, 6–3తో కోకో గాఫ్‌ను ఓడించింది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో మూడో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా) 7–5, 6–2తో క్రిచికోవా (చెక్ రిపబ్లిక్)పై, అజరెంకా (బెలారస్) 4–6, 6–1, 6–4తో లిన్ జు (చైనా)పై నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు.

పురుషుల సింగిల్స్‌లో సెబాస్టియన్ కోర్డా (అమెరికా) 3–6, 6–3, 6–2, 1–6, 7–6 (10/7)తో పదో సీడ్ హుర్కాజ్ (పోలాండ్)ను.. అన్‌సీడెడ్ జీరీ లెహెచ్కా (చెక్ రిపబ్లిక్) 4–6, 6–3, 7–6 (7/2), 7–6 (7/3)తో ఆరో సీడ్ అలియాసిమ్ (కెనడా)ను ఓడించి తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ బెర్త్ దక్కించుకున్నారు. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో మూడో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) 6–4, 6–4, 3–6, 4–6, 6–3తో జానిక్ సినెర్ (ఇటలీ)పై, 18వ సీడ్ ఖచనోవ్ (రష్యా) 6–0, 6–0, 7–6 (7/4)తో నిషియోక (జపాన్)పై గెలిచారు.

సానియా జోడీ ఓటమి

మహిళల డబుల్స్ రెండో రౌండ్‌లో సానియా మీర్జా (భారత్)–డానిలినా (కజకిస్తాన్) ద్వయం 4–6, 6–4, 2–6తో కలినినా (ఉక్రెయిన్)–ఉత్కావంక్ (బెల్జియం) జోడీ చేతిలో ఓడిపోయింది. పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో జీవన్–శ్రీరామ్ బాలాజీ (భారత్) ద్వయం 4–6, 4–6తో జెరెమి చార్డీ–ఫాబ్రిస్ మార్టిన్ (ఫ్రాన్స్) జోడీ చేతిలో ఓడింది.

సెమీస్ రేసులో భారత్


పార్శవి

పోష్‌స్ట్రూమ్ (దక్షిణాఫ్రికా): అండర్–19 ప్రపంచకప్ మహిళల టి20 టోర్నీలో సెమీఫైనల్ అవకాశాలు సజీవంగా ఉండాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో భారత జట్టు అదరగొట్టింది. శ్రీలంక జట్టుతో ఆదివారం జరిగిన 'సూపర్ సిక్స్' గ్రూప్–1 మ్యాచ్‌లో భారత్ ఏడు వికెట్ల తేడాతో గెలిచింది. లెగ్ స్పిన్నర్ పార్శవి చోప్రా 5 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టడంతో... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 20 ఓవర్లలో 9 వికెట్లకు 59 పరుగులు సాధించింది. మన్నత్ కశ్యప్ 2 వికెట్లు తీయగా... టిటాస్ సాధు, అర్చన దేవిలకు ఒక్కో వికెట్ దక్కింది. అనంతరం భారత్ 7.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 60 పరుగులు చేసి విజయం సాధించింది. షఫాలీ వర్మ (15; 1 ఫోర్, 1 సిక్స్), శ్వేత సెహ్రావత్ (13; 2 ఫోర్లు), సౌమ్య తివారి (28 నాటౌట్; 5 ఫోర్లు) రాణించారు. ఈ మ్యాచ్‌తో భారత్ 'సూపర్ సిక్స్' మ్యాచ్‌లు పూర్తయ్యాయి. భారత్ 6 పాయింట్లతో ప్రస్తుతం గ్రూప్–1లో అగ్రస్థానంలో ఉంది. ఇదే గ్రూప్‌లోని ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా బంగ్లాదేశ్ జట్లు నాలుగు పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాయి. ఈ మూడు జట్లకు ఒక్కో మ్యాచ్ మిగిలి ఉంది. ఈ మూడు జట్ల మ్యాచ్‌లు ముగిశాకే 25న భారత్‌కు సెమీఫైనల్ బెర్త్ ఖరారయ్యేది తేలుతుంది. మరోవైపు 'సూపర్ సిక్స్' గ్రూప్–2 నుంచి న్యూజిలాండ్, ఇంగ్లండ్ జట్లు సెమీఫైనల్ చేరుకున్నాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

తెలంగాణ హైకోర్టులో అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టులు

తెలంగాణ హైకోర్టులో అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** బీఎల్ఐఎస్సీ, ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణతతో పాటు లైబ్రరీ నిర్వహణలో కంప్యూటర్ పరిజ్ఞానంపై పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 11.01.2023 నాటికి 18 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఆదిమ తెగలు /బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.38,890 నుంచి రూ.1,12,510 చెల్లిస్తారు.
» **పరీక్షా విధానం:** సీబీటీ పరీక్ష(90 మార్కులు), ఇంటర్వ్యూ(10 మార్కులు). పరీక్షా సమయం 120 నిమిషాలు.
» **ఎంపిక విధానం:** పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.02.2023.
» **హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ ప్రారంభతేది:** 20.02.2023.
» **కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేది:** మార్చి 2023.
» **వెబ్‌సైట్:** tshc.gov.in

తెలంగాణ హైకోర్టులో 10 అసిస్టెంట్ పోస్టులు

తెలంగాణ హైకోర్టులో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10
» **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ(ఆర్ట్స్/సైన్స్/లా) లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 11.01.2023 నాటికి 18 నుంచి 34 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఆదిమ తెగలు /బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.24,280 నుంచి రూ.72,850 చెల్లిస్తారు.
» **పరీక్షా విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ)లో 90(జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లిష్) ప్రశ్నలుంటాయి. పరీక్షా సమయం 120 నిమిషాలు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.02.2023.
» **హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ ప్రారంభతేది:** 20.02.2023.
» **కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేది:** మార్చి 2023.
» **వెబ్‌సైట్:** tshc.gov.in

మెయిన్‌లో మార్పులు.. మెరిసే మార్గాలు!!

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 మొదటి దశ ప్రిలిమ్స్ ఫలితాలు ఇటీవల విడుదల చేసింది. జోన్లు, రిజర్వేషన్ల వారీగా 1:50 నిష్పత్తి చొప్పున మెయిన్‌కు మొత్తం 25,050 మంది అభ్యర్థులను ఎంపిక చేసింది. జూన్‌లోనే మెయిన్ ఉంటుందని ప్రకటించింది. దీంతోపాటు ప్రశ్నపత్రంలో సమూల మార్పులు చేసింది. విషయ పరిజ్ఞానం, విశ్లేషణాత్మక నైపుణ్యం, వ్యక్తీకరణ నైపుణ్యాలుంటే.. మెయిన్‌లో విజయం సాధించొచ్చని సబ్జెక్ట్ నిపుణులు పేర్కొంటున్నారు!! ఈ నేపథ్యంలో.. టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 మెయిన్ పరీక్ష విధానం.. ఈ పరీక్షలో రాణించడానికి మార్గాలు...

» 'మెయిన్' పోటీలో 25,050 మంది అభ్యర్థులు
» జూన్‌లో మెయిన్ పరీక్షలు ఉంటాయని ప్రకటన
» ప్రశ్న పత్రం నమూనాను విడుదల చేసిన టీఎస్‌పీఎస్సీ
» విశ్లేషణ, విషయ పరిజ్ఞానం విజయానికి మార్గమంటున్న నిపుణులు


టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1

గ్రూప్-1, సివిల్స్ ప్రిలిమ్స్‌లో విజయం సాధించారంటే..సగం విజయం సాధించినట్లే! ఎందుకంటే.. ప్రిలిమ్స్‌లో అర్హత పొందడం ఎంతో క్లిష్టం. కాబట్టి మెయిన్‌కు ఎంపికైన అభ్యర్థులు పక్కా వ్యూహంతో అడుగులు వేస్తే.. మెయిన్స్‌లో విజయావకాశాలను మెరుగుపరచుకోవచ్చు అంటున్నారు నిపుణులు. మెయిన్ పరీక్షలు జూన్‌లో జరిగే అవకాశముంది. అంటే.. ఇప్పటి నుంచి ఐదు నెలల సమయం అందుబాటులో ఉంది. ఈ సమయాన్ని సరైన విధంగా సద్వినియోగం చేసుకుంటే.. మెయిన్స్‌లో మంచి మార్కులు సాధించే దిశగా అడుగులు వేయొచ్చు.

ప్రశ్న పత్రం నమూనా విడుదల

- అభ్యర్థుల సౌలభ్యం కోసం టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో గ్రూప్–1 మెయిన్ పేపర్‌ల వారీగా సెక్షన్లు, ప్రశ్నల సంఖ్య, ఛాయిస్ వంటి వివరాలను పొందుపరిచారు.
- ప్రతి పేపర్‌లో మూడు సెక్షన్లు ఉన్నాయి. ఒక్కో సెక్షన్ నుంచి అయిదు ప్రశ్నలు చొప్పున మొత్తం 15 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.
- ఒక్కో ప్రశ్నకు 10 మార్కులు చొప్పున ప్రతి పేపర్‌ను 150 మార్కులకు నిర్వహించనున్నారు. అయితే ఇంటర్నల్ ఛాయిస్ బాగా తగ్గింది.
- ప్రతి పేపర్‌లోని ప్రతి సెక్షన్‌లో అభ్యర్థులు మొదటి రెండు ప్రశ్నలకు తప్పనిసరిగా సమాధానం రాయాలి. మూడు నుంచి అయిదో ప్రశ్న వరకు ఇంటర్నల్ ఛాయిస్ ఇచ్చారు.
- పేపర్–5 సైన్స్ అండ్ టెక్నాలజీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్‌లో.. డేటా ఇంటర్‌ప్రిటేషన్ సబ్జెక్ట్ నుంచి రెండు మార్కుల ప్రశ్నలు 30 అడుగుతారు. అభ్యర్థులు 25 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు 2 మార్కులు.

డిస్క్రిప్టివ్ విధానం

మెయిన్ పరీక్ష వ్యాస రూప(డిస్క్రిప్టివ్) విధానంలో ఉంటుంది. నిర్దేశించిన ఆరు పేపర్లలోనూ అభ్యర్థులు వ్యాసరూప సమాధానాలు రాయాల్సి ఉంటుంది. అర్హత పేపర్‌గా నిర్దేశించిన ఇంగ్లిష్ సైతం డిస్క్రిప్టివ్‌లోనే ఉంటుంది. దీంతో ప్రిపరేషన్ సమయంలోనే అభ్యర్థులు ఆయా అంశాలను విశ్లేషణాత్మక దృక్పథంతో అధ్యయనం చేయాలి. అదే విధంగా ప్రశ్న అడిగిన తీరు, ఉద్దేశాన్ని గ్రహించి.. దానికి తగినట్లుగా సమాధానం రాసే నైపుణ్యం పెంచుకోవాలి. సబ్జెక్ట్‌పై పూర్తి పట్టు సాధించడంతో పాటు ముఖ్యాంశాలతో సొంతంగా నోట్స్ రాసుకోవాలి.దీంతోపాటు ఆన్సర్ రైటింగ్ ప్రాక్టీస్ చేయాలి.

సొంత నోట్స్ ఎంతో మేలు

అభ్యర్థులు ప్రిపరేషన్ సాగించే సమయంలో.. సదరు అంశానికి సంబంధించిన ముఖ్యాంశాలతో నోట్స్ రాసుకోవడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఇందులో సదరు సబ్జెక్ట్‌కు సంబంధించి ముఖ్యమైన, ప్రశ్నార్హమైన అంశాలు ఉండేలా చూసుకోవాలి. ప్రతి టాపిక్‌లోని అంశాలు, వాటి ఉద్దేశం, ప్రభావంతో నోట్స్ రాసుకోవాలి. సొంత నోట్స్ ద్వారా ముఖ్యమైన అంశాలను వేగంగా రివిజన్ చేసుకునే వీలు కలుగుతుంది.

- సమకాలీన పరిణామాలకు సంబంధించి కూడా ముఖ్యమైన వాటిపై వివిధ కోణాల్లో నోట్స్‌లో రాసుకోవాలి. అభ్యర్థులు పత్రికలను చదువుతూ పరీక్ష కోణంలో అందులోని ముఖ్యాంశాలను గుర్తించే నైపుణ్యం అలవరచుకోవాలి. సంఘటన ప్రాధాన్యం, ఉద్దేశం, ప్రభావం వంటి వాటిపై స్పష్టత ఏర్పరచుకోవాలి.

రైటింగ్ ప్రాక్టీస్ స్కిల్స్

అభ్యర్థులు రైటింగ్ ప్రాక్టీస్ కోసం ప్రతి రోజూ కొంత సమయం కేటాయించాలి. పరీక్షలో ఆయా ప్రశ్నలకు సమాధానం రాసేందుకు లభించే సగటు సమయాన్ని గుర్తించాలి. దానికి అనుగుణంగా నిర్దిష్ట సమయంలో ప్రశ్నలకు సమాధానం రాసేలా ప్రాక్టీస్ చేయాలి. ఇందుకోసం పాత ప్రశ్న పత్రాలను సాధన చేయడం ఉపయుక్తంగా ఉంటుంది. మోడల్ ప్రశ్న పత్రాలు, మాక్ టెస్ట్‌లకు హాజరు కావడం కూడా మేలు చేస్తుంది. చదువుతున్నప్పుడే రైటింగ్ ప్రాక్టీస్ చేస్తే సమయం ఆదా అవుతుంది.

సినాప్సిస్ ఎంతో ముఖ్యం

మెయిన్స్‌లో మేలు చేసే మరో సాధనం.. సినాప్సిస్ రాసుకునే విధానం. ఏదైనా ఒక టాపిక్ చదువుతున్నప్పుడు దానికి సంబంధించి నిర్వచనం, ప్రాథమిక భావనలు, ఉద్దేశం, సమకాలీన పరిణామాలు, ప్రభావం వంటి అంశాలతో సంక్షిప్తంగా సినాప్సిస్ రాసు కోవాలి. ఈ విధానం వల్ల సమాధానం రాసేటప్పుడు మొత్తం విషయం జ్ఞప్తికి వచ్చే అవకాశం ఉంటుంది.

సమయ పాలన

అభ్యర్థులు ప్రతి రోజు సబ్జెక్ట్ వారీగా సమయ పాలన పాటించాలి. ప్రతి రోజు అన్ని సబ్జెక్ట్‌లు, పేపర్లు చదివేలా చూసుకోవాలి. చాలామంది అభ్యర్థులు తమకు క్లిష్టమైన సబ్జెక్ట్‌లు లేదా టాపిక్స్‌ను తర్వాత చదవచ్చనే భావనతో ఉంటారు. క్లిష్టమైన టాపిక్స్‌పైనా కనీస అవగాహన పొందేలా ప్రయత్నించాలి. తద్వారా కష్టమైన ప్రశ్నలకు కొంతమేరకైనా సమాధానం ఇచ్చే అవకాశం ఉంటుంది. అదే విధంగా అభ్యర్థులు ప్రతి రోజు తాము అంతకు ముందు రోజు చదివిన అంశాలను ఒకసారి అవలోకనం చేసుకోవాలి.

ఇంగ్లిష్ అర్హత మాత్రమే

పేపర్–ఎగా పేర్కొన్న ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్ట్ కేవలం అర్హత పేపర్ మాత్రమే. ఇందులో పొందిన మార్కులను మెరిట్ జాబితాలో కలపరు. ఇందులో ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు 40 శాతం; బీసీ కేటగిరీ అభ్యర్థులు 35 శాతం; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల విభాగాలకు చెందిన వారు 30 శాతం మార్కులు సొంతం చేసుకోవాలి.

పేపర్ వారీగా ప్రిపరేషన్ ఇలా

పేపర్-1 జనరల్ ఎస్సే

- జనరల్ ఎస్సేలో రాణించేందుకు సమకాలీన సామాజిక అంశాలు, సమస్యలు, ఆర్థిక వృద్ధి, భారత చారిత్రక, వారసత్వ సంపద, సైన్స్ అండ్ టెక్నాలజీలో తాజా పరిణామాలు తదితర అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- జనరల్ ఎస్సేలో విషయావగాహన, సమకాలీన పరిణామాలపై పట్టు, సృజనాత్మకత వ్యక్తీకరణం చాలా ముఖ్యం. జనరల్ ఎస్సే ఉద్దేశం కూడా ఇదే రీతిలో ఉంటోంది. కాబట్టి అభ్యర్థులు ఏ విషయంపై వ్యాసం రాస్తున్నా.. సంబంధిత లక్ష్యం నెరవేరేలా వ్యాసాన్ని ప్రెజెంట్ చేయడం మేలు చేస్తుంది.

పేపర్-2: హిస్టరీ, కల్చర్, జాగ్రఫీ

- చరిత్రలో తెలంగాణలో రాజులు, ముఖ్య యుద్ధాలు, ఒప్పందాలు, తెలంగాణలోని కవులు-రచనలు;కళలు; ముఖ్య కట్టడాలు-వాటిని నిర్మించిన రాజులు తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అదే విధంగా స్వాతంత్ర్యోద్యమ సమయంలో తెలంగాణ ప్రాంత ప్రమేయం ఉన్న సంఘటనలపై అవగాహన పెంచుకోవాలి. భారత చరిత్రకు సంబంధించి.. ఆధునిక భారత దేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమం, భారత చరిత్ర, సంస్కృతి;అదే విధంగా తెలంగాణ చరిత్ర, సాంస్కృతిక వారసత్వం వంటి అంశాలను చదవాలి. వీటితోపాటు భారతదేశం, అలాగే తెలంగాణ రాష్ట్ర భౌగోళిక అంశాలపై పట్టు సాధించాలి.
- జాగ్రఫీలో.. తెలంగాణలోని ముఖ్యమైన నదులు-పరీవాహక ప్రాంతాలు; ముఖ్యమైన పంటలు; భౌగోళిక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలపై దృష్టి పెట్టాలి. దీంతోపాటు తెలంగాణ భౌగోళిక స్వరూపం విస్తీర్ణం, జనాభా వంటి అంశాలపై అవగాహన అవసరం.

పేపర్-3: ఇండియన్ సొసైటీ, రాజ్యాంగం, పాలన

- ఈ పేపర్ కోసం భారత రాజ్యాంగం, పాలనా వ్యవస్థ, భారత సమాజం, సమస్యలు, సాంఘిక ఉద్యమాలపై దృష్టి పెట్టాలి. ఆర్టికల్స్, సవరణలు, రాజ్యాంగ వ్యవస్థలు, శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, పరిపాలన వ్యవస్థల స్వరూపం, అధికారాలు, విధులు వంటి అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా ఇటీవల కాలంలో పాలన పరంగా అనుసరిస్తున్న నూతన విధానాలపై దృష్టి పెట్టాలి.

పేపర్-4: ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్

- ఈ పేపర్ కోసం భారత, తెలంగాణ ఆర్థిక వ్యవస్థ-అభివృద్ధి, అభివృద్ధి, పర్యావరణ సమస్యల గురించి అవగాహన పెంచుకోవాలి. ఎకానమీలో తెలంగాణ స్థూల రాష్ట్రీయోత్పత్తి, ముఖ్యమైన పథకాలు, 2011 జనాభా గణాంకాలు; ముఖ్యమైన పరిశ్రమలు-ఉత్పత్తిదాయకత, రాష్ట్ర ప్రధాన ఆదాయ వనరులపై పట్టుసాధించాలి. అదే విధంగా ఇండియన్ ఎకానమీకి సంబంధించి మైక్రో, మ్యాక్రో ఎకనామిక్స్‌పై అవగాహన పెంచుకోవాలి. కోర్ అంశాలతోపాటు ఆర్థిక వ్యవస్థలో తాజా పరిణామాల వరకు అన్నింటిని అధ్యయనం చేయాలి.

పేపర్-5: సైన్స్ అండ్ టెక్నాలజీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్

- ఈ పేపర్ కోసం సామాజిక అభివృద్ధికి సైన్స్ అండ్ టెక్నాలజీ దోహదపడుతున్న తీరు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఆధునిక పద్ధతుల గురించి ప్రత్యేకంగా తెలుసుకోవాలి. అదే విధంగా భారత అంతరిక్ష కార్యక్రమం, ఈ-గవర్నెన్స్, బయో డైవర్సిటీ, ఎకాలజీ అంశాలపై అవగాహన పెంచుకోవాలి. దీంతోపాటు కోర్ సైన్స్ అంశాలు ప్రధానంగా వ్యాధులు-బ్యాక్టీరియాలు వంటివి తెలుసుకోవాలి. వైరస్‌లు, వాటి నివారణకు అందుబాటులోకి వస్తున్న వ్యాక్సిన్‌లపై పట్టు సాధించాలి.
- పేపర్-5లోనే మూడో విభాగంగా పేర్కొన్న.. డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్ కోసం గణితంలో ప్రాథమిక అంశాలపై దృష్టిపెట్టాలి. మౌలికాంశాలైన.. సంఖ్యలు-సంఖ్యామానాలు; ప్రాథమిక గణిత పరిక్రియలు, కారణాంకాలు, గుణిజాలు, క.సా.గు.; భిన్నాల కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగహారం, సాధారణ భిన్నం, మిశ్రమ భిన్నం; సమీకరణాలు-సాధన; ఘాతాంకాలు -ఘాతాలపై అవగాహన పెంచుకోవాలి. ఇందుకోసం 6,8వ తరగతి పుస్తకాలు పరిశీలించాలి. ఈ అంశాలపై పట్టు సాధించాక వీలైనంతగా ప్రాక్టీస్ చేయాలి. అప్లికేషన్ స్కిల్స్ పెంచుకోవాలి. ఒక మోడల్‌ను అంచెలవారీగా సాల్వ్ చేసే ప్రాక్టీస్ అవసరం.

పేపర్-6: తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావం

- తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రూప్-1 సిలబస్‌లో కొత్తగా చేర్చిన పేపర్ ఇది. అభ్యర్థులు తెలంగాణ ఆలోచన(1948-1970), ఉద్యమ దశ(1971-1990), తెలంగాణ ఏర్పాటు దశ, ఆవిర్భావం(1991-2014)) అంశాలకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. ముఖ్యంగా సిలబస్‌లో నిర్దేశించిన ప్రకారం-1948 నుంచి 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వరకు జరిగిన ముఖ్య ఉద్యమాలు, ఒప్పందాలు, ముల్కీ నిబంధనలు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీలు-వాటి సిఫార్సులు వంటి వాటిపై అవగాహన ఏర్పరచుకోవాలి. దీంతోపాటు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా రూపొందించిన పునర్ వ్యవస్థీకరణ బిల్లులో తెలంగాణకు సంబంధించి ప్రత్యేకంగా పొందుపరచిన అంశాలు; తెలంగాణ రాష్ట్రానికి కల్పించిన హక్కులపై దృష్టి సారించాలి. తెలంగాణకు సంబంధించి ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకున్న అంశాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి వంటి అంశాలపై మరింత ప్రత్యేక దృష్టితో అభ్యసనం సాగించాలి. ఆర్థిక వనరుల అభివృద్ధి, రాష్ట్రంలో వ్యవసాయ, సాగు పరిస్థితులు, పారిశ్రామిక విధానాలు వంటి అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
237	80
60,622	18,028

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	11,140	▲	228
డోజోన్స్	33,375	▲	331
ఎఫ్‌టీఎస్ఈ 100	7,771	▲	23
డాక్స్	15,034	▲	113
షాంఘై	3,265	▲	25
నికాయ్	26,554	▲	148

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	80.45	82.12
£	బ్రిటన్ పౌండ్	86.55	89.59
€	యూరో	98.98	102.32
¥	జపాన్ ఎన్ (100)	62.11	64.16
AU$	ఆస్ట్రేలియా డాలర్	55.14	57.53
S$	సింగపూర్ డాలర్	60.46	62.45
SAR	సౌదీ రియాల్	20.64	22.31
UAE D	యూఏఈ దిర్హామ్	21.19	22.98
¥	చైనా యువాన్	10.84	12.92

ముందే రిటైర్మెంటా..!



20 ప్లస్‌లో ఆరంభిస్తే సాధ్యమే • వ్యవధి ఎక్కువ ఉంటే లక్ష్యం తేలిక • ఆలస్యం చేసిన కొద్దీ ఆర్థిక భారం • ముందస్తు విరమణకు అధిక నిధి కావాలి జీవితాంతం పోషణకు సమకూర్చుకోవాలి • ఏటా పెట్టుబడుల మొత్తాన్ని పెంచుకోవాలి • రుణాలకు దూరంగా ఉండాలి

నేటి తరం యువత 60 ఏళ్లు వచ్చే వరకు కష్టపడాలని అనుకోవడం లేదు. కెరీర్‌ను ముందుగానే ముగించాలని కోరుకుంటోంది. ముందస్తు రిటైర్మెంట్ ఆకాంక్ష క్రమంగా విస్తరిస్తోంది. ముందుగా రిటైర్ అయితే, అప్పటి నుంచి తమ అభిరుచులకు అనుగుణంగా స్వేచ్ఛగా జీవించొచ్చనే కాన్సెప్ట్ ఆదరణకు నోచుకుంటోంది. తోటి వారిని చూసి దీనికి ఆకర్షితులయ్యే వారూ ఉంటున్నారు. కానీ, ఇది ఎలా సాధ్యం? ఇదే ఎక్కువ మందికి ఎదురయ్యే ప్రశ్న. దీనిపై స్పష్టత తెచ్చుకోలేక, తర్వాత చూద్దాంలే.. అని అనుకుని కెరీర్‌లో సాగిపోయేవారూ ఉన్నారు. ఉద్యోగ, వృత్తి బాధ్యతలకు ముందస్తుగా విరమణ పలికి, నచ్చినట్టు జీవించడం అంటే వినడానికి ఎంతో ఆకర్షణీయంగా అనిపించొచ్చు. కానీ, దీన్ని చేరుకోవాలంటే సరైన లెక్కలు, ప్రణాళికలు కావాలి. వాటిని ఆచరణలో పెట్టినప్పుడు లక్ష్యం సఫలమవుతుంది. ఇందుకు ఏం చేయవచ్చన్నది అవగాహన కల్పించే కథనం ఇది.

రిటైర్మెంట్ అన్నది అన్నింటిలోకి చివరి లక్ష్యం అవుతుంది. దీనికంటే ముందు జీవితంలో నెరవేర్చాల్సిన, సాధించాల్సిన లక్ష్యాలు ఎన్నో ఉంటాయి. ఉదాహరణకు పిల్లల విద్య, వివాహాలు, సొంతిల్లు తదితరాలు. వీటిని సాధించేందుకు సరైన దిశలోనే అడుగులు వేస్తున్నారా? రిటైర్మెంట్ కంటే ముందుగా ఎదురయ్యే లక్ష్యాలకు సంబంధించి కచ్చితమైన ప్రణాళిక అవసరం. వీటిని చేరుకునేందుకు కావాల్సినంత, సరైన సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తున్నారా? ఒక్కసారి పరిశీలించుకోవాలి. లేకపోతే జీవితంలో అత్యంత ముఖ్యమైన లక్ష్యాల విషయంలో ఏ మాత్రం లెక్కలు తప్పినా, రిటైర్మెంట్ లక్ష్యం విషయంలో రాజీ పడాల్సి రావచ్చు. ఎవరైనా కానీ, ముందుగా ఎదురుపడే అవసరం గురించే ఆలోచిస్తారు. అందుకే ముందే రిటైర్మెంట్ తీసుకోవాలంటే, దానికంటే ముందు ఎదురయ్యే వాటి గురించి కూడా ప్రణాళిక వేసుకోవాలి. జీవితంలో కీలకమైన లక్ష్యాలు సాధించలేకపోతే రిటైర్మెంట్ సాధ్యం కాదన్న సూక్ష్మాన్ని గుర్తించాలి. ''సురక్షితమైన భవిష్యత్తుకు కావాల్సిన అన్ని రకాల చర్యలు తీసుకోవాలి. ప్రస్తుత మీ జీవన శైలి పదవీ విరమణ తర్వాత దిగజారిపోకూడదు. వైద్య చికిత్సలకు అవసరమైనంత నిధి ఉండాలి. పిల్లల విద్య, వారి వివాహాలు, కారు కొనుగోలు, సెలవుల్లో పర్యటనలు వీటన్నింటికీ ఏర్పాట్లు ఉండాలి''అని హమ్ ఫౌజీ సీఈవో సంజీవ్ గోవిలా సూచించారు.



ఎంత కావాలి..?

విశ్రాంత జీవనం కోసం సమకూర్చుకోవాల్సిన నిధి విషయంలో ద్రవ్యోల్బణ ప్రభావాన్ని తప్పకుండా పరిగణనలోకి తీసుకోవాలి. లేదంటే సమకూర్చుకున్న నిధి ఏ మూలకూ చాలకపోవచ్చు. అదే జరిగితే పేరుకే రిటైర్మెంట్ అవుతుంది. ఆ తర్వాత ఖర్చులకు చాలక మళ్లీ ఏదో ఒక ఉపాధి వెతుక్కోవాల్సిన పరిస్థితి తెచ్చుకున్నట్టు అవుతుంది. అందుకుని రిటైర్మెంట్ కోసం కావాల్సిన నిధిని పక్కా అంచనా వేయాలి. ఈ విషయంలో నిపుణుల సాయం ఎంతో అవసరం పడుతుంది. రిటైర్మెంట్‌కు సంబంధించి కావాల్సిన నిధిని అంచనా వేయడం అత్యంత ముఖ్యమైనదని రైట్ హారిజాన్స్ ఫండ్ మేనేజర్ అనిల్ రెగో పేర్కొన్నారు. ఉదాహరణకు 25 ఏళ్ల వ్యక్తి ప్రస్తుతం నెలవారీ ఖర్చులు రూ.25,000 ఉన్నాయని అనుకుందాం. అతడు ఏ వయసులో రిటైర్ అయితే ఆ తర్వాత జీవనానికి ఎంత మొత్తం కావాలన్నది ఇక్కడి పట్టికలో చూడొచ్చు. ప్రస్తుత నెలవారీ వ్యయాలకు ఏటా సగటున 5 శాతం ద్రవ్యోల్బణం ప్రభావం పరిగణనలోకి తీసుకుని రిటైరయ్యే నాటికి ఎంత కావాలో వేసిన అంచనాలు ఇవి. పట్టికలోని నెలవారీ పెట్టుబడిని ఏడాదికోసారి 8 శాతం పెంచుతూ వెళ్లాలి. పెట్టుబడిపై ఏటా 10 శాతం రాబడి వస్తుందన్న అంచనా. రిటైర్మెంట్ నాటికి సమకూరిన ఫండ్‌పై ఆ తర్వాత ఏటా 7 శాతం రాబడి వస్తుందని అనుకుంటే, ఇంత మొత్తం సమకూర్చుకోవాల్సి ఉంటుంది.

రిటైర్మెంట్ వయసు	65ఏళ్లు	60 ఏళ్లు	55 ఏళ్లు	50 ఏళ్లు	45 ఏళ్లు	40 ఏళ్లు
కావాల్సిన నిధి	రూ.3.97కోట్లు	రూ.3.58 కోట్లు	రూ.3.13 కోట్లు	రూ.2.69 కోట్లు	రూ.2.27 కోట్లు	రూ.1.90 కోట్లు
నెలవారీ పెట్టుబడి	రూ.2,812	రూ.4,476	రూ.7,070	రూ.11,253	రూ.18,366	రూ.31,850

అవసరాలు వేర్వేరు..

రిటైర్మెంట్‌కు తక్కువ వ్యవధి ఉన్నప్పుడు నెలవారీ పెట్టుబడికి ఎక్కువ మొత్తం అవసరపడుతుంది. ప్రతి వ్యక్తికి ప్రత్యేకమైన జీవనశైలి, అవసరాలు, ఖర్చులు ఉంటుంటాయి. కనుక నెలవారీ ఎంత మొత్తం, ఏడాదికి ఎంత చొప్పున కావాలన్నది ఎవరికి వారు అంచనాకు రావాలి. ఏడాదికి తమ ఖర్చులు, తమ ఆరోగ్య అవసరాలు, ఆరోగ్య బీమా, జీవిత బీమా ఉన్నాయా? పిల్లలు ఎంత మంది? వారికి ఏ స్థాయి ఖర్చులో విద్య చెప్పించాలని అనుకుంటున్నారు? సొంతింటి ప్రణాళిక, వాహనం ఇత్యాది అవసరాలన్నింటినీ ఒక జాబితాగా రాసుకోవాలి. ఆ తర్వాత ఆర్థిక సలహాదారు లేదంటే పెట్టుబడి సలహాదారును సంప్రదించాలి. వారు అన్నింటినీ సమగ్రంగా పరిశీలించి, **నెలవారీగా దేనికి ఎంత మొత్తం పొదుపు,** మదుపు చేయాలి, ఏ సాధనాలను ఎంపిక చేసుకోవాలి? అనేది ఒక ప్రణాళిక రూపొందించి ఇస్తారు. దీనికోసం ద్రవ్యోల్బణం, జీవిత కాలం తదితర అంశాలను వారు విశ్లేషిస్తారు. వారిచ్చిన ప్రణాళిక ప్రకారం సాగిపోవాలి. 30 ఏళ్ల వ్యక్తి నెలవారీ ఖర్చులు రూ.30,000 ఉన్నాయని అనుకుంటే ఏ వయసులో రిటైర్మెంట్ అయితే ఎంత మొత్తం కావాలో ఇక్కడి టేబుల్‌లో చూడొచ్చు. పైన టేబుల్ మాదిరే జీవిత కాలం 90 ఏళ్లకు అనుకుని, ఏటా పెట్టుబడిపై 10 శాతం రాబడి అంచనా ప్రకారం, ఏటా పెట్టుబడి 8 శాతం పెంచుతూ వెళ్లే విధంగా, రిటైర్మెంట్ తర్వాత 7 శాతం రాబడి కోసం సమకూర్చుకోవాల్సిన నిధి అంచనాలు ఇవి.

రిటైర్మెంట్ వయసు	65ఏళ్లు	60 ఏళ్లు	55 ఏళ్లు	50 ఏళ్లు	45ఏళ్లు
కావాల్సిన ఫండ్	రూ.4.98 కోట్లు	రూ.4.48కోట్లు	రూ.3.93కోట్లు	రూ.3.37కోట్లు	రూ.2.85కోట్లు
నెలవారీ పెట్టుబడి	రూ.6,231	రూ.10,116	రూ.16,425	రూ.27,212	రూ.47,341

ఒకవేళ 35 ఏళ్ల వ్యక్తికి అంచనాలు ఇలా ఉంటాయి..

రిటైర్మెంట్ వయసు	65 ఏళ్లు	60ఏళ్లు	55 ఏళ్లు	50ఏళ్లు
కావాల్సిన ఫండ్	రూ.3.90కోట్లు	రూ.3.51కోట్లు	రూ.3.08కోట్లు	రూ.2.64కోట్లు
నెలవారీ పెట్టుబడి	రూ.8,801	రూ.14,688	రూ.24,824	రూ.43,839

గమనిక: ఇక్కడ పట్టికల్లో ఇచ్చిన అంచనాలు అన్నీ కూడా పెట్టుబడిపై ఏటా 10 శాతం రాబడి ప్రకారం వేసిన అంచనాలు. కానీ, ఈక్విటీ ఫండ్స్‌లో దీర్ఘకాలంలో 12 శాతం వార్షిక రాబడి సాధ్యమే. కనుక ఆ ప్రకారం చూస్తే చేయాల్సిన నెలావారీ పెట్టుబడి 10 శాతం తక్కువైనా అనుకున్న కార్పస్‌ను సమకూర్చుకోవడం సాధ్యపడుతుంది.

అప్రమత్తత



రిటైర్మెంట్‌కు మరో ఐదేళ్లు ఉందనగా పెట్టుబడుల విషయంలో అప్రమత్తం కావాలి. ఈక్విటీలకు అధిక కేటాయింపులు చేసుకునే వారు మార్కెట్ సైకిల్‌ను పరిగణనలోకి తీసుకుని, అందుకు అనుగుణమైన వ్యూహాన్ని అమల్లో పెట్టాలి. ఉదాహరణకు 2008 మార్కెట్ పతనం, 2020 మార్కెట్ పతనం గుర్తుండే ఉంటాయి. 2020 మార్కెట్ పతనం తర్వాత స్టాక్స్ రికవరీకి ఏడాది సమయం పట్టింది. కొన్ని స్టాక్స్ పూర్తిగా కోలుకుని కొత్త గరిష్టాలకు చేరుకుంటే, కొన్ని ఆలస్యంగా రికవరీ అయ్యాయి. అందుకుని రిటైర్మెంట్‌కు మరో మూడు-ఐదేళ్లు ఉందనగా, మార్కెట్ సైకిల్‌ను అర్థం చేసుకోవాలి. భారీ దిద్దుబాటు వచ్చి దిద్దుబాటు వచ్చి చాలా ఏళ్లు అయ్యిందా? మార్కెట్ల వ్యాల్యూయేషన్లు జీవిత కాల గరిష్ట స్థాయిల్లో చలిస్తున్నాయా? ఇలాంటి అంశాలపై నిపుణుల సాయంతో అంచనాకు రావాలి. మూడు ఐదేళ్ల ముందు నుంచి ఏటా నిర్ణీత శాతం చొప్పున ఈక్విటీ పెట్టుబడులను ఉపసంహరించుకుంటూ డెట్ సాధనాల్లోకి మళ్లించుకోవాలి. రిటైర్మెంట్ తర్వాత కూడా ఈక్విటీల్లో కొంత మేర పెట్టుబడులు అవసరంపడతాయి. ఎందుకంటే ముందుగా రిటైర్మెంట్ తీసుకుంటున్నారు. ఆ తర్వాత కనీసం 25 ఏళ్ల నుంచి 35-40 ఏళ్ల పాటు జీవించి ఉండే వారికి ఈక్విటీలు తప్పనిసరి. అప్పుడే కార్పస్ కరిగిపోకుండా ఉంటుంది. అందుకుని నిపుణులు సూచించిన మేర ఈక్విటీల్లో పెట్టుబడులు కొనసాగించి, మిగిలిన మొత్తాన్ని క్రమంగా వెనక్కి తీసుకోవాలి. ఒకవేళ ఊహించని విధంగా రిటైర్మెంట్ నాటికి మార్కెట్లు భారీ దిద్దుబాటుకు గురైతే అప్పుడు రిటైర్మెంట్ లక్ష్యాన్ని ఏడాది నుంచి మూడేళ్ల పాటు వాయిదా వేసుకోవాల్సి రావచ్చు. అందుకుని సాధ్యమైన మేర లక్ష్యం వాయిదా పడకూడదంటే ముందస్తు జాగ్రత్తలు తప్పవు.

అవరోధాలు..

ముందుగా పదవీ విమరణ తీసుకునే వారికి సంపాదించే కాలం ఇతరులతో పోలిస్తే తక్కువ ఉంటుంది. ఉదాహరణకు 30 ఏళ్ల కాలంలో సమకూర్చుకోవాల్సినంత 20-25 ఏళ్లకే సాధించాలి. రిటైర్మెంట్ తర్వాత ఇతరులపై ఆధారపడకూడదు. పైగా ముందస్తు రిటైర్మెంట్ అంటే ఉదాహరణకు 55 ఏళ్లకు రిటైర్మెంట్ తీసుకుంటారని అనుకుందాం. అక్కడి నుంచి కనీసం 80 ఏళ్ల వరకు జీవించి ఉంటారని అనుకుంటే, 35 ఏళ్ల కాలానికి అవసరాలు తీర్చేంత ఫండ్ కావాలి. 25-30 ఏళ్లకు కెరీర్ ఆరంభిస్తే.. అక్కడి నుంచి ముందస్తు రిటైర్మెంట్‌కు 30-25 ఏళ్లే మిగిలి ఉంటుంది. తక్కువ కాలంలో ఎక్కువ కాలానికి ఫండింగ్ ఏర్పాటు చేసుకోవడం అంటే సాధారణ విషయం కాదన్నది గుర్తుంచుకోవాలి. క్రమశిక్షణతో, ఎటువంటి దుబారాకు చోటు ఇవ్వకుండా సంపాదనలో అధిక భాగం భవిష్యత్తుకు పొదుపు చేసుకున్నప్పుడు లక్ష్యం సాకారం అవుతుంది. ఉదాహరణకు పిల్లల విద్య కోసం బడ్జెట్ వేసుకుంటే, ఆ బడ్జెట్ మించకుండా దాన్ని అధిగమించాలి. లేదంటే వేరే లక్ష్యం కోసం ఉద్దేశించిన మొత్తం నుంచి దానికి సర్దుబాటు చేసుకోవాల్సి వస్తుంది. అలాంటప్పుడు గొలుసుకట్టు మాదిరి ఒకదాని కోసం మరో లక్ష్యం విషయంలో రాజీపడాల్సి వస్తుంది. లేదంటే రుణం తప్పదు.

రాబడి రేటు కీలకం

సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ రూపంలో (సిప్) ఇన్వెస్ట్ చేసినప్పుడు దీర్ఘకాలంలో మెరుగైన రాబడులు అందుకోవచ్చని చారిత్రక గణాంకాలు తెలియజేస్తున్నాయి. అలాగే, పెట్టుబడుల విధానంలో చిన్న మార్పుతోనూ మెరుగైన నిధిని సమకూర్చుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. మనకు ఏటా ఆదాయం ఎంతో కొంత పెరుగుతూనే ఉంటుంది. ఇలా పెరిగే మొత్తానికి అనుగుణంగా సిప్ పెట్టుబడినీ పెంచుకుంటూ వెళ్లాలి. ఏడాదికోసారి ఆర్జన పెరిగినప్పుడు పెట్టుబడిని పెంచుకోవడం ఏమంత పెద్ద కష్టం కాదు. ఖర్చులు కూడా ద్రవ్యోల్బణ ప్రభావంతో ఏటా పెరుగుతూ ఉంటాయి. ఖర్చులు పెరిగాయని పెట్టుబడుల విషయంలో రాజీ పడితే లక్ష్యం సాకారం కాదు. అనవసర ఖర్చులను తగ్గించుకుని అయినా అనుకున్న మేర, ప్రణాళిక మేరకు ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లాలి. ఏటా ఆదాయం అనుకున్న మేర పెరగకపోతే ఎలా? దీనికి సంబంధించి కూడా ప్లాన్-బి రెడీ చేసుకుని పెట్టుకోవాలి. భవిష్యత్తు పెట్టుబడుల కోసం ప్రస్తుత జీవనశైలిలో పూర్తి రాజీ పడకూడదన్నది ఆర్థిక సలహాదారుల సూచన. రెండింటినీ సమన్వయం చేసుకునే విధంగా ఆచరణ ఉండాలి.



అలాగే, ఏటా పెట్టుబడిని పెంచడం ఒక్కటి కాకుండా, పెట్టుబడి సాధనాల మధ్య సమతూకం కూడా ఉండాలి. అధిక రాబడులను ఇచ్చే ఈక్విటీలకు తప్పకుండా చోటు ఉండాల్సిందే. పెట్టుబడులకు కనీసం 20 ఏళ్లు అంతకుమించి కాలం ఉంటే అగ్రెస్సివ్ ప్రణాళిక వేసుకోవచ్చు. ఈక్విటీలకు 75 శాతం నుంచి 100 శాతం వరకు కేటాయింపులు చేసుకోవచ్చు. ఎన్‌పీఎస్ ప్లాన్‌లోనూ 75 శాతం ఈక్విటీ పెట్టుబడులకు ఆప్షన్ ఉంది. ఎంత ఎక్కువ కాలం ఉంటే కాంపౌండింగ్ వల్ల అంత పెద్ద మొత్తం సమకూరుతుంది. రిటైర్మెంట్‌కు సంబంధించి అధిక రిస్క్ తీసుకునే వారికి సాధారణంగా 70-80 శాతం ఈక్విటీలు, మిగిలిన 20 శాతం మేర స్థిరాదాయ (డెట్) పథకాలను నిపుణులు సూచిస్తుంటారు. నిజానికి చాలా మంది విషయంలో గమనిస్తే అన్నింటికంటే ఆలస్యంగా మొదలు పెట్టేది రిటైర్మెంట్ కోసమే అవుతోంది. ఎక్కువ మంది చేసే పెద్ద తప్పిదం ఇదే. ఆర్జన మొదలైన మొదటి నెల నుంచే రిటైర్మెంట్ కోసం ఇన్వెస్ట్‌మెంట్ ఆరంభించిన వారు చాలా సులభంగా కావాల్సిన నిధిని సమకూర్చుకోగలరు. అంతే కాదు, కాంపౌండింగ్ పవర్‌తో ముందస్తు రిటైర్మెంట్ వీరికి చాలా సులభం అవుతుంది. ఆలస్యం చేసే కొద్దీ ఈ లక్ష్యం భారంగా మారుతుంది.

రిస్కులు-రక్షణ

ముందస్తు రిటైర్మెంట్ లక్ష్యం పెట్టుకున్న వారు రుణాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. రుణాలు తీసుకున్నా, రిటైర్మెంట్ పెట్టుబడుల ప్రణాళికకు అవరోధంగా లేకుండా ఉండాలి. రిటైర్మెంట్ నాటికి తీర్చేలా ఉండాలి. మరీ ముఖ్యంగా ముందస్తు రిటైర్మెంట్ తీసుకునే వారు ఉద్యోగం భద్రత అంశాన్ని తప్పకుండా పరిగణనలోకి తీసుకోవాలి. కరోనా సంక్షోభ సమయంలో ఎంతో మంది ఉపాధిని కోల్పోయారు. రుణాలపై మారటోరియం ఆప్షన్ తీసుకున్న వారు ఎందరో ఉన్నారు. ఇలాంటి ఊహించని పరిణామాలు ఎదురైతే ప్రణాళిక వెనక్కి వెళ్లిపోయే ప్రమాదం ఉంటుంది. అందుకే ఈ విధమైన రిస్కులను ఎదుర్కొనే ప్రణాళిక కూడా కావాలి. అలాగే, రోడ్డు ప్రమాదంలో గాయపడి వైకల్యం పాలై ఆర్జన ఆగిపోయే పరిస్థితి వస్తే..? అనుకున్నదంతా తలకిందులైపోతుంది. దీనికి సంబంధించి బీమా కవరేజీ తప్పకుండా తీసుకోవాలి. అలాగే, మనకు ఏదైనా అనుకోనిది జరిగితే కుటుంబాన్ని ఆదుకునే జీవిత బీమా, ఆస్పత్రిలో వైద్యం కోసం హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీ తప్పకుండా తీసుకోవాలి. వృద్ధాప్యంలో ఎన్నో ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. అందుకుని చాలా ముందుగానే హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ తీసుకోవాలి.

హెచ్ఎస్‌బీసీ ఎంఎఫ్ మల్టీ క్యాప్ ఫండ్ ..



హెచ్ఎస్‌బీసీ మ్యుచువల్ ఫండ్ తాజాగా మల్టీ క్యాప్ ఫండ్ పేరిట న్యూ ఫండ్ ఆఫర్‌ను ప్రకటించింది. ఇది జనవరి 24తో ముగుస్తుంది. ఈక్విటీ, ఈక్విటీ సంబంధ సెక్యూరిటీల్లో పెట్టుబడుల ద్వారా దీర్ఘకాలికంగా సంపద వృద్ధి అవకాశాలను అందించడం ఈ స్కీము లక్ష్యం. దీని ద్వారా సమీకరించిన నిధులను లార్జ్ క్యాప్, మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో తలో 25 శాతం చొప్పున ఇన్వెస్ట్ చేస్తారు. మిగతా 25 శాతం వరకూ మొత్తాన్ని ఈక్విటీ లేదా డెట్ సెక్యూరిటీస్ లేదా మనీ మార్కెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తారు. తద్వారా డైవర్సిఫికేషన్ ప్రయోజనాలు పొందవచ్చు. ఎల్అండ్‌టీ మ్యూచువల్ ఫండ్ స్కీములను కొనుగోలు చేసిన తర్వాత హెచ్ఎస్‌బీసీ ఎంఎఫ్ ప్రవేశపెడుతున్న తొలి ఎన్ఎఫ్ఓ ఇది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-1-2023	
విశాఖ	550-00
చిత్తూరు	543-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515-00
విజయవాడ	515-00
రిటైల్ ధర (డజను)	78.00
22-1-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	530-00
వరంగల్	532-00
రిటైల్ ధర	5.90

ప్యాసివ్ ఈఎల్ఎస్ఎస్ స్కీమ్ ఆవిష్కరణకు అనుమతి

అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలకు సెబీ సమాచారం



న్యూఢిల్లీ: పన్ను ఆదా ప్రయోజనంతో కూడిన ఈఎల్ఎస్ఎస్ పథకాలకు సంబంధించి సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు ప్రతి మ్యూచువల్ ఫండ్స్ సంస్థ ఒక్కటే ఈఎల్ఎస్ఎస్ పథకాన్ని నిర్వహించేందుకు సెబీ అనుమతించేది. ఒకటే సంస్థ ఒకటికి మించిన ఈఎల్ఎస్ఎస్ స్కీమ్‌లను నిర్వహించకూడదు. కానీ, ఇక మీదట యాక్టివ్ ఈఎల్ఎస్ఎస్ పథకాలను ఆఫర్ చేసే ప్రతి సంస్థ ప్యాసివ్ విభాగంలో (ఇండెక్స్‌ల పరిధిలోని స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసేవి) ఈఎల్ఎస్ఎస్ పథకాన్ని తీసుకొచ్చేందుకు అనుమతించింది. ఈ మేరకు అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలకు సమాచారం ఇచ్చింది. కానీ, ఈ విషయంలో పలు షరతులు విధించింది. ఇప్పటికే యాక్టివ్ ఈఎల్ఎస్ఎస్ పథకం నిర్వహించే అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ/మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణ సంస్థ) ప్యాసివ్ స్కీమ్‌ను కూడా తీసుకురావాలని భావిస్తే.. యాక్టివ్ పథకంలోకి ఇక మీదట పెట్టుబడులను తీసుకోకూడదు.

కొటక్ బ్యాంక్ మార్జిన్ల రికార్డ్



క్యూ3 లాభం రూ. 3,995 కోట్లు

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022-23) మూడో త్రైమాసికంలో ప్రయివేట్ రంగ దిగ్గజం కొటక్ మహీంద్రా బ్యాంక్ ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 17 శాతం ఎగసి రూ. 3,995 కోట్లను తాకింది. స్టాండెలోన్ లాభం మరింత అధికంగా 31 శాతం జంప్‌చేసి రూ. 2,792 కోట్లను తాకింది. ఇందుకు బ్యాంక్ నికర వడ్డీ మార్జిన్లు 0.3 శాతం బలపడి రికార్డ్ స్థాయిలో 5.47 శాతానికి చేరడం, రుణాల నాణ్యత మెరుగుపడటం సహకరించింది. జీవిత బీమా, మైక్రోఫైనాన్స్ విభాగాలుమినహా మిగిలిన అనుబంధ సంస్థల లాభాలు నీరసించినప్పటికీ కన్సాలిటేడెడ్‌స్థాయిలో పటిష్ట ఫలితాలను సాధించినట్లు డిప్యూటీ ఎండీ దీపికా గుప్తా పేర్కొన్నారు. వడ్డీ రేట్లు పెరుగుతున్న నేపథ్యంలో సుమారు 63% రుణాలపై ఆర్జన మెరుగుపడనున్నట్లు తెలియజేశారు. కాగా.. క్యూ3లో ఫీజు ఆదాయం 23 శాతం ఎగసి రూ. 1,847 కోట్లకు చేరింది. స్థూల మొండిబకాయిలు 2.71% నుంచి 1.90 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.79 శాతం నుంచి 0.43 శాతానికి తగ్గాయి.

ఐసీఐసీఐ లాభం జూమ్

డిసెంబర్ త్రైమాసికంలో రూ. 8,792 కోట్లు




ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో రూ. 8,792 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో ఆర్జించిన రూ. 8,312 కోట్లతో పోలిస్తే ఇది 34 శాతం అధికం. నికర వడ్డీ ఆదాయం సైతం 35 శాతం జంప్‌చేసి రూ. 16,465 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 0.7 శాతం బలపడి 4.65 శాతానికి చేరాయి. త్రైమాసికవారీగా స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.19 శాతం నుంచి 3.07 శాతానికి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి 16.26 శాతంగా నమోదైంది. అనుబంధ సంస్థలలో జీవిత బీమా లాభం రూ. 331 కోట్ల నుంచి రూ. 221 కోట్లకు క్షీణించింది. సాధారణ బీమా లాభం 11 శాతం మెరుగై రూ. 353 కోట్లను తాకింది. అసెట్ మేనేజ్‌మెంట్ లాభం రూ. 334 కోట్ల నుంచి రూ. 420 కోట్లకు వృద్ధి చూపింది. బ్రోకింగ్ విభాగం లాభం రూ. 281 కోట్లకు పరిమితమైంది.

స్లిప్పేజీలు ఇలా...

క్యూ3లో ఐసీఐసీఐ బ్యాంక్ స్థూల స్లిప్పేజీలు రూ. 5,723 కోట్లను తాకాయి. వీటిలో రిటైల్, రూరల్ బ్యాంకింగ్ విభాగం నుంచి రూ. 4,159 కోట్లు, కార్పొరేట్ల నుంచి రూ. 1,500 కోట్లు చొప్పున నమోదయ్యాయి. ఇక రూ. 2,257 కోట్లమేర ప్రొవిజన్లు చేపట్టింది. వీటిలో ప్రుడెన్షియల్ కేటాయింపులకింద రూ. 1,500 కోట్లు పక్కనపెట్టింది. దీంతో మొత్తం బఫర్ రూ. 11,500 కోట్లకు చేరింది. ఈ కాలంలో కొత్తగా ఏర్పాటు చేసిన 300తో కలిపి మొత్తం బ్రాంచీల సంఖ్య 5,700కు చేరింది.

ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయొచ్చా?

ఆల్టర్నేటివ్ డెట్ ఇన్‌స్ట్రుమెంట్లు, ముఖ్యంగా ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ గురించి తరచూ వింటున్నాను. ఇవి కాల పరీక్షకు నిలబడినవేనా? - శ్రీరామ్



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఈక్విటీలు దీర్ఘకాలంలో సంపద సృష్టికి ఉద్దేశించినవి. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాలు (డెట్ సెక్యూరిటీలు) పెట్టుబడికి రక్షణతోపాటు, ద్రవ్యోల్బణానికి అనుగుణంగా కొంత రాబడిని ఇచ్చేవి. ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్స్ అంటే, హెడ్జ్ ఫండ్స్, ప్రైవేటు క్యాపిటల్, సహజ వనరులు, రియల్ ఎస్టేట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై ఇన్వెస్ట్ చేస్తాయి. వీటన్నింటిలోనూ లిక్విడిటీ (పెట్టుబడులను నగదుగా మార్చుకునే సౌలభ్యం) తక్కువ. నియంత్రణలు, పారదర్శకత కూడా తక్కువే. వ్యయాలు ఎక్కువ. చారిత్రకంగా రిస్క్, రాబడుల డేటా కూడా పరిమితంగానే అందుబాటులో ఉంది. కనుక రిటైల్ ఇన్వెస్టర్లకు ఈ సాధనాలు సూచనీయం కాదు. ఇన్‌వాయిస్ డిస్కౌంట్ అన్నది వ్యాపారం కోసం సమీకరించుకునే తాత్కాలిక రుణం. సాధారణంగా బ్యాంకులు ఈ రుణాలు ఇస్తుంటాయి. ఇవి ప్రైవేటు క్యాపిటల్, ప్రైవేటు డెట్ కిందకు వస్తాయి. దశాబ్ద కాలం నుంచి ఉన్న ఉత్పత్తి ఇది. రిస్క్-రాబడుల కోణంలో చూస్తే అంత అనుకూలంగా కాదు. లాభాలు పరిమితం, నష్టాలు అపరిమితం. అంటే 100 శాతం నష్టానికీ అవకాశం ఉంటుంది. వైవిధ్యం పరంగా చూసినా పోర్ట్‌ఫోలియోకి వీటిని జోడించుకోవడం సహేతుకం కాదు. ఉదాహరణకు మీరు ఓ కంపెనీకి రుణంపై వస్తువులు సరఫరా చేశారని అనుకుందాం. దీనికి బిల్ జారీ చేస్తారు. ఈ బిల్లు గడువు (30-90 రోజులు) ముగిసిన తర్వాత కొనుగోలుదారుడు చెల్లించేందుకు అంగీకరిస్తాడు. ఒకవేళ ఈ లోపే మీకు డబ్బులు అవసరం పడితే బ్యాంకును సంప్రదించింది ఈ బిల్లుపై నిధులు పొందుతారు. బ్యాంకులు రిస్క్ ఆధారంగా బిల్లు మొత్తంలో కొంత తగ్గించి మిగిలింది ఇస్తాయి. దీన్నే ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ అంటారు. ఇప్పటి వరకు ఈ వ్యాపారాన్ని బ్యాంకులే నిర్వహిస్తుండగా, ఇటీవలే రిటైల్ ఇన్వెస్టర్లు సైతం ఈ బిల్లులపై రుణాలు ఇచ్చే అవకాశాన్ని కొన్ని ప్లాట్‌ఫామ్‌లు అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. ఒకవేళ రుణంపై వస్తువులు తీసుకున్న సంస్థలు చెల్లించడంలో విఫలమైతే ఏంటి పరిస్థితి? అందుకే రాబడుల కంటే ఈ రిస్కును రిటైల్ ఇన్వెస్టర్లు ముందు అర్థం చేసుకోవాలి. వీటిల్లో లిక్విడిటీ ఉండదు. మీరు విక్రయించాలంటే కొనుగోలుదారులు లభించకపోవచ్చు.

నేనొక మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్ ద్వారా ఇన్వెస్ట్ చేస్తున్నాను. అయితే, సదరు డిస్ట్రిబ్యూటర్ సేవల విషయంలో సంతోషంగా లేను. కనుక ఈ మొత్తం పోర్ట్‌ఫోలియోని మరో బ్రోకర్ వద్దకు మార్చాలని అనుకుంటున్నాను. అలా చేస్తే నేను పన్ను చెల్లించాల్సి వస్తుందా? - సల్మాన్ అహ్మద్

మీ మొత్తం పోర్ట్‌ఫోలియోని ప్రస్తుత డిస్ట్రిబ్యూటర్ నుంచి నూతన డిస్ట్రిబ్యూటర్‌కు మార్చుకోవచ్చు. రాతపూర్వకంగా అభ్యర్థన ఇవ్వాల్సి ఉంటుంది. ఇటువంటి సందర్భాల్లో మ్యూచువల్ ఫండ్ సంస్థ ప్రస్తుత డిస్ట్రిబ్యూటర్ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోరకూడదు. పన్ను విషయానికొస్తే, దీనిపై ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే పెట్టుబడులు కాకుండా, కేవలం డిస్ట్రిబ్యూటర్‌నే మారుస్తున్నారు. ఒక మ్యూచువల్ ఫండ్ పథకం నుంచి మరో మ్యూచువల్ ఫండ్‌కు మారినా లేదా రెగ్యులర్ ప్లాన్ నుంచి డైరెక్ట్ ప్లాన్‌కు మారినా పన్ను చెల్లించాల్సిన అవసరం ఏర్పడుతుంది.

పెట్స్‌కు బీమా.. యజమానికి ధీమా

పెంపుడు జంతువులకు ఇన్సూరెన్స్‌పై పెరుగుతున్న అవగాహన

బీమా కల్పించేందుకు ముందుకొస్తున్న కంపెనీలు



మహా నగరంలో నయా ట్రెండ్

సాక్షి, హైదరాబాద్: ప్రాణప్రదంగా పెంచుకున్న పెంపుడు జంతువులకు బీమా కల్పించడం ఇటీవలి కాలంలో అనూహ్యంగా పెరిగింది. ఆపదలో ఉన్న పెట్స్‌కు బీమా రూపంలో ఆపన్న హస్తం అందించేందుకు నగరవాసులు అమితాసక్తి చూపుతున్నారు. ఇటీవలికాలంలో సంపన్న వర్గాలతోపాటు ఎగువ మధ్యతరగతి, మధ్యతరగతికి చెందిన వారు కూడా తమ ఇళ్లలో పెంపుడు జంతువులను పెంచుకోవడంపై మక్కువ చూపుతున్నారు. ఈ నేపథ్యంలో వివిధ జాతులకు చెందిన కుక్కలు, పిల్లులు, పక్షులకు బీమా సౌకర్యం కల్పించేందుకు పలు ఇన్సూరెన్స్ కంపెనీలు ముందుకొస్తున్నాయి. గ్రేటర్ పరిధిలో ఇటీవల వేలాది జంతువులకు ఇలాంటి భరోసా కల్పించినట్లు బీమా కంపెనీలు చెబుతున్నాయి. సాధారణ అనారోగ్యం మొదలు చిన్నపాటి సర్జరీలు, కేన్సర్, గుండెజబ్బుల వంటి ప్రమాదకర వ్యాధుల చికిత్సలకు సైతం డబ్బులు చెల్లిస్తారు. వ్యాక్సినేషన్, డీవార్మింగ్, టిక్‌ట్రీట్‌మెంట్, డాక్టర్ విజిట్ వంటివి కూడా బీమా పరిధిలోకి రావడం విశేషం. ఒకవేళ ఆ పెట్ ఆకస్మికంగా మరణించినా యజమానికి బీమా మొత్తాన్ని చెల్లించే కంపెనీలు కూడా ఉన్నాయి.



నెలకు రూ.122 నుంచి 500 వరకు..

సాధారణంగా ఇళ్లలో పెంచుకునే శునకాల జీవితకాలం సుమారు 12 ఏళ్లు ఉంటుంది. అయితే బీమా కంపెనీలు రెండు నెలల నుంచి 8 ఏళ్ల మధ్య వయసున్న కుక్కలకు బీమా సౌకర్యం కల్పిస్తున్నాయి. రూ.40 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు బీమా సదుపాయం కల్పిస్తున్నాయి. ఇందుకోసం పెట్స్ యజమానులు నెలకు రూ.122 నుంచి 500 వరకు ప్రీమియంగా చెల్లిస్తున్నారు. పెంపుడు జంతువులకు అనారోగ్యానికి నెలకు రూ.8 వేల నుంచి 10 వేల వరకు ఖర్చు చేస్తున్న వారికి ఈ బీమా ఆర్థికంగా బాగా కలిసివస్తుందని వెటర్నరీ వైద్యులు చెబుతున్నారు. పెట్స్‌కు చికిత్సకయ్యే ఖర్చులో 80 శాతం వరకు కంపెనీ చెల్లిస్తుంది. కేన్సర్, గుండెజబ్బులు, కిడ్నీ సమస్యలు తదితర ప్రమాదకర వ్యాధుల సర్జరీలకు సుమారు రూ.2 లక్షల నుంచి 5 లక్షల వరకు ఉంటుంది. ఈ చికిత్సలు కూడా బీమా పరిధిలోకి వస్తాయి.

ముందుకొస్తున్న కంపెనీలు..

పెట్స్‌కు బీమా సౌకర్యం కల్పిస్తున్న వాటిలో పాటిక్వో వెటీనా హెల్త్‌కేర్ ఎల్ఎల్‌పీ, న్యూ ఇండియా అస్యూరెన్స్, పావ్ ఇన్సూరెన్స్ తదితర కంపెనీలున్నాయి. ఈ బీమా వ్యాపారం లాభసాటిగా ఉండటంతో ఇతర కంపెనీలు సైతం ఈ రంగంలోకి వస్తున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. నగరంలో పెట్స్‌ను విక్రయించే దుకాణాలు, వాటికి అవసరమైన ఆహారం, మందులు అందించే సంస్థలు సైతం బాగా విస్తరించాయి. ఇదే క్రమంలో బీమా సదుపాయం రావడంతో పెంపుడు జంతువుల బతుకులకు భరోసా లభిస్తోందని వెటర్నరీ వైద్యులు చెబుతున్నారు.

పెట్స్ బీమా అత్యవసర జాబితాలోకి..

“ఇప్పుడు పెట్స్ ఇన్సూరెన్స్ కూడా అత్యవసర జాబితాలోకి చేరింది. హెల్త్‌కేర్, సర్జరీ వంటివి యజమానికి భారం కాకుండా పలు బీమా కంపెనీలు పాలసీలు ఇస్తున్నాయి. ఎక్కువ మంది నగరవాసులు దీనిపై ఆసక్తి చూపుతున్నారు.

–డాక్టర్ ఎం.అరుణ్‌కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, సరూర్‌నగర్ ప్రైమరీ వెటర్నరీ సెంటర్



పరిపాలన మాతృ భాషలోనే జరగాలి

- పదవీ విరమణే చేశాను..పెదవి విరమణ కాదు
- దీపం ఆర్పే సంస్కృతి విదేశాలది..
- వెలిగించే సంస్కృతి మనది
- బీబీసీ డాక్యుమెంటరీతో దేశానికి అవమానం
- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



మణికొండ: దేశంలో ప్రధాన పరీక్షలను మాతృభాషలోనే నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం హర్షణీయమని, పరిపాలన, న్యాయ, వైద్య, శాస్త్ర సాంకేతిక లాంటి అన్ని రంగాలలో మాతృభాషను అమలు చేయాల్సిన అవసరం ఎంతో ఉందని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఆదివారం నార్సింగిలో సీనియర్ బీజేపీ నాయకుడు పి.మురళీధర్‌రావు సారథ్యంలో తెలుగు సంగమం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మాతృభాషను చిన్నచూపు చూసే భావన పోవాలన్నారు. గతంలో ప్రపంచానికే విశ్వగురువులుగా ఉన్న మనం రాబోయే పదేళ్లలో తిరిగి పూర్వ వైభవం సంతరించుకుంటామని వెంకయ్య నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. మనది దీపం వెలిగించే సంస్కృతి అని.. అదే పాశ్చాత్య దేశాల వారు వాటిని ఆర్పి ఉత్సవాలు చేసుకుంటారని వ్యాఖ్యానించారు. బీబీసీ డాక్యుమెంటరీలో ప్రధానమంత్రి మోదీ పట్ల అవమానకరంగా కథనం ప్రసారం చేయటం దేశానికే అవమానంగా భావించాలన్నారు. తాను పదవీ విరమణే చేశానని, పెదవి విరమణ చేయలేదని, రిటైర్డ్ అయ్యాను తప్ప టైర్డ్ కాలేదని ఆయన చమత్కరించారు.

మన సంస్కృతి ఎంతో గొప్పది..

మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని, వాటిని ప్రస్తుతం ప్రపంచమంతా ఆచరిస్తున్నారని, మనం మాత్రం వారు వదిలిపెట్టిన సంస్కృతి వెంట పడుతున్నామని హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిలు అన్నారు. కేంద్ర ప్రభుత్వం మాతృభాషకు మరింత ప్రాచుర్యం కల్పించేలా ప్రధాన పరీక్షలను స్థానిక భాషల్లోనే నిర్వహించేందుకు ముందుకు రావటం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో సినీ డైరెక్టర్ కె.రాఘవేంద్రరావు, పద్మశ్రీ డాక్టర్ శోభరాజు, డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ, లక్ష్మీనారాయణ, కామినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.